# శుభ 'మంగళం'

నవల

- పాణిని జన్నాభట్ల



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 260

కౌముది మాసపత్రికలో

జనవరి 2023 సంచిక నుంచి డిసెంబర్ 2023 సంచిక వరకూ

సీరియల్‌గా వచ్చిన నవల

1

## *ఏప్రిల్ 1, 2075 – ఫ్లోరిడా*

మసకగా తెల్లవారుతున్న ఫ్లోరిడా హైవే మీద చీకటిని చీల్చుకుంటూ దూసుకుపోతోందో ఎర్రటి టెస్లా కారు. హెడ్ లైట్స్ వెలుగులో ముందు రోడ్డంతా మెరుస్తోంది. ఆదివారం కావడంతో హైవే అంతా ఖాళీగా ఉంది. కారులో మంద్రంగా ఇండియన్ ఇన్స్ట్రుమెంటల్ సంగీతం మోగుతోంది. లోపలున్న రెండు సీట్లూ పూర్తిగా వెనక్కి రిక్లైన్ అయ్యి ఉన్నాయి. అందులో ఒక సీట్ మీద పడుకొనున్నాడు రిషీ. రింగులు తిరిగిన జుట్టూ, లైట్ షేడ్ లో గడ్డం, విశాలమైన నుదురు. ఎవరినైన ఇట్టే ఆకర్షించే నవ్వు. కారు లోపల వెలుగుతున్న చిన్న ఎల్.ఈ.డీ లైట్ కాంతిలో అతని ముఖాన్నే తదేకంగా చూస్తోంది విశా. తన పక్క సీటులోనే పడుకునుంది కానీ నిద్ర పట్టలేదు. అతని కళ్ళు మధ్యమధ్యలో మగతగా ఆమెని చూస్తూ మళ్ళీ మూత పడుతున్నాయి.

"*అర్ధరాత్రి లేపి తప్పు చేసానా*" అనుకుంది బాధగా.

"*తనకున్న టైమే తక్కువ...అందులో...*" నిట్టూర్చింది.

ఆ కారు డాష్ బోర్డ్ వైపు చూసింది. రెండువందల మైళ్ళ వేగం చూపిస్తోందా సెల్ఫ్ డ్రైవింగ్ కారు. సిటీ మ్యాప్ ప్రొజెక్ట్ అయ్యి ఉంది ముందు అద్దం మీద. వాళ్ళు చేరాల్సిన గమ్యం బ్లింక్ అవుతోంది మధ్యలో ఎర్రగా. "*జీవితం కూడా సెల్ఫ్ డ్రైవ్ ఐతే బాగుండు, గమ్యాన్ని ఫీడ్ చేస్తే అదే వెళ్ళేట్టు. మే బీ అలాగే వెళ్తోందేమో కానీ ఎప్పుడే మలుపు తీసుకుంటోందో తెలియట్లేదు*"

పక్కకి తిరిగి చూస్తూ విండో కిందికి దించింది. చల్లటి ఏప్రిల్ గాలి ఆమె ముఖాన్ని తాకుతోంది. చుట్టూ ఎగసిపడుతున్న అట్లాంటిక్ సముద్రపు హోరు లయబద్ధంగా వినబడుతోంది. దాని వెనకాల, *పైకి రావాలా వద్దా* అని సందేహిస్తూ దాగుడుమూతలాడుతున్న సూర్యుడు.

"*ఇలాంటి దృశ్యాన్ని మళ్ళీ చూస్తానో లేదో...*" అనుకుంటూ తన రెప్పలని ఆర్పి ఓ ఫొటో తీసుకుంది.

హఠాత్తుగా కారు లోపలి మ్యూజిక్ ఆగింది. స్పీకర్ నుంచి మెసేజ్ "టైమ్ టు డెస్టినేషన్ – థర్టీ మినిట్స్". రిషీ మెల్లగా కళ్ళు తెరిచాడు. వళ్ళు విరుస్తూ అన్నాడు విశాతో "ఏంటీ ఎయిర్ పోర్ట్ కెళ్ళాక లేపుదామనుకున్నావా?"

తనేమీ అనలేదు.

"అసలేంటి నువ్వు? నిన్నటి నుండి డల్ గా. సరిగా మాట్లాడట్లేదు, తినట్లేదు... ట్రావెల్ టెన్షనా బంగారం?" అన్నాడు ఆమె జుట్టుని సరిచేస్తూ.

తలూపింది చిన్నగా. నోరు తెరిస్తే ఎక్కడ ఏడ్చేస్తుందోనన్న భయం.

"హుమ్...డోంట్ వర్రీ, ఫ్లైట్ లో జస్ట్ అయిదు గంటల్లో హైదరాబాద్ లో ఉంటావ్. అక్కడ్నించి ఊరికి ఫ్లైయింగ్ టాక్సీ తీస్కో. ల్యాండ్ టాక్సీల కన్నా మచ్ ఫాస్టర్ అండ్ సేఫర్" అన్నాడు ఆమె నుండి చూపు తిప్పుకోకుండా. సింపుల్ గా ఉన్న పసుపు ఫ్లోరల్ ఫ్రాక్ లో ఉంది విశా. రిషీకి ఇష్టమైన డ్రెస్ అది. కోల ముఖం, సన్నటి ముక్కూ, మెరిసే బుగ్గలూ.

"రిషీ, నన్ను వదిలేసి ఉండగలవా?" అంది తను అకస్మాత్తుగా.

"కష్టమే, కానీ రెండు వారాలేగా. నువ్వూ నాతో కలిసి వస్తావనుకున్నా. కానీ హడావిడిగా వెళ్ళిపోతున్నావ్. నా సర్టిఫికెట్ చేతిలో పడ్డ వెంటనే జంప్ ఇక్కణ్ణించి. సరాసరి మీ ఊరికే వచ్చేస్తా!" అన్నాడు కన్ను కొడుతూ.

"నన్ను మర్చిపో...ప్లీజ్!" చెంపలమీద కన్నీళ్ళు జారుతున్నాయి.

ఆశ్చర్యంగా చూసాడు తను. "ఛ, ఛ, ఏంటి విశా? ఏమైందిప్పుడు?" అన్నాడు కన్నీటిని తుడుస్తూ.

మళ్ళీ అనౌన్స్ మెంట్ – "రీచింగ్ యువర్ డెస్టినేషన్ ఇన్ టెన్ మినిట్స్"

"అరే! అప్పుడే వచ్చేసిందా ఎయిర్ పోర్ట్. హడావిడిలో అడగటం మర్చిపోయా. ఏ ఎయిర్‌లైన్స్? ఎక్కడ నీ గేట్? చెక్ ఇన్ చేసావా?" ఊపిరాడనివ్వట్లేదు.

విశా నోట్లో తడారిపోతోంది. బలవంతంగా ధైర్యాన్ని కూడతీసుకుని అంది "రిషీ, నేను వెళ్ళాల్సింది ఇక్కడికి కాదు, వేరే చోటకి!"

అతను అయోమయంగా చూసాడు.

ఎదురుగా ఉన్న టచ్ స్క్రీన్ పైన డెస్టినేషన్ మార్చింది తను.

ఆశ్చర్యపోయాడది చూసి . "అక్కడినుంచి ఈ మధ్య ఫ్లైట్స్ కూడా నడుస్తున్నాయా? వావ్! నాకు ఐడియా లేదు" అన్నాడు.

తల సగం ఊపింది తను. పావుగంట తర్వాత ఓ విశాలమైన పార్కింగ్ లాట్ లో ఆగిందా కారు.

కిందకి దిగాక రిషీ చేతిని తన చేతిలోకి తీసుకుంటూ మళ్ళీ అంది "నన్ను మర్చిపోవడానికి ప్రయత్నించు రిషీ..ప్లీజ్..నువ్వు మర్చిపోతే గానీ నేను బతకలేను"

"అబ్బా...ఐ విల్ మిస్ యూ టూ రా...వెంటనే వచ్చేస్తాగా..." అన్నాడు హగ్ చేస్కుంటూ. విశానెప్పుడూ అలా దీనంగా చూడలేదతను. *ఏదో అయ్యింది.*

"నేనింక వెళ్ళాలి, మళ్ళీ బోర్డింగ్ ప్రాసెస్ కి టైం పడుతుంది" అంది.

"సరే నేనూ వస్తా. నీ బోర్డింగ్ అయ్యాక వెళ్తా. పనేముంది మనకి" అన్నాడు పళ్ళికిలిస్తూ.

"వద్దు, నిన్ను రానివ్వకపోవచ్చు. అయినా నేను వెంటనే లోపలికెళ్ళిపోతాను"

"ఏంటి, నన్ను అవాయిడ్ చేయ్యాలనుకుంటున్నావా? చూస్తే వదిలించుకుంటున్నట్టుంది నీ బిహేవియర్" అన్నాడు వెటకారంగా.

పెదాల్ని నొక్కిపట్టి అసహాయంగా కిందకి చూసింది. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.

"వద్దులే నువ్వేడవకు...రాన్లే. ఎన్నింటికి నీ ఫ్లైట్ ఇంతకీ?"

"రాత్రి తొమ్మిదింటికి..."

"వాట్! రాత్రెప్పుడో ఫ్లైట్ కి ఇంత పొద్దున్నే తెచ్చావా? పిచ్చా నీకు?" అరిచాడు కోపంగా.

"తప్పదు, మా నాన్న షెడ్యూల్ ప్రకారం అంత టైం పడుతుందిట"

"దిస్ ఈస్ క్రేజీ! మీ నాన్నకి చాదస్తం ఎక్కువ లాగుంది. నాకివ్వు నేను ఫోన్ చేసి మాట్లాడతాను?"

"వద్దు ఈ టైమ్ లో పడుకోనుంటారు"

"ఇప్పుడింకా ఇండియాలో ఈవినింగ్ నాలుగైంది. ఇప్పుడే నిద్రేంటి?"

తనేమీ అనలేదు. చేతికున్న బ్యాండ్ మీద నొక్కింది. ఓ రోబో వచ్చి ట్రాలీలో ఆమె లగేజ్ తీసుకెళ్తోంది లోపలికి. దాని వెనకే లోపలికి నడుస్తోంది విశా.

వెనక నుంచి రిషీ "బంగారం! మీ ఊరూ, అడ్రెస్సన్నా చెప్పవే..వచ్చే వారం రెక్కల ట్యాక్సీలో రావాలిగా" చీర్ అప్ చేయబోయాడు.

గొంతులోంచి మాట పెగలట్లేదు విశాకి. చెప్పకుండా వెళ్ళి మోసంచేసానన్ బాధతో జీవితాంతం బతకలేదు. మెల్లగా వెనక్కి తిరిగింది.

"టాక్సీలో రాలేవు రిషీ మా వూరికి"

"ఏం మాట్లాడుతున్నావ్? భూమ్మీద నేను రాలేని ఊరే లేదు..."

"హుమ్..అదే సమస్య"

"ఏది!?"

"మేముండేది భూమ్మీద కాదు!"

విశా లోపలికెళ్ళి గంటదాటుతున్నా, రిషీ ఇంకా ఆ షాక్ లోనే ఉన్నాడు. అంతా అయోమయంగా ఉంది. ఎదురుగా ఉన్న పెద్ద బిల్డింగ్ పైన పెద్దగా మెటాలిక్ కలర్ లో మెరుస్తున్న పేరు చూస్తూ నోరు తెరిచాడు – "గ్లోబల్ మార్స్ లాంచింగ్ స్టేషన్!"

విశా లోపలికైతే వెళ్ళింది కానీ తన మనసు మనసులో లేదు. మెకానికల్ గా చేస్తోంది పనులన్నీ. స్పేస్ సూట్ వేసుకుంటూ తనని తను ప్రశ్నించుకుంది. రిషీని మోసం చేసానని తనని తనే తిట్టుకుంది. సాయంత్రం వరకూ రకరకాల టెస్ట్ లు చేసారు విశాకి స్పేస్ ట్రావెల్ కి ముందు జాగ్రత్తగా. వాటి మధ్యలో చాలా సార్లు రిషీకి కాల్ చేద్దామనుకుంది కానీ

ధైర్యం చాల్లేదు. చివరిగా రాకెట్ లోకి అడుగుపెట్టబోయేముందు గుండె బరువు తట్టుకోలేక మెసేజ్ పెట్టింది – "నువ్వు లేకుండా బతకలేను"

విశా తననెందుకు మోసం చేసింది? రెండేళ్ళల్లో ఒక్కసారైనా ఈ టాపిక్ తేలేదు తను. చెప్తే బ్రేక్ అప్ అవుతుందని భయపడిందా? లేతే తనతో ఆడుకుందా?

తన ఆలోచనల్ని బ్రేక్ చేస్తూ వచ్చిన మెసేజ్ ని చూస్తూ నిలబడిపోయాడు రిషీ. బిగపట్టిన కన్నీళ్ళకి ఆనకట్ట వెయ్యలేక ఎరుపెక్కిన విశా ముఖం కనపడింది ఆ మెసేజ్ లో తనకి.

*"నేనూ బతకలేనే"*

## 2

*మే 1, 2075 – హైదరాబాద్*

ఎప్పుడూ హడావిడిగా, జాలీగా ఉండే రిషీ ఇంటికొచ్చి మూడ్రోజులు దాటినా సరిగ్గా మాట్లాడకపోవడం, ఏదో పోగొట్టుకున్న వాడిలా అయోమయంగా తిరుగుతుండటంతో తండ్రి జగదీశ్ కేదో అనుమానం వచ్చింది. తను వద్దన్నా గొడవచేసి అమెరికాకి వెళ్ళిన రిషీ పైనా, పంపిన భార్య సునంద పైనా పీకలదాకా కోపం ఉన్నా, మౌనంగా ఉంటూ వచ్చాడు. అదీ కాక తను పెట్టిన కండిషన్ ఎంతవరకూ పాటిస్తాడో రిషీ అనే డౌట్. ఇంక లాభంలేదని కొడుకుని హాల్లోకి పిలిచాడు. నిర్లిప్తంగా వచ్చాడు రిషీ. సునంద కూడా పక్కనే కూర్చుంది సపోర్ట్ గా!

"రిషీ, ఏమైంది? రిటర్న్ వచ్చినప్పట్నుండీ డల్ గా ఉంటున్నావ్, ఎనీథింగ్ రాంగ్?" అడిగాడు సూటిగా.

సునందకి గాభరాగా ఉంది రిషీ ఎక్కడ స్లిప్ అయ్యి తిట్లు తింటాడో అని. జగదీశ్ ఇలాంటి అవకాశం కోసమే చూస్తున్నాడసలే రెండేళ్ళనుండీ.

అతని వీపు మీద చేత్తో నిమిరి కళ్ళతో చెప్పమన్నట్టు సైగ చేసింది.

"ఏం లేదు, కొంచెం జెట్ లాగ్ అంతే, మీరిద్దరూ ఈ ఇంటరాగేషన్లు ఆపుతారా" అన్నాడు తను చిరాకు నటిస్తూ. లోపలైతే అంతా గందరగోళంగా ఉంది.

ఇలా కాదని "నీ ఫ్రెండ్ నిహార్ లాస్ట్ వీక్ వచ్చాడింటికి, మాటల్లో నీ విషయం అంతా చెప్పాడు" అన్నాడు జగదీశ్.

రిషీ అర్థంకానట్టు మొహం పెట్టి అంతలోనే ఏదో గుర్తొచ్చినట్టు తలపట్టుకోని "వాడో పెద్ద ఇడియట్! అనవసరంగా వాడికి చెప్పాను. అయినా ఆ అమ్మాయిప్పుడిక్కడ లేదు" అని నాలుక్కరుచుకున్నాడు.

తన ప్లాన్ వర్కవుట్ అయినందుకు సునందవైపో నవ్వు విసిరి "ఎవరా అమ్మాయి...?" అని జగదీశ్ అంటుండగానే డోర్ లోంచి అరుపు "రేయ్ రిషీ, ఎప్పుడొచ్చావ్? ఎలా ఉన్నావ్? ఒక్కమాటైనా చెప్పలేదొదినా నాకు వీడొస్తున్నట్టు?" తుఫాన్ లా వాళ్ళని ఊపిరాడనివ్వట్లేదు రిషీ బాబాయి మల్లి. యాభై ఐదేళ్ళు దాటినా ఏమాత్రం తగ్గకుండా పసుపు షార్ట్స్, ఆరెంజ్ కలర్ టీషర్ట్ వేస్కోనున్నాడు.

“సరిగ్గా టైంకొస్తావురా నువ్వు పనీపాటా లేకపోతే” విసుక్కున్నాడు జగదీశ్. మల్లి అదేం పట్టించుకోలేదు. కూల్ గా రిషీ పక్కన కూర్చుంటూ “ఏరా, నేనడిగిన బ్రాండ్ తెచ్చావా?" అన్నాడు అన్నా వదినలవైపు మొహమాటంగా చూస్తూ.

మనిషి కాకపోయింటే మల్లిని వండుకుని తినేసేవాళ్ళే కోపంతో. ఆ ఛాన్స్ లేక పళ్ళుకొరికి ఊరుకున్నారిద్దరూ. మళ్ళీ మల్లే అందుకుని “ఏంటన్నయ్యా, ఇందాకేదో అమ్మాయంటన్నావ్? కొంపదీసి మనోడేమన్నా...? అంటూ రిషీ వీప్పైన చరిచాడు తన వైపు కొంటెగా చూస్తూ.

రిషీకి మండింది "అవును, అమ్మాయే, అమ్మాయి గురించే ఆలోచిస్తున్నాను. నీకేమన్నా ప్రాబ్లెమా?" అడిగాడు సూటిగా.

"నాకేం ప్రాబ్లెం? నో ప్రాబ్లెం, ఆల్ హ్యాపీస్. విష్ యూ హ్యాపీ న్యూ ఇయర్" అన్నాడు మల్లి హడావిడిగా.

జగదీశ్ ముఖం ఎరుపెక్కింది. "చూశావా సునందా! వీడి పొగరు, పీహెచ్డీ కెళ్ళేముందు చిలక్కి చెప్పినట్టు చెప్పా అక్కడి అమ్మాయిల మోజులో పడద్దురా అని. చివరికదే చేసి ఉద్ధరించాడు నీ కొడుకు" అన్నాడు మాట విరూస్తూ.

కొడుకెంత ఇష్టమైనా సునందక్కూడా నచ్చట్లేదీ విషయం.

"నీ చాదస్తం కాకపోతే అన్నాయ్. తెలుగు పిల్ల కన్నా తెలుపు పిల్ల మిన్న అనుకోనుంటాడు రిషీగాడు. ఏరా, ఇంతకీ పిల్లెలా ఉంటది?" అన్నాడు.

"ప్లీజ్ ఆపుతారా? ఓ మీ ఇష్టానికి మీరు ఏదో అనేస్కుంటూ పోతున్నారు. అసలా అమ్మాయి అమెరికన్ కాదు"

"మరి, చైనీసా?" నాన్న.

"ఆఫ్రికనా?" అమ్మ.

"కొంపదీసి పాకిస్థానీయా?" అన్నాడు బాబాయ్ వంకర మొహం పెట్టి.

అదిరిపడ్డాడు జగదీశ్. అందరూ డౌట్ గా చూస్తున్నారు రిషీ వైపు.

రిషీ విసుగ్గా పైకి లేస్తూ అన్నాడు "ఏహె, మీరూ, మీ సుత్తి ఊహలూ. తను తెలుగమ్మాయే. చక్కగా మాట్లాడగలదు కూడా"

ముగ్గురూ ఒకళ్ళమొహాలొకళ్ళు చూసుకున్నారు. తెలుగమ్మాయినే చేసుకోవాలన్న తన కండిషన్ని దాటనందుకు లోపలే ఆనందపడిపోయాడు జగదీశ్.

సునంద కళ్ళల్లో నీళ్ళు ('మమతల తల్లీ' అనే క్లాసికల్ సాంగ్ బ్యాగ్రౌండ్ లో)

"సూపర్ రా! మరింకెందుకు ఆలశ్యం. వాళ్ళ అమ్మానాన్నతో చెప్పి ముహూర్తాలు పెట్టిద్దాం, ఏం చేస్తాడాయన?" అడిగాడు మళ్లి ఉత్సాహంగా.

"నాసాలో చీఫ్ ఇంజినీర్ గా చేసి రిటైరయ్యారట. తర్వాత అమెరికా నుండి వెళ్ళిపొయ్యారు. నేనూ ఎప్పుడూ కలవలేదు వాళ్ళని" అన్నాడు రిషీ భయంభయంగా.

"వీడు మామూలోడుకాదన్నాయ్, మన ప్రమేయం లేకుండానే నీకు తగ్గ సంబంధం తెచ్చుకున్నాడు" అన్నాడు మళ్లి గర్వంతో చూస్తూ. జగదీశ్ కీ ఆనందంగానే ఉంది.

"రిటైర్ అయ్యి మళ్ళీ ఇక్కడికే వచ్చేసుంటారు. ఆస్తులూ బాగా కూడేసుంటారు...ఇంతకీ మన వాళ్ళేనా?" అడిగాడు జగదీశ్ యాథాలాపంగా.

ముగ్గురూ తినేసేట్టు చూసారతని వైపు.

"నాన్నా ట్వంటీసెకండ్ సెంచురీకి దగ్గర్లో ఉన్నాం, ఏంటీ ప్రశ్నలు...?" అన్నాడు రిషీ తలవిదిలిస్తూ.

"భలేవాడివే, సెంచురీ మారుద్దని తాగుడు మానామా? గ్యాంబ్లింగ్ మానామా? ఇదీ అలాంటిదే... ఓ వ్యసనం. నువ్వు పట్టించుకోకన్నయ్యా" అన్నాడు బాబాయ్ అనునయంగా.

"అది సరే కానీ, ముందు చెప్పు మున్నా. వాళ్ళదే ఊరు?" అడిగింది సునంద ఆతృతగా.

తటపటాయించాడు రిషీ. చెప్పినా, చెప్పకపోయినా పెద్ద ఉపయోగం లేదు. కానీ ఆ ముగ్గురి ముఖాల్నీ చూసి తప్పలేదు.

"వాళ్ళు, మా..మా.."

"మచిలీపట్నం! ఊరంతా మనవైపు చుట్టాలే అన్నాయ్" అరిచాడు మల్లి.

"ఏరా, నాసాలో రాకెట్లకి నట్లు బిగించి విసుగొచ్చి చివరికి బందరు బీచ్ దగ్గర సెటిలయ్యాడన్నమాట మీ మావ" చిలిపిగా అన్నాడు తనే మళ్ళీ.

"కాదు బాబాయ్..అదీ..మ..మ.."

"మంగళగిరా? మా పెద్దన్నయ్యక్కడే ఉన్నాడు. పెళ్ళి పనులు వాడికప్పగిస్తానైతే" అంది అమ్మ ఆశగా.

"లేదే..వాళ్ళుండేది మార్స్ లో" అన్నాడు రిషీ వేలు పైకి చూపిస్తూ.

ముగ్గురూ సీలింగ్ వైపు చూస్తూ నోళ్ళు వెళ్ళబెట్టారు.

3

తర్వాతి నెల రోజులూ ఇబ్బందిగా గడిచాయి అందరికీ.

ఓ రోజు డైనింగ్ టేబుల్ దగ్గర జగదీశ్ “నాకు తెలీకడుగుతా, తెలుగు వాళ్లని చూస్కోరా అంటే, ఈ దరిదాపుల్లో లేని గ్రహాంతర వాసుల్ని చూస్కున్నావేంట్రా?” అన్నాడు ఆవేశంగా.

"తనని చూసి ఏ మారేడ్పల్లో, మాసాబ్ ట్యాంకో అనుకున్నా నాన్నా!" అమాయకంగా అన్నాడు రిషీ.

"మనకివన్నీ కుదరవు కానీ, తనని మర్చిపో మున్నా." అంది బాధగా సునంద అతని తలపై నిమురుతూ.

ఆమె చెయ్యి విదిలించుకొని విసురుగా లేచి రూంలోకెళ్ళిపోయాడు రిషీ.

ఇంకో రోజు ఇంట్లోకొస్తున్నప్పుడు బాల్కనీలో గుసగుసలు వినిపిస్తే అక్కడే గోడ వెనక నించున్నాడు వెళ్ళి. బైట దీర్ఘంగా ఆలోచిస్తూ బిల్డింగ్ కిందికి చూస్తున్నాడు జగదీశ్. పక్కనే మల్లి సునందతో

"నీ కన్నా ముందో గొప్ప సంబంధం వాళ్ళు కోటి కట్నం ఇస్తామన్నా ఆ అమ్మాయికి కుజదోషం ఉందని, కుడి కంటితో కూడా చూడకుండా వదిలేసాడొదినా మా అన్న. అలాంటిది కుజ గ్రహం మీద అమ్మాయే కోడలంటే...?"

"కరెక్టే కానీ రిషీ గాడి పరిస్థితి రోజురోజుకీ దిగజారిపోతోంది. అస్సలు తినట్లేదు, తాగట్లేదు." అంది దిగులుగా.

"తినక పోతే పొయ్యాడు, కనీసం తాగాలి కదా వెధవ." అన్నాడు మల్లి.

ఇద్దరూ సీరియస్ గా చూశారు. అలానే ఉంటే కిందికి తోసేస్తారేమోనని భయం వేసి మాట మార్చాడు.

"అవునన్నయ్యా, నాకో డౌట్, కుజ గ్రహం మీదుండే అమ్మాయికి కుజ దోషం అంటదేమో? ఆలోచించు." అని వాళ్ళు ఆలోచనలో పడటంతో ఊపిరి పీల్చుకుని అక్కడినుంచి మెల్లగా జారుకున్నాడు.

ఓ రాత్రి రిషీ మెల్లగా సునంద దగ్గరికెళ్ళి అన్నాడు "తను చాలా తెలివైనదమ్మా, అగ్రికల్చర్ సైన్స్ లో సాయిల్ లేకుండా రకరకాల క్రాప్ లని ఎలా పెంచాలో రీసెర్చ్ చేస్తోంది. నాకు ఓ క్లాస్ లో పరిచయమయ్యింది. గత రెండేళ్లలో విడిపోలేనంత దగ్గరయ్యింది. కానీ తనిలా మోసం చేస్తుందని..."

"తన తప్పేం లేదు మున్నా, చెప్తే నువ్వెక్కడ దూరమైపోతావో అని చెప్పలేదేమో...?"

"చెప్పినా, చెప్పకపోయినా దూరమైపోయింది కదా?" అన్నాడు ఆకాశంలోకి చూస్తూ.

కొడుకు మీద ఆలోచనలతో సతమత మౌతున్న జగదీశ్ ఓ అర్ధరాత్రి హఠాత్తుగా

"చంపొద్దు...నన్ను చంపొద్దు..." అని అరుస్తూ గొంతు పట్టుకుని పైకి లేచి కూర్చున్నాడు.

సునంద ఉలిక్కిపడి లేచి "ఏమైందండీ? కలొచ్చి చచ్చిందా...?" అంది చిరాగ్గా.

"చంపుతున్నాడే...చంపబోతున్నాడే...!"

"ఎవడు? ఎక్కడ?" అంది పక్కనున్న గ్లాసునీళ్ళందిస్తూ.

వాటిని గడగడా తాగేసి కళ్ళు పెద్దవి చేస్తూ అన్నాడు "మన మనవడే...మార్స్ నుండి రాకెట్టేసుకొచ్చి మనందర్నీ లేజర్ కొడవలితో తెగ నరుకుతున్నాడు...మనవాడు వాళ్లమ్మకి చేసిన అన్యాయానికి ప్రతీకారంగా!"

"నా బొంద, ఆ పాత ఫాక్షన్ మూవీలు చూడొద్దంటే వినరు. పైగా అవి పెద్ద క్లాసిక్కు మీకు...లేజర్ కొడవలంట!"

"అది కాదే, మన వాడు కాలు జారాడంటావా ఆ అమ్మాయితో...?"

"ఇదిగో, రిషీ గురించి పిచ్చి పిచ్చిగా మాట్లాడితే నేనే మీ పీక నొక్కుతా! పడుకోండి." అని ఓ అరుపు అరిచింది.

చటుక్కున పడుకున్నాడు జగదీశ్ *"దీంతో గొడవెందుకు అర్ధరాత్రి పూట"* అనుకుంటూ.

ఇంక ఇలా కాదని తర్వాతి రోజు ఇద్దరూ ఓ నిర్ణయానికొచ్చారు. ఎలాగూ సంపాదించిందంతా వాడికే కదా, వాడిష్టమొచ్చినట్టే చేద్దాం కానీ ముందా అమ్మాయి పేరెంట్స్ తో మాట్లాడదాం అన్నారు మల్లితో. మల్లి హడావిడిగా రిషీ దగ్గరికెళ్ళి "కంగ్రాట్స్ రా, నీ పెళ్ళి మాటలకి ఇంట్లో రెడీ" అన్నాడు అతడ్ని పట్టుకొని ఊపేస్తూ.

రిషీ ఆనందంతో ఇల్లంతా ఓ రౌండేసి దొరికినవాళ్ళకల్లా హగ్ లిచ్చాడు. పనిమనిషి భయపడితే తెలివి తెచ్చుకొని 'సారీ' అంటూ పారిపోయాడు.

★★

ఈ వార్త విశాకి వెంటనే చెబ్దామని ఉత్సాహంగా తన రూంలోకెళ్ళి తన చేతికున్న వాచ్ లాంటి డివైజ్ ని నొక్కాడు రిషీ. ఎదురుగా గాల్లో ఓ స్క్రీన్ ప్రొజెక్ట్ అయ్యింది. దాంట్లో 'నీ ఫేసు' యాప్ తెరిచి విశాకొక మెసేజ్ పెట్టాడు. "మాట్లాడాలి, అర్జంట్!" రెండు నిమిషాల పాటు ఏం రిప్లై లేదు.

రిషీకి ఒక్కో క్షణం ఒక్కో యుగంలా గడుస్తోంది. *"ఈ నెల గ్యాప్ లోనే విశా నన్ను మర్చిపోయిందా? మార్స్ లో ఎవరైనా కొత్త బాయ్ ఫ్రెండ్? ఛ ఛ!"* అని తిట్టుకునే లోపలే విశా నుండి మెసేజ్

"ఏంట్రా, ఇప్పటికి గుర్తొచ్చానా?" అని.

"ఇలాంటి మాటలు వినే మామిడాల వలసనుకున్నా నిన్ను, అంతే గానీ గ్రహాంతర రాకాసి వని తెలీదు"

"అసలే ఏడుస్తుంటే ఇంకా ఏడిపించటానికి పిలిచావా? ఇదేనా అర్జంట్?"

"ఛ, అది కాదు, సూపర్ గుడ్ న్యూస్. మన పెళ్ళికి మా ఇంట్లో ఒప్పుకున్నారు!"

"వ్వాట్!!"

"అవును, క్రేజీ కదా?"

"నాకు మాటలు రావట్లేదు, ఇదస్సలు ఎక్స్పెక్ట్ చెయ్యలేదు."

"అంతా మన అబ్బాయి వల్లే."

"ఏంటీ?"

"ట్రూ, మనకి పుట్టబోయే కొడుకు నాన్నని బెదిరించాడంట కలలో..."

"జోక్ చెయ్యకు రిషీ, అసలు నువ్వు చెబ్తుందంతా నిజమేనా? నాకే దో డౌట్ గా వుంది"

"నిజం చెప్తే ఎప్పుడు నమ్మిందే పాడు లోకం! ప్లీజ్, చాలా కష్టపడి ఒప్పించాను. నెక్స్ట్ సండే మీ వాళ్లతో మాట్లాడతామన్నారు మా వాళ్ళు. నీకు ఓకే కదా? మీ ఇంట్లో చెప్పావా ఇంతకీ?" అన్నాడు సందేహంగా.

"అవసరం లేదు, నా మొహం చూసి మా అమ్మ వచ్చిన రెండురోజుల్లో చెప్పేసింది. మా డాడీకి కోపం వచ్చింది కానీ ఇదెలాగూ జరిగే పని కాదు కదా అని నేనే ఎక్కువ బలవంత పెట్టలేదు..."

"అదేంటి అంత మాటనేసావ్? నీ గురించి ఇక్కడ నేను యుద్ధాలు చేస్తుంటే, నువ్వు లైట్ తీసుకున్నావా? "

"అవున్రా, అసలిదంతా ఎలా పాసిబుల్ అనిపిస్తోంది?" అంది బాధగా.

"ఎలాగోలా వర్కౌట్ చేద్దాం, ముందైతే వాళ్లని మాట్లాడ నీ. మర్చిపోకు...నెక్స్ట్ సండే."

ఒక లవ్ సింబల్ రిప్లై పంపింది విశా.

## 4

తర్వాతి ఆదివారం ఇంట్లో అంతా హడావిడిగా ఉంది. పొద్దున్నే లేచి వాళ్ళ పెద్ద హాల్లో మధ్య టేబుల్ మీద ఓ ప్రొజెక్టర్, దానికి ఎదురుగా ఓ బ్లాక్ స్క్రీన్ బిగించాడు రిషీ. అవన్నీ అందరికీ తెలిసినవే. అమ్మా, నాన్న, రిషీ ఒక సోఫాలో, పిన్నీ, బాబాయ్, వాళ్ళమ్మాయి నీలూ పక్క సోఫాలో కూర్చొన్నారు. అందరూ మెరిసిపోతున్న బట్టల్లో ఉన్నారు.

వాళ్ళు రెడీ అయ్యాక, విశాకి మెసేజ్ చేశాడు. తనూ 'రెడీ' అన్నాక ప్రొజెక్టర్ ఆన్ చేశాడు రిషీ. మెల్లగా ఆ హాల్లో సోఫాకి ఎదురుగా విశా ప్రత్యక్షమైంది. 3డి లో నిజంగా కళ్ల ముందే ఉన్నట్టు కనబడుతోంది తను. సన్నగా, కోలగా ఉన్న ముఖంతో, పొడుగు జడతో, పింక్ పట్టుచీరతో అందంగా, సాంప్రదాయంగా ఉంది. జగదీశ్, సునందలు సంతోషంతో ఒకరినొకరు చూసుకున్నారు. పక్కనే ఉన్న మల్లి రిషీ తొడ మీద ఒకటి చరిచి "అందమైన భార్యని కొట్టేసావ్." అన్నాడు చిన్నగా కన్నుకొడుతూ. కజిన్ నీలూ కళ్ళెగరేసింది సిగ్గుపడుతున్న రిషీని చూస్తూ.

విశా వాళ్ళ అమ్మా నాన్నలు వచ్చి కుర్చున్నారు తన పక్కన. "హలో అండీ!" అన్నాడు వాళ్ళ నాన్న. బూమింగ్ వాయిస్. నున్నటి గుండు, ఎర్రటి నామం నుదుటిమీద. జగదీశ్ కూడా "నమస్తే" అన్నాడు అతడిని ఆశ్చర్యంగా చూస్తూ. మల్లి రిషీని పక్కకి లాగేసి అన్న జగదీశ్ పక్కన చేరి వంగి తన చెవిలో "అన్నయ్యా, ఇతనేంటి క్షుద్రపూజలు చేసేవాడి లాగా ఉన్నాడు! పైగా పాత విలన్ అమ్రిష్ పూరీ లాంటి గొంతు. నాకెందుకో డౌట్ గా ఉంది 'అసలితను నాసాలో సైంటిస్టే నా లేక రాకెట్లు పేలిపోకుండా పూజలూ గట్రా చేయిస్తాడా?' అని"

జగదీశ్ అతడిని కోపంగా ఓ చూపు చూసి "నమస్తే అండీ, నా పేరు జగదీశ్, రియల్ ఎస్టేట్ వెంచర్స్ చేస్తూ ఉంటాను. నా భార్య సునంద, కొడుకు రిషీ. వీళ్ళు నా తమ్ముడు ఫ్యామిలీ" అన్నాడు అందరి వైపూ చూపిస్తూ.

"వావ్! నైస్ ఫ్యామిలీ." అన్నాడు విశా నాన్న. "నేను మహానంద్, మహా అంటారు. నాసా మార్స్ మిషన్స్ లో చీఫ్ సైంటిస్ట్ గా చేస్తున్నాను గత ముప్పై ఏళ్లుగా. తిను నా భార్య కీర్తి, కూతురు విశా."

ఇంకా జగదీశ్, సునందలు తన ముఖం వైపే తీక్షణంగా చూస్తుంటే నవ్వి మళ్ళీ అన్నాడు మహా "నాకు సాంప్రదాయాలంటే చాలా ఇష్టం, నమ్మకం కూడా. నేను ఎంత సైంటిస్ట్ నైనా, దేవుణ్ణి నమ్ముతాను. మా ఇంట్లో ఆచారాలన్నీ పాటిస్తాం." అన్నాడు చుట్టూ చూస్తూ.

వాళ్ళ వెనకే పెద్ద బాలాజీ ఫొటో, ఆ పక్కనే ఇంకొన్ని దేవతల ఫొటోలూ వేలాడుతున్నాయి.

"వీళ్ళు మార్స్ కాదు, మామిడా వలస బ్యాచ్ లా ఉన్నారు." నసిగాడు మల్లి పక్కన.

"గ్రేట్! మీరు అంత దూరంలో ఉండి కూడా అన్నీ పాటిస్తున్నందుకు." అంది సునంద మెచ్చు కోలుగా.

"దూరంగా ఉంటేనే ఎక్కువ నమ్మకాలుంటాయండీ." అంది విశా అమ్మ నవ్వుతూ.

అందరూ అసలు విషయంలోకి రావట్లేదని చిన్నగా దగ్గాడు రిషీ. జగదీశ్ అందుకుని

"అదేనండీ, మా వాడు మీ అమ్మాయిని బాగా ఇష్టపడుతున్నాడు. వాడు నిద్రపోవట్లేదు, మమ్మల్నీ పోనివ్వట్లేదు. మాగ్కూడా విశా బాగా నచ్చింది. ఇప్పుడు కళ్ళారా చూశాక మా కోడల్ని చేసుకోవాలన్న ఆలోచన బలపడింది." అన్నాడు నవ్వుతూ. సునంద కూడా తలూపుతోంది.

"మా విశా కూడా ఇక్కడ జూలియట్ లాగా తయారైందండీ. ఏమీ తినదూ, తాగదూ. ఎప్పుడూ మీ వాడి ధ్యాసే. నా మటుకు నాకు భూమ్మీద సంబంధం అంటే అస్సలు ఇష్టంలేదు. అమ్మాయికి దూరంగా ఉండాల్సొస్తుందని. కానీ దాని పట్టుని కాదనలేకపోయాం." అన్నాడు మహా కుండ బద్దలు కొడుతూ.

"మరింకేం, ఆలశ్యం చెయ్యకుండా ముహూర్తం పెట్టించేద్దాం ఇప్పుడే, ఏమంటారు?" అన్నాడు మల్లి.

సునంద ఆశ్చర్యపోతూ "ఇప్పటికిప్పుడు ముహూర్తమంటే ఎలా మల్లీ?" అంది.

"నా సర్కిల్ గురించి తక్కువంచనా వేశావొదినా నువ్వు. ఆల్ రెడీ తెలిసిన ఓ పంతులుగారికి చెప్పుంచా." అంటూ తన రిస్ట్ బ్యాండ్ మీద నొక్కాడు. ఆ హాల్లో పక్కనే ఇంకో 3డి వీడియో ప్రొజెక్ట్ అయ్యింది. ఫేమస్ పురోహితుడు స్వలాభానంద గడ్డం సవరించుకుంటూ ప్రత్యక్షమయ్యాడు. ఈ వర్చువల్ పెళ్ళిళ్లూ, పేరంటాలూ అన్నీ అలవాటే తనకి. పిల్లా పిల్లాడి వివరాలు సేకరించి తన సిస్టంలో ఏవో లెక్కలు వేసుకున్నాక చెప్పాడు

"జగదీశ్ గారూ, అన్నీ పరిశీలించాక మూడు నెలల్లో మంచి ముహూర్తం ఒకటి దొరికింది. సరిగ్గా ఆగస్ట్ పన్నెండో తారీకు. అందరికీ కుదురుతుంది కదా?"

"చక్కగా కుదురుతుంది." అన్నాడు జగదీశ్ సునందవైపోసారి చూస్తూ.

"మాకు కుదరదండీ!" అన్నాడు మహా అవతల నుండి ఠక్కున.

అందరూ షాక్ తిన్నారు.

"ఓ నెలరోజుల్లో ఏదైనా ఉంటే చూడండి." అన్నాడు తనే మళ్ళీ.

*"నెల రోజుల్లోనా!"*

పురోహితుడు హడావిడిగా తన సిస్టంలో చెక్ చేస్తూ "కష్టం! ఇంకో రెండు నెలలు అబ్బాయి జాతకంలో శని గ్రహం తిష్టవేసుక్కుర్చున్నాడు, అస్సలు కదలట్లేదండీ." అన్నాడు.

"శని గ్రహం గురించి వెయిట్ చేస్తూ కుర్చుంటే మా మంగళ గ్రహం కదిలిపోతుందండీ ఇక్కడ!" అన్నాడు సీరియస్ గా మహా. తలూపుతోంది విశా పక్కన.

"సారీ అండీ, అర్థం కావట్లేదు మీరనేది." అంది సునంద అయోమయంగా చూస్తూ.

"ఆంటీ, మార్స్ ఇప్పుడు భూమికి చాలా దగ్గరగా ఉంది. ఈ నెల దాటితే దూరంగా వెళ్ళిపోతుంది. ఆ తర్వాత ప్రయాణాలు కుదరవని..." అంది విశా మొదటిసారిగా మాట్లాడుతూ.

"దట్ ఈజ్ ట్రూ. మార్స్, ఎర్త్ రెండేళ్లకోసారే దగ్గరగా వస్తాయి. ఈ సారి మిస్ అయితే, రెండేళ్ల తర్వాత గానీ కుదరదు." అన్నాడు మహా.

వాళ్ళ డామినేషన్ చూసి మండింది మల్లికి. "ఆ మాత్రం జ్యోతిష్యం మేమూ నేర్చుకున్నామండీ చినప్పుడు స్కూల్లో." అన్నాడు గంభీరంగా.

తికమకపడ్డారు అమ్మాయి వాళ్ళు. "ఎవరండీ ఈయన?" అంది విశా అమ్మ కీర్తి కళ్ళు పెద్దవి చేస్తూ.

“ఇతనా, మా ఇంటి చుట్టూ తిరిగే ఓ ఉపగ్రహం.” అన్నాడు జగదీశ్. అందరూ గొల్లున నవ్వారు.

“ఏదో మీ అభిమానం.” అన్నాడు మల్లి సిగ్గుపడుతూ.

రిషీకి టెన్షన్ పెరిగిపోతోంది “అంకుల్, నెలరోజుల్లో ఇంకో ముహూర్తం చూడగలరా?” అన్నాడు పురోహితుడితో.

“అబ్బాయి బాగా తొందరపడిపోతున్నాడు. దగ్గర లో అంటే, ఇంకో మూడు వారాల్లో ఒక ముహూర్తం కనిపిస్తోంది. కాకపోతే శనికి శాంతి చేయించాలి.” అన్నాడు ఆలోచిస్తూ.

“మంగళ గ్రహాన్ని ఆపడం మనవల్ల కాదు కానీ శనిగ్రహాన్ని కొంచెం బతిమాలొచ్చు.” అన్నాడు మహా.

“ముహూర్తం దొరికింది గానీ మూడు వారాల్లో అంటే ఇంపాజిబుల్ అనిపిస్తోందండీ. చాలా పనులున్నాయి కదా.” అన్నాడు జగదీశ్ ఆతృతగా.

“బావగారూ...మీరెందుకు కంగారు పడుతున్నారు? అమ్మాయి వాళ్లం మాకు కదా ఆ టెన్షన్లన్నీ. ఏం పర్లేదు, అంతా బానే జరుగుతుంది.” అన్నాడు మహా ధైర్యంగా.

“అదేంటండీ, మా అన్న దేశమంతా రియల్ ఎస్టేట్ పార్టనర్ షిప్పులు చేసి కోట్లు వెనకేసాడు. వాళ్ళందరినీ పిలవాలంటే నే కనీసం మూడు వారాలైనా పడుతుంది.” అన్నాడు మల్లి గర్వంగా అన్న వైపు చూస్తూ.

జగదీశ్ “అయిపోయిందా, ఇంకా చెప్పరా ఏ బ్యాంకులో ఎంతెతున్నాయో.” అన్నాడు గొణుగుతూ మల్లితో.

“కాదండీ, మీకైనా కష్టమే కదా, అంత దూరం ప్రయాణం, పెళ్ళి పనులూ అన్నీ వెంట వెంటనే సాధ్యం కావు కదా!” అంది సునంద కలగచేసుకుంటూ.

ఆ మాటకి మహా, అతని భార్య కీర్తీ ఒకరిమొహాలొకరు చూసుకున్నారు.

“మా ప్రయాణమా? ఎక్కడికీ?” అంది కీర్తి.

“భూమ్మీదకండీ...”

“భలే వారే, అబ్బాయి వైపు వాళ్ళు, మీరే మా మార్స్ కి రావాలి!”

"వాట్!"

నోరెళ్ళబెట్టారందరూ.

జగదీశ్ మొహం పాలిపోయింది. ఓ రెండు నిమిషాల తర్వాత తేరుకుని "మార్స్... మార్స్ మీదెవరున్నారండీ? అందరూ ఇక్కడే ఉంటే? మీరిక్కడికి రావడమే కరెక్ట్." అన్నాడు.

"మా చెల్లెలు వాళ్ళు, మా ఆవిడ బంధువు ఒక ఫ్యామిలీ ఇక్కడే ఉన్నారు. అదీ కాక పాతికేళ్ళగా మా చుట్టూ ఉన్న ఫ్రెండ్స్, ఆఫీస్ కొలీగ్స్. ఇదే మా ప్రపంచం. మార్స్ మీద జరిగే మొట్టమొదటి తెలుగు పెళ్ళి. మీకే లోటూ రాకుండా చూసుకుంటాం. దయచేసి మీరు అర్థం చేసుకోవాలి." అన్నాడు మహా చేతులు జోడిస్తూ.

రిషీ, విశాలు ఒకళ్లనొకళ్లు చూస్తూ దిగులుపడుతున్నారు. అంతా నిశ్శబ్దం.

ఆ మౌనాన్ని చీలుస్తూ "సరేనండీ, మార్స్ లోనే పెళ్ళి కానీ భూమ్మీద రిసెప్షన్, ఒకే నా!" అన్నాడు లేని మీసం దువ్వుతూ మల్లి.

తన భార్యతో సహా అందరూ అతని వైపు గిరుక్కున తిరిగి చూశారు ఎర్రటి కళ్లతో!

కొన్ని క్షణాలు ఎవరూ ఏం మాట్లాడలేదు. జగదీశ్ నేలవైపు చూస్తూ ఉండిపోయాడు.

సునందే ధైర్యం చేసుకుని "బావగారూ, నెల రోజుల్లో అంత దూరం ప్రయాణమంటే వీలయ్యేలా లేదు. పైగా..."

"పైగా...?"

"డబ్బండీ...ఒక్కసారి మా బ్రదరు గుండె జారిపోయింది చూశారా ఇక్కడ? ఎంత లేదైనా ఆ గ్రహానికి రావాలంటే రెండు మూడు కోట్లవ్వదూ?" అన్నాడు మల్లి.

"పది కోట్లు!" సరి చేశాడు మహా.

"చెప్పానా... మా అన్నయ్యకది పెద్ద లెక్క కాకపోయినా చూస్తూ చూస్తూ ఒక ఫ్యామిలీ ప్రయాణానికి పది కోట్లంటే..."

"ఫ్యామిలీకి కాదు, ఒక్కొక్కళ్ళకీ పది కోట్ల రూపాయలవుతుంది!"

ఒక్కసారి ఆ రూంలో అందరి మొహాలూ ఎలక్ట్రిక్ షాక్ కొట్టినట్టు నల్లగా మాడిపోయాయి.

*"ఇది చచ్చినా జరగదైతే"* అనుకున్నాడు రిషీ. తనకి బాగా తెలుసు ఏ లాభం లేకుండా జగదీశ్ ఇంత తగలెయ్యడని.

మహాకీ అర్ధమయ్యి "మీ ఆరుగురికీ షుమారు అరవై కోట్లవుతుంది. కాకపోతే నేను నాసా లో ముప్పై ఏళ్ళుగా చేస్తున్నాను కాబట్టి తగ్గించమని రిక్వెస్ట్ చేస్తాను. కానీ ఒక ముప్పై కోట్లైతే గ్యారంటీగా పెట్టాల్సుంటుంది మీ వైపు నుండి." అన్నాడు.

కొంచెం తేలిక పడుతోంది వాతావరణం అది విని.

"పెదనాన్నా, నాదో ఐడియా. ఈ పెళ్ళి ని అమ్మేద్దాం!" అందో కొత్త గొంతు. నీలూ ది.

అందరూ నమ్మలేనట్టు చూశారు తన వైపు. సన్నగా, చిన్నపిల్లలా, స్ట్రైప్డ్ స్కర్ట్, పోనీ టైల్ లో ఉంది తను. తన ముందు గాల్లో చిన్న స్క్రీన్ ప్రొజెక్ట్ అవుతోంది. దాంట్లో నే ఏదో ఫొటో ఫీడ్ చూస్తోంది. ఒకప్పటి మొబైల్స్ పోయి వాటి స్థానంలో ఈ వర్చువల్ స్క్రీన్స్ వచ్చి కుర్చున్నాయి. రిస్ట్ బ్యాండ్ నుంచీ, కళ్ళజోడు నుంచీ ఇలా ఎక్కడి నుంచైనా గాల్లో ప్రొజెక్ట్ చేసుకుని ఆ స్క్రీన్ తో పని చేసుకోవచ్చు.

"పెళ్ళిని అమ్మడమేంటే?" అంది సునంద నీలూని చూస్తూ.

"ఆంటీ, మొన్న మా ఫ్రెండ్ ఓ పెద్ద వాల్కనో లో పెళ్ళి చేస్కోని, దాని లైవ్ కవరేజ్ రెండు కోట్లకి అమ్మాడు. దాన్ని బిడ్డింగ్ చేసి మరీ TV420 వాళ్ళు కొని టెలి కాస్ట్ చేశారు." అంది స్క్రీన్ లోంచి తల తిప్పకుండానే.

"TV420 నా అదేం పేరు?!" అన్నాడు మహా నవ్వుతూ.

"అంకుల్, ఉన్న న్యూస్ ఛానెల్స్ లో ఇదే కొంచెం బెటరంకుల్, మిగతావి ఇంకా దారుణం!" అంది ఫీలయినట్టు మొహం పెట్టి.

మళ్లి అందుకొని "దీనికి కొంచెం న్యూస్ ఛానెళ్ల పిచ్చెక్కువ లేండి. రోజూ అదే పని. అంటే పొలిటికల్ సైన్స్ కోర్స్ చేస్తుంది కదా, టీవీ తో నాలెడ్జ్ వస్తుందని..."

"నాన్నా, నీకెన్ని సార్లు చెప్పాలి? నేను చదివేది పొలిటికల్ సైన్స్ కాదు, పొలిటికల్ ఫ్యాషన్!"

ఇప్పుడు ఖంగుతినడం విశా ఫ్యామిలీ వంతయ్యింది.

"అంటే?" అంది విశా అయోమయంగా.

"అయ్యో వదినా! ఇది చాలా హాట్ కోర్స్ ఇప్పుడు. పొలిటికల్ లీడర్స్ కి ఎలాంటి డ్రెస్సులు డిజైన్ చెయ్యాలి? స్థలాన్నీ, అకేషన్ నీ బట్టి వాళ్ళ వేషం ఎలా ఉండాలి? ఎలా రెడీ ఐతే అక్కడి జనాలు ఎక్కువ రేటింగ్ ఇస్తారు? ఎలా ప్రచారానికెళ్తే సక్సెస్ అవుతారు? ఇలాంటివెన్నో నేర్పుతారు." అంది ఎక్సైటింగ్ గా.

"వావ్! ఎప్పుడూ నేనూ వినలేదే." అన్నాడు రిషీ.

"యా అన్నయ్యా, నేనీ మధ్యే ఓ ఎమ్మెల్యే క్యాండిడేట్ కి వర్క్ చేస్తున్నా, నా ఫైనల్ ఇయర్ ప్రాజెక్ట్ లో పార్టుగా." అంది కాలరెగరేస్తున్నట్టు చూపించి.

"సరే, సరే ముందు ఆ TV420 గురించి చెప్పు." అన్నాడు జగదీశ్. ఎవడి టెన్షన్ వాడిది!

"ఆ TV420 కి 'మొట్టమొదటి గ్రహాంతర వివాహం' అని చెప్పి కనీసం అన్న పెళ్ళిని పదికోట్లకి అమ్మచ్చు." అంది.

నోరు తెరిచారందరూ. జగదీశ్ తన భుజాలు పట్టుకొని ఊపేస్తూ "నువ్వు నా తల్లోంచి దూరొచ్చావే." అన్నాడు సంతోషంగా.

రిషీ ఊపిరి పీల్చుకున్నాడు.

"బలే వారే, మే ఒక్కళ్ళం వస్తే సరిపోద్దా? మా అన్న బలగం అంతా ఏమైపోవాలి?" అన్నాడు మల్లి అనవసరంగా.

"భూమ్మీద ఓ పెద్ద ఫంక్షన్ హాలు తీస్కొని ఇక్కడి నుండి పెళ్ళిని 3డి ప్రొజెక్షన్ చేద్దాం. ఏమంటారు?" అన్నాడు మహా.

"అనేదేముందండీ, నిశ్చితార్థం పెట్టేస్కోడమే!" అని హడావిడిగా లగ్న పత్రిక రాసేసి పెద్దగా అందరికీ చదివి వినిపించాడు పురోహితుడు స్వలా.

రిషీ డొక్కల్లో పొడుస్తూ "మీ మామని ముందు పెద్ద నస గాడనుకున్నారా, కాదూ నాసా గాడే!" అన్నాడు మల్లి.

5

నిశ్చితార్థం హడావిడి అయ్యాక బాగా టైర్ అయ్యిపోయారందరూ. మల్లి వాళ్ళ ఫ్యామిలీని కూడా అక్కడే డిన్నర్ చేసి వెళ్ళమంది సునంద. మల్లి వాళ్ళావిడ వైపు చూశాడు ఇబ్బందిగా. అవేమీ పట్టించుకోకుండా "సుందరీ, సుందరీ!" అని పిలిచింది సునంద.

"ఏంటమ్మా?" అంటూ హడావిడిగా లోపలి నుండి వచ్చింది సుందరి. పసుపు చూడీదార్, పొడుగు జుట్టూ, పెద్ద కళ్ళూ. "సుందరీ, ఒక ఇరవై రోటీలూ, మూడు కర్రీలూ, ఫ్రైడ్ రైస్ చెయ్యాలి, ఒక అరగంటలో!" ఆర్డర్ వేసింది.

"అమ్మా, ఇంత హ్యాపీ మూమెంట్ లో మంచి స్వీట్ కూడా ఉంటే అల్టిమేట్ గా ఉంటుంది. సుందరీ, ప్లీజ్ బొబ్బట్లని నీ మెనుకి యాడ్ చేస్కోవా." అన్నాడు రిషీ తేలిగ్గా.

"అన్నయ్యా, ఇంత చేశాను నీ కోసం మరి నాకో." అంది నీలూ.

"అడగవే నీకేం కావాలో, సుందరి నీకేం కొత్తా ఏంటి?" అన్నాడు.

"ఉమ్...నాకు చాక్లెట్ ఫిల్ డ్ కజ్జికాయలు కావాలి." అంది పైకి చూసి ఆలోచిస్తూ.

"ఇంకా నయ్యం, చాక్లెట్ డిప్ డ్ బజ్జీలన్లేదు!" అన్నాడు మల్లి నీలూ వైపు చెయ్యి చూపిస్తూ.

"గుడ్ ఐడియా నాన్నా, సుందరీ అది కూడా యాడ్ చేస్కో." అంది నీలూ.

"రేయ్...పాపం సుందరి ఎంత రోబోట్ ఐతే మాత్రం దానికున్నవీ రెండు చేతులే. సుందరీ, ఈ స్వీట్లన్నీ తర్వాత చెయ్యచ్చులే కానీ, డిన్నర్ కి కావాల్సినవి చెయ్యి ముందు." అన్నాడు జగదీశ్ వాళ్లందరి మాటల్నీ కట్ చేస్తూ.

"థాంక్స్ జగదీశ్, అయినా ఈ బొబ్బట్లూ, కజ్జికాయలూ చేసే ఓపికా, నేర్చుకునే ఇంట్రస్టూ ఎప్పుడో చచ్చిపోయాయి నాకు." అంది సుందరి కిచెన్లోకెళ్ళి పోతూ.

రిషీ, నీలూ మొహాలు పాలిపోయాయి.

"ఇక్కడొద్దులే వదినా, మా ఇంటికెళ్తాం. దగ్గరే కదా, మా హౌస్ రోబోట్ కూడా చకచకా చేసేస్తుంది వంట." అన్నాడు మల్లి.

"వంట కోసం కాదు. అందరం కలిసి తిందామని. అయినా సుందరికే, మా ఇంటికొచ్చి పదేళ్ళైనా చక్కగా చేస్తుంది అన్ని పనులూ." అంది తన రోబోట్ ని వెనకేసుకొస్తూ.

"అదే సమస్యక్కా, పదేళ్ల పాత రోబోట్ అవ్వడం వల్ల సుందరి వంటల్లో ఉప్పులూ, కారాలూ ఎక్కువ. నూనెలు కూడా ఎక్కువ వాడుతుంది, ఈయనకవన్నీ పడవు కదా..." అంది మల్లి భార్య పెదవి విరుస్తూ.

"వదినా, మీరూ కొత్తది తీస్కోవచ్చు కదా ఆ పాత రోబోట్‌ని పట్టుకుని వేళ్లాడకపోతే? నన్ను చూడండి రెండేళ్లకోసారి మా రోబోట్‌ని మారుస్తూ ఉంటాను. చాలా కొత్త కొత్త ఫీచర్స్ తో వస్తున్నాయీ మధ్య." అన్నాడు మల్లి.

జగదీశ్ కి విసుగు పుట్టి "ఎంత కొత్తవైనా, పనులు అవే కదరా, ఏముందంత స్పెషల్?" అన్నాడు.

"బలేవోడివన్నయ్యా, మీ సుందరి చెప్తే చేస్తుంది పనులు. అదే మా రోబోట్ అయితే మన మనసు తెలుసుకోని మరీ చేస్తుంది. ఓ రోజు దీనికి బాలేదని తెలుసుకోని అదే ట్యాబ్లెట్లు తెచ్చి మరీ ఇచ్చింది, కదే?" అన్నాడు భార్య వైపు చూస్తూ. తలూపింది తను.

"అంతెందుకు, ఈ వారం మొదట్లో ఇది ఇంట్లో లేనప్పుడు నాకో చిలిపి ఆలోచనొస్తే..."

"వస్తే...? ఎంటండీ...?" దబాయించింది వాళ్ళావిడ కళ్ళురిమి చూస్తూ.

మిగిలిన అందరూ నోరు తెరిచారు.

"నా దగ్గరి కొచ్చి మొహంలో మొహం పెట్టి..."

"నాన్నా...!"

"పిచ్చి పిచ్చి ఆలోచనలు చెయ్యద్దు అని బెదిరించిందే నీలాగా." అన్నాడు భార్య వైపు చూసి వెకిలిగా నవ్వుతూ.

"వామ్మో, వామ్మో...మార్చెయ్యండి, వెంటనే మార్చెయ్యండి... నాకస్సలు నమ్మకం లేదు మళ్ళీ ఇలాంటివి జరగవని." అంది గుండెలు బాదుకుంటూ మల్లి భార్య.

"అది మంచి పనే చేసింది గదే, దాన్నెందుకంటావ్?" అడిగింది సునంద.

"దాని మీద కాదొదినా, ఈయన మీద నమ్మకం లేక." అంది తను ముక్కెగబీలుస్తూ.

"అవున్నాన్నా, వెంటనే మార్చేసి ఒక యంగ్ టీనేజ్ మేల్ రోబోట్ ని తీస్కుందామా?" అంది నీలూ హుషారుగా.

"అస్సలు కుదరదు...ఆ మోడల్స్ సరిగ్గా పన్చెయ్యవంట." అన్నాడు మల్లి కట్ చేస్తూ.

"బాబాయ్...మీ హౌస్ రోబోట్ పురాణం ఆపుతారా ఇంక!" అన్నాడు రిషీ తల విదిలిస్తూ.

"ఆపుతాం కానీ, మీ ఓల్డ్ సుందరిని మార్చి కొత్త సుందరాంగిని తెచ్చుకోండి." అన్నాడు మల్లి.

"అబ్బ, చిన్నగా మాట్లాడండీ! మొన్నిలాగే, తనని వదిలించుకుంటున్నారని అనుమానమొచ్చి, ఓ రోబోట్, వాళ్ళ ఓనర్స్ ని నీళ్ళు తాగించి మర్డర్ చేసిందంట." అంది వాళ్ళావిడ.

"నీళ్ళు తాగించి చంపడమేంటే, అర్థం లేకుండా! విషం తాగించేమో?"

"నీళ్ళేనండీ! స్విమ్మింగ్ పూల్ నీళ్ళు. పూల్ లోకి తోసి, తల గట్టిగా ముంచి..."

"ఆపెయ్, నువ్వూ నీ హారర్ మూవీ డీటైల్సూ!" అంటూ చెవులు మూసుకున్నాడు మల్లి.

తర్వాత భోజనం చేస్తున్నప్పుడు డైనింగ్ టేబుల్ మీద సుందరిని అనుమానంగా చూస్తూ, తన చేతికి ఎలాంటి షార్ప్ వస్తువులు దొరక్కుండా దాచేశాడు మల్లి !

**తర్వాతి వారం** రోజులూ తెచ్చి పెట్టుకున్న సునామీలో ఇరుక్కుపోయి గిలగిలా కొట్టుకుంది రిషీ కుటుంబం.

ఈ మొట్టమొదటి గ్రహాంతర తెలుగు వివాహం వదులుకోకూడదని టీవీ 420 ఛానెల్ ఎదురొచ్చి మరీ జగదీశ్ కి పది కోట్లిచ్చి బ్రాడ్ కాస్టింగ్ రైట్స్ ని కొనేసింది. జగదీశ్ కూడా ఆనందం పట్టలేక వాళ్ళ కాంట్రాక్ట్ లో అవసరమైన వాటికన్నా ఎక్కువ సంతకాలు పెట్టేశాడు. సరిగ్గా అక్కడే మొదలైంది తుఫాను!

రెండో రోజే ఓ బ్రాండింగ్ టీం రిషీ ఇంట్లో దిగిపోయింది. ఇంటి బైట వాల్స్ నుండి లోపలి బాత్‌రూం గోడల వరకూ గంటల్లో కొత్త కొత్త అంతరిక్ష డిజైన్స్, పైటింగ్స్ వేసేశారు. ఇంటి ప్రహరీ అంతా రకరకాల గ్రహాలూ, నక్షత్రాలతో పట్ట పగలే అందరికీ చుక్కలు చూపించిందా బ్యాచ్. దేనికడ్డు చెప్పినా 'కాంట్రాక్ట్' చూపించి బెదిరించిందా టీం లీడర్. ఇంకా ఎక్కువ మాట్లాడితే వాళ్లతో ఏలియన్స్ వేషం వేయిస్తుందేమోనని భయమేసి జగదీశ్, సునందలు ఓ పక్కకెళ్ళి కూర్చున్నారు. రిషీ రూం అంతా మార్స్ మీదొచ్చిన మూవీ పోస్టర్లతో నింపేసారు వాళ్ళు. తర్వాత ఫ్యామిలీ మెంబర్స్ అందరితో కొన్ని డైలాగులు బట్టీ పట్టించి, వాటితో కొన్ని ఎమోషనల్ వీడియో క్లిప్స్ తీస్కొని అర్ధరాత్రికి కానీ వదల్లేదు పాపం!

తర్వాతి రోజు సాయంత్రం ఫ్రెండొకడు పంపిన మెసేజ్ చూసి తన రూం లోంచి హఠాత్తుగా హాల్లోకి పరిగెత్తుకొచ్చాడు రిషీ పెద్దగా "మామ్! డాడ్!" అని అరుస్తూ. వాళ్లిద్దరూ గాభరాగా అక్కడి కొచ్చి చూసేటప్పటికి తను టీవీకి కమాండ్ ఇస్తున్నాడు "ఓపెన్ టీవీ420".

ఎదురుగా ఉన్న తెల్లటి గోడ మీద ప్రత్యక్షమైందా ఛానెల్. ఒక యాంకర్ జుట్టు సర్దుకుంటూ మైక్ పట్టుకొని ఓ పూరిల్లు వైపు చెయ్యి చూపిస్తూ అంటోంది

“ఇక్కడే, ఈ ఇంట్లోనే రిషీ చిన్నతనమంతా గడిచింది. చుట్టూ చూడండి, అన్నీ పేద ఇళ్లూ, దరిద్రం తాండవిస్తున్న బతుకులూ.” అని చిరాగ్గా మొహం పెట్టి చెప్తూ కెమెరాతో అంతా చూపెట్టింది. చెత్త పడేసుంది ఆ రోడ్డంతా , నీళ్ళు పారుతున్నాయో పక్క. తనే మళ్ళీ అంది

“ఇలాంటి నరకం నుండి తన మేధస్సుతో పై పైకి పాకిన వజ్రం మన రిషీ! తన చిరకాల స్వప్నమైన మార్స్ యాత్ర అంతా సక్సెస్ ఫుల్ గా జరగాలని మా రోడ్డున పడ్డ టీవీ420 టీం నుండి ‘ఆల్ ది బెస్ట్’ చెప్తున్నాం. ఓవర్ టు స్టూడియో.” అంది.

జగదీశ్, సునందలు అయోమయంగా చూస్తున్నారు. *“చిరకాల స్వప్నమా!”*

స్టూడియో లో యాంకర్ స్టైల్ గా సూట్ వేస్కోని “వెల్కం బ్యాక్ టు ‘మురికివాడ నుండి మార్స్ దాకా’ ప్రోగ్రాం!” అంది. రిషీకి చిర్రెత్తుకొచ్చింది.

“ఇందాక మనం రిషీ బాధాకరమైన పాత బతుకుని చూశాం. ఇప్పుడు అతని కొత్త జీవితాన్ని చూద్దాం రండి.” అనగానే నిన్న తీసిన రిషీ ‘హోం టూర్’ వీడియో రన్ అవుతోంది స్క్రీన్ మీద.

“ఇదే రిషీ ఇల్లు. చూడండి, అతని ఆలోచనలెప్పుడూ స్పేస్ చుట్టూ తిరగాలని తన తండ్రి ఇల్లంతా చిన్నప్పటి నుండి ఎలా మార్చారో! అతని బెడ్రూంలోకెల్తే అచ్చం మార్స్ మీదికి వెళ్లినట్టే ఉంది...” చెప్పుకుంటూ పోతోంది బ్యాగ్రౌండ్ లో యాంకర్. మధ్య మధ్యలో జగదీశ్, సునందల మీద నిన్న తీసిన డైలాగ్ లు వచ్చాయి.

రిషీ కోపంతో టీవీ ఆపెయ్యబోతున్నప్పుడు అంది యాంకర్ మళ్ళీ

“మన రిషీ మార్స్ ప్రయాణం, పెళ్ళి ఇలా బోలెడు ఎక్స్ క్లూసివ్ కంటెంట్ కోసం చూస్తూనే ఉండండి మీ టీవీ420!”

చూస్తునన్ ముగ్గురి మొహాల్లో నెత్తుటి చుక్క లేదు. అందరి మనసులూ ‘*ఇది దారుణం*’ అని మాత్రం అరుస్తున్నాయి.

సునంద మెల్లగా అడిగింది “ఏంటండీ ఇదంతా?” అని.

రిషీ కోపంతో సోఫా మీద కొడుతూ “మన లైఫ్ అంతా పబ్లిక్ లో పెట్టేసారు. డాడ్! జస్ట్ మన ఇంటివీ, నా పెళ్ళివీ కొన్ని వీడియోలు చూపిస్తామని కదా చెప్పారు? మరీ చెత్త స్టోరీస్ ఏంటి?” అడిగాడు.

జగదీశ్ కి కూడా అయోమయంగా ఉంది. అసలు సంగతి కనుక్కుందామని ఛానెల్ కి ఫోన్ చేస్తే,

“భలే వారే, మీరు కాంట్రాక్ట్ లో పదిహేడో పేజీ చివర్లో ఉన్న ఎనిమిదో క్లాజ్ చదవలేదనుకుంటా. మా ఛానెల్ కి మీ వాడి పెళ్ళి మీద సర్వాధికారాలూ ఇచ్చేసినట్టే.” అని సమాధానం అటునుంచి. జగదీశ్ బ్రతిమలాడుకుంటే పెళ్ళి మీద

ట్రైలర్లూ, టీజర్లూ రోజుకి రెండుసార్లకన్నా ఎక్కువ వెయ్యమని కన్సెషనిచ్చారు కనికరించి. రిషీ, సునందలు అదోలా మొహం పెట్టి చూశారు జగదీశ్ వైపు. *"నువ్వూ నీ కక్కుర్తీ..."* అన్నట్టుగా.

ఆ ఛానెల్ ఇచ్చిన పబ్లిసిటీకి వారం రోజుల్లో రిషీకి లక్షల్లో ఫాలోవర్స్ తయారయ్యారు. మీడియాలో అతని వీడియోలు, ఫొటోలూ, పెళ్ళి విశేషాలతో ఫ్యాన్స్ తయారు చేసిన వేల క్లిప్పులు షికార్లు చేస్తున్నాయి. బైట ఎవరు గుర్తుపట్టినా చుట్టుముడుతూ ఉండటంతో, దాక్కొని ఇంటికి చేరాల్సిన పరిస్థితి. తీరా ఇంటికొస్తే తెలిసిన, తెలుసుకోవద్దనుకున్న చుట్టాలందరూ వచ్చి పోతున్నారు. ఒక చుట్టం "అన్నయ్యా మన రిషీగాడెప్పుడూ చదువులో వీకే కదా? మరేంటి వీళ్ళందరూ మేధావంటన్నారు?!" అంటాడు జగదీశ్ తో. ఇంకో ఆవిడ "వదినా, మీరెక్కడ పూరి గుడిసెల్లో గడిపింది? అన్నయ్య నీ పెళ్ళి నాటికే బాగా రిచ్ కదా?" అని సందేహ పడింది సునంద దగ్గర. వీటికి మించి, ఓ రోజు రిషీ క్లోజ్ ఫ్రెండ్సొచ్చి స్పేస్ మీద ఓ పెద్ద క్విజ్ కండక్ట్ చేసి, రిషీకి స్పేస్ గురించి ముక్క తెలీదని కన్ఫర్మ్ చేస్కొని మరీ శాటిస్పై అయ్యి వెళ్ళి పోయారు.

ఇదిలా ఉంటే, రిషీ పాపులారిటీని ఫుల్లుగా క్యాష్ చేస్కున్నవాళ్ళూ ఉన్నారు. రిషీ చదివిన స్కూల్స్, కాలేజీలూ అన్నీ అతని ఫొటో పెట్టుకొని వ్యాపారం పెంచుకున్నాయి. ఒక కాలేజ్ వాళ్ళు

"మీకు రిషీ లాగా, మార్స్ లాంటి ఉన్నత లక్ష్యం లేకపోతే మా దగ్గర దయచేసి చేరద్దు." అని రివర్స్ గేర్లో పబ్లిసిటీ ఇచ్చింది.

ఓ స్కూలైతే "రిషీ మా స్కూల్లో చదవలేదు కాబట్టి మార్స్ వరకే గోల్ పెట్టుకోగలిగాడు. అదే మా స్టూడెంట్స్ జూపిటర్, శాటర్న్ అంతకుమించి వెళ్ళి చూపిస్తారు. మీరు కేవలం రిషీలా మిగిలిపోవాలనుకుంటే మా దగ్గర చేరద్దని." ఎక్కడ పడితే అక్కడ యాడ్స్ ఇవ్వడం మొదలుపెట్టింది.

ఇంకెక్కడ ఆగుతారు గొర్రెలు! కోట్లు పోసి సీట్లు కరకరా కొనేశారు. ఇటు పక్క మల్లి అతని పేరు చెప్పి ఇష్టమొచ్చినచోట కోట్లు అప్పు చేసి గ్యాంబ్లింగ్ లో తగలేశాడు. ఇంట్లో సుందరి కూడా దొరికినప్పుడల్లా రిషీతో సెల్ఫీలు తీస్కొని హౌస్ రోబోట్ జాతిలో బాగా కీర్తి ప్రఖ్యాతలు తెచ్చుకుంది.

అన్నీ సహించాడు రిషీ, భరించారు ఇంట్లో వాళ్ళు. ఇంకా జస్ట్ రెండ్రోజులే ప్రయాణానికి!

## 7

బయల్దేరే ముందు రోజు ఇంట్లో చకచకా ప్యాకింగ్ పనులు జరుగుతున్నాయి. బయట, టీవీలో, మీడియాలో అంతా ప్రశాంతంగా ఉంది. సునంద మనసేదో కీడు శంకిస్తోంది. *"హమ్మయ్య, వదిలేసినట్టున్నారే జనాలు."* అనుకున్నాడు జగదీశ్.

అంతలో బైటెవరో వచ్చారని అనౌన్స్ మెంట్ వచ్చింది హౌస్ రోబోట్ సుందరి నుండి. సునంద హడావిడిగా చేతికున్న బ్రేస్లెట్ మీద టచ్ చేసింది. ఎదురుగా గాల్లో వచ్చిన స్క్రీన్ మీద కనపడుతోంది ఇంటి బైట కెమెరా చూపిస్తున్న వీడియో. ఒక పెద్దావిడ, యాభై దాటుంటాయ్. ఆమెని చూడగానే సునంద షాక్ తిని చూస్తూ నిలబడిపోయింది. నోరు తడారిపోయింది తనకి. ఇలాంటిదేదో జరుగుతుందని భయపడుతూనే ఉంది. ఓ నిమిషంలో తెలివి తెచ్చుకొని, అక్కడే సర్దుతున్న రిషీని లోపలి కెళ్ళమంది. జగదీశ్ "ఎవరే? ఏంటి హడావిడి?" అంటున్నా పట్టించుకోకుండా రిషీని హడావిడి పెట్టి తన రూంలోకి తోసేసింది. మొహాన్ని వీలైనంతా ప్రశాంతంగా మార్చి నవ్వుతూ వెళ్ళి తలుపు తీసి "బాగున్నావా వదినా!" అంది తలుపు బైటున్న ఆవిడని చూసి. ఆవిడ ఇవేమీ పట్టించుకోకుండా "అన్నయ్యా! అన్నయ్యా!" అంటూ లోపలికి దూసుకెళ్లింది. పదేళ్ల తర్వాత హఠాత్తుగా వచ్చిన చెల్లి అనూని చూసి ఆశ్చర్యపోయాడు జగదీశ్.

ముగ్గురూ ఎదురెదురు సీట్లల్లో కుర్చున్నారు. కొద్ది సేపు ఎవరూ మాట్లాడలేదు. సుందరి ఏదో జ్యూస్ తెస్తే, "తింటూ, తాగుతూ కూర్చోడానికి రాలేదిక్కడికి!" అంది అనూ. సునంద గుండె వేగం పెరిగింది. "వదినా..." అంటూ ఏదో అనబోయి మధ్యలో ఆపేసింది అనూ మొహం చూసి.

"నువ్వు చెప్పన్నయ్యా, ఏంటిదంతా?" అంది సూటిగా జగదీశ్ తో.

అతను అయోమయంగా "ఏముందే, రిషీ గాడి పెళ్ళి. అనుకోకుండా మీడియాలో రభసగా మారింది కానీ, మేము నీకు చెబ్దామనే అనుకుంటున్నాం." అన్నాడు సునంద వైపోసారి చూస్తూ.

చుట్టూ పరచుకున్న బ్యాగ్స్ చూస్తూ "ఎప్పుడు, మీరు గ్రహం దాటి వెళ్ళాక చెబ్దామనుకున్నారా?" అంది అనూ కోపంగా.

"ఛ, ఛ, అదేంమాటొదినా. ఐనా మీకన్నా మాకెవరున్నారింక." సర్దబోయింది సునంద.

“నీ నాటకాలు నాకు తెలీదా, మల్లి గాడి ఫ్యామిలీ కూడా మీతో వస్తుందట? అంటే మేమే పరాయివాళ్ళమన్నమాట!” అంది నిష్ఠూరంగా.

“ఆ మాట మేమనలేదే, పదేళ్ల కిందటే మమ్మల్నొదిలేసి ఆ ఓషన్ కాలనీకి షిఫ్ట్ అయిపోయి, నువ్వే ఇక్కడందర్నీ వదిలేసుకున్నావ్.” అన్నాడు జగదీశ్ అసహనంగా కుర్చీలో కదులుతూ.

“అవును, మా ఆయన ఈ భూమ్మీద పొల్యూషన్ రేట్లు పెరిగి పొయ్యాయ్, కనీసం ఇండియాలో ఉన్న సిటీల్లో చిన్న అపార్ట్‌మెంటు కూడా దొరకట్లేదంటే, తక్కువగా వస్తున్నాయి కదా అని ఇండియన్ ఓషన్ మీద కట్టిన కాలనీలో చేరాం. అది మా తప్పా?” అంది.

“వెళ్ళారు కరెక్టే, తర్వాత ఎప్పుడన్నా ఇటువైపు వచ్చావా? నువ్వూ నీ ఓషన్ సిటీ పనుల్లో బిజీ అయిపొయ్యావ్.” అంది సునంద భర్తని వెనకేసుకొస్తూ.

“ఇద్దరూ భలే సమర్థించుకుంటారు. అన్న ఇంత సంపాదిస్తున్నా మాకెప్పుడైనా సాయం చేశాడా? ఈడ్చి కొడితే ఒక్క గంట పడుతుంది ఫ్లైట్ లో మా సిటీ. ఒక్కసారైనా వచ్చారా ఎవరైనా? మా చావుకి మమ్మల్నొదిలేసారు.” అంది ఏడుపు ధ్వనిస్తున్న స్వరంతో.

“ఏడవకే ఇంట్లో, పెళ్ళి పెట్టుకున్నాం కొన్ని రోజుల్లో.” అన్నాడు జగదీశ్.

“నా బాధ నీకు ఏడుపులా అనిపిస్తోందా? అయినా మూడేళ్ల క్రితం నేను ఫోన్ చేసి రిషీని నా కూతురికడిగితే కూడబలుక్కుని ఏమన్నారిద్దరూ?” అంది వాళ్ళిద్దరి వైపూ చూస్తూ.

సునందకి ఆ విషయం గురించే భయమంతా. జగదీశ్ కి పెద్ద గుర్తుకూడా లేదు.

మళ్ళీ అనూనే పొడిగిస్తూ “మీ ఓషన్ సిటీ వాళ్ళ కీ, మా భూమ్మీద వాళ్ళ కీ అంత పడదు, అంతకుముందు ఇలా పెళ్ళిచేసుకున్న వాళ్ళు వెంటనే డైవోర్స్ తీసుకున్నారని చచ్చు మాటలు చెప్పి తప్పించుకున్నారు కదూ?” అంది కళ్ళు పెద్దవి చేస్తూ.

“అవేవీ అబద్ధాలు కాదే, మీకు దొరికే తిండి, తాగే నీళ్ళూ, పీల్చే గాలీ అంతా సముద్రం మీద ఆధారపడి ఉంటాయి. అందువల్ల భూమ్మీద పెరిగే పిల్లలకీ, మీ వాళ్ళకీ చాలా తేడాలున్నాయ్. మీ దగ్గరి పిల్లలు ఇక్కడి వాతావరణానికి తట్టుకోలేరు. మేము కాదని నీ కూతురికి మంచే చేసాం.” అన్నాడు నిర్లిప్తంగా.

సునంద అతడ్ని ఆపమని సైగ చేస్తున్నా అవేమీ గమనించలేదు జగదీశ్. *“ఎప్పుడెలా మాట్లాడాలో తెలీదీనకి, ఇరుక్కుపోయాం.”* అనుకుంది మనసులో.

“గ్రేట్ రా, నీ లాజిక్ ప్రకారం ఇదే గ్రహం మీద వేరే చోట బతుకుతున్న నా కూతురు, నీ కొడుక్కి అన్ ఫిట్ కానీ ఎక్కడో కోట్ల మైళ్ల దూరంలో వేరే గ్రహంలో పుట్టి పెరిగిన పిల్ల మాత్రం పర్ ఫెక్ట్ ఫిట్, కదూ! మీరూ మీ డబుల్ స్టాండర్డ్స్!” అని దులిపేసింది అనూ.

ఓ రెండు నిమిషాలు మౌనంగా ఉన్నారందరూ.

“రిషీకి ఇష్టం ఉండాలిగా వదినా, చిన్నప్పటి నుండి కలిసి పెరిగాం, నాకా ఉద్దేశ్యం లేదు దానిమీద అన్నాడు వాడు నీ కూతురి గురించి. పైగా పీహెచ్‌డీ చెయ్యాలి, ఇప్పుడే పెళ్ళి ఆలోచనల్లేవని గట్టిగా చెప్పాడు.” అంది సునంద అసలు విషయం చెప్తూ.

“చూస్తే మీ వాడు పీహెచ్‌డీ కెళ్ళినట్టులేదు, పిల్లనెతుక్కోడానికెళ్ళినట్టుంది అమెరికాకి.”

జగదీశ్ కోపంతో ఊగిపోతూ పైకి లేచాడు “వాడిష్టం వాడిది, అయినా మీ ఆయనా, నువ్వూ కొన్నేళ్ళల్లో భూమంతా సర్వనాశనమై పోతుంది అందుకే మేం వెళ్ళిపోతున్నాం అని రూమర్స్ పుట్టించి పోయి, మళ్ళీ ఇక్కడి కొచ్చి మా వాడు కావాలనడం జోక్ గా అనిపిస్తోంది.” అన్నాడు.

“ప్లీజ్, మీరుండండి.” అని అతడ్ని కూల్ చేస్తూ అనూతో అంది సునంద “నిజానికి మాకూ ఈ మార్స్ సంబంధం అంత నచ్చలేదు వదినా, వాడికి చాలా సార్లు చెప్పి చూసాం. కానీ ఏం లాభం లేక పోవడంతో ఒప్పుకోవాల్సొచ్చింది.”

వాళ్ళక్కూడా ఇష్టం లేదు కానీ రిషీ బలవంతంతో చేస్తున్నారనేటప్పటికి ఆవేశం తగ్గింది అనూ లో. తన కోపం కూతురి గురించీ, రిషీ గురించీ కాదు. తన మాట నెగ్గలేదని మాత్రమే. అన్నా, వదినలు కూడా రిషీ వల్ల ఓడిపోయినందుకు తనకి సంతోషంగా ఉందిప్పుడు.

"సర్లే, ఇంతకీ ఎక్కడ రిషీ, బైట మీడియాలో ఎక్కడ చూసినా వాడి గురించే." అంది నవ్వు తెచ్చుకుంటూ.

"బైటికెళ్ళాడొదినా, ఫ్రెండ్స్ దగ్గరి కి. ఇవాళ ఉంటావు గా మా ఇంట్లో, రాత్రికి కలవచ్చులే." అంది సునంద అనూని పరీక్షిస్తూ.

"నో నో, సిటీలో చాలా పన్లున్నాయి నాకు. మా ఓషన్ సిటీ వాళ్ళ షాపింగ్ లిస్ట్ కూడా చాలా ఉంది. అన్నీ కొనాలంటే రోజంతా పడ్తుంది. వెళ్తా లే, మళ్ళీ కలుస్తాం మీరు ఆ గ్రహాంతర వాసి కోడలితో తిరిగొచ్చాక!" అంది అనూ హడావిడిగా వాచ్ చూసి బైటకి నడుస్తూ.

తను పూర్తిగా దాటి వెళ్ళాక గట్టిగా ఊపిరి పీలుస్తూ అన్నాడు జగదీశ్ సునందతో

"వీడి పెళ్ళి గేమ్ లో ఫస్ట్ లెవెల్ దాటినట్టుందే, ఇంకా ఇలాంటివెన్ని ట్విస్ట్ లొస్తాయో ముందు ముందు!"

8

సరిగ్గా బయల్దేరే ముందు రోజు సాయంత్రం రిషీకో కాల్ వచ్చింది. తను హడావిడిగా జగదీశ్ ని పిలిచి కాల్ ని తన స్క్రీన్ మీద ప్రొజెక్ట్ చేశాడు. మార్స్ నుండి మహా ఉన్నాడు ఎదురుగా. "బావగారూ, ఏమైంది?" అనుమానంగా అడిగాడు జగదీశ్.

మహా సూటిగా "ఇప్పుడే మా నాసా వాళ్లతో మాట్లాడాను. మీరు ఆరుగురే వస్తున్నారని చెప్పారు వాళ్ళు నిజమేనా?!" అన్నాడు.

రిషీ, జగదీశ్ లు మొహాలు చూసుకున్నారు అయోమయంగా.

"అవునంకుల్, మనం లాస్ట్ వీక్ మాట్లాడుకున్నాం కదా. మిగతా వాళ్లకి ఇక్కడ మ్యారేజ్ ని లైవ్ ప్రొజెక్షన్ చేద్దామని." అన్నాడు రిషీ.

"సరేనమ్మా, నువ్వు పెళ్ళి చేసుకుంటావ్, వాళ్ళందరూ చూస్తారు గ్రేట్! మరి పెళ్ళి చేయించేదెవరు?" అడిగాడు మహా అసహనంగా.

నోరు తెరిచారిద్దరూ.

"మార్స్ లో ఎవరైనా దొరుకుతారేమోనని ఆ విషయం ఆలోచించ లేదండీ." అన్నాడు జగదీశ్ బుర్ర గోక్కుంటూ.

"ఇక్కడ చిన్న చిన్న పూజల వరకూ ఓకే గానీ, మన పెళ్ళిళ్ళు చేసేవాళ్ళెవరండీ బాబూ. తప్పదు, మీరు అక్కడినుంచి తీసుకురావాల్సిందే." అన్నాడు దృఢంగా.

గుండెలో కలుక్కుమంది జగదీశ్ కి. డబ్బులెందుకో తనని వెక్కిరిస్తూ గాల్లో ఎగిరిపోతున్నట్టనిపిస్తోంది. *లాభం లేదు. పోరాడాలి!*

"మళ్ళీ ఇంకోళ్ళని ఇప్పటికిప్పుడు అంటే కష్టం కదండీ, అయినా పనులు మానుకొని అన్ని రోజులు మనతో పాటెవరు వస్తారు." అన్నాడు తప్పించుకుంటూ.

"అదా మీ ప్రాబ్లం, నో ప్రాబ్లం, ఇందాకే మీ పురోహితుడు స్వలాభానంద తో మాట్లాడాను. ఏమీ ఇబ్బంది లేదన్నాడు. ఉండండి లైన్లో కలుపుతాను" అంటూ జగదీశ్ ఏదో చెప్పబోయే లోపలే తెరమీదికి అతడ్ని తెచ్చాడు మహా.

"అయ్యా, చెప్పండి. ఎప్పుడు ప్రయాణం? ఎన్ని జతలు సర్దుకోమంటారు? రేపు మీరు పికప్ చేస్కుంటారా, నన్నే రమ్మంటారా?" అన్నాడు ఊపిరి తీసుకోనివ్వకుండా.

"పంతులు గారూ, మీరొస్తానంటున్నది మార్కాపురమో, మిర్యాలగూడో కాదండీ! మార్స్ గ్రహం. అసలు తెలుస్తోందా మీకు?" అరిచాడు జగదీశ్ ఆవేశంగా.

"అయ్యో ఎందుకండీ అంత ఆయాస పడిపోతారు? తెలుసు మనం వెళ్ళేది మంగళ గ్రహానికనీ, అక్కడ పెళ్ళి చేసిన మొట్టమొదటి ఘన కీర్తి నాకూ, నా తరాలకీ కలగబోతోందనీ స్పష్టంగా తెలుసు!" అన్నాడు స్వలా ఉత్తరీయం సరిచేసుకుంటూ.

"బాగా ఫిక్స్ అయినట్టున్నాడు డాడీ" అన్నాడు రిషీ జగదీశ్ చెవిలో.

అతడితో కాదని "బావగారూ, భూమ్మీదే అందరూ వర్చువల్ పెళ్ళిళ్ళు చేసుకుంటూ, వర్చువల్ అక్షింతలు వేస్తుంటే, మీరేంటండీ, అక్కడి దాకా పురోహితుడిని తెమ్మంటున్నారు? ఈయనకి వందకి పైగా వర్చువల్ పెళ్ళిళ్ళు చేయించాడని రికార్డ్ కూడా ఉంది తెలుసా?" అన్నాడు జగదీశ్.

"ఏంటో నా రికార్డులు చూస్తుంటే నాకే భయం వేస్తుంటుంది అసలు నేనేనా ఇవన్నీ చేసింది అని." గర్వంగా నవ్వాడు స్వలాభానంద.

"బావగారూ, నాకున్నదొక్క కూతురు, మీకూ ఒకడే. ఈ వర్చువల్ ఇవీ నాకిష్టం లేదు. జీవితంలో ఒక్కసారి చేసే శుభకార్యం. మీరు డబ్బుకోసం ఆలోచిస్తుంటే చెప్పండి." అన్నాడు విషయానికొస్తూ .

జగదీశ్ నీళ్ళు నములుతుంటే రిషీ అందుకొని "భలే వారే అంకుల్, డాడీ అస్సలు రాజీ పడరు ఇలాంటి విషయాల్లో. ఆయనకేమన్నా ఇబ్బందౌతుందని వద్దంటున్నారు గానీ, హీ ఈజ్ కూల్." అన్నాడు.

"శుభం! ఇంకొక్క మాటండీ, మీలో ఎవరు నా సంభావన..." అంటున్నంత లోపే జగదీశ్ గట్టిగా దణ్ణం పెడుతూ "స్వామీ, అవన్నీ ప్రయాణంలో తీరికగా మాట్లాడుకోవచ్చు, ప్లీజ్ మీరు దయచేయండింక." అన్నాడు.

"సరేనండీ, రేపు కలుద్దాం ఎయిర్‌పోర్ట్ లో!" అని మాయమయ్యాడు స్వలా.

కాల్ ఎండ్ అయ్యాక జగదీశ్ ని ఓదారుస్తూ "ఇంకో ఎయిట్ క్రోర్స్ డాడీ, డోంట్ వర్రీ!" అన్నాడు రిషీ.

తర్వాతి రోజు పెళ్ళి సామాన్లూ, బట్టలూ కలిపి ఓ పదిహేను బ్యాగుల దాకా తేలాయి. సునంద చీరలకీ, నీలూ కాస్ట్యూమ్లకే సగం బ్యాగులు పట్టేసాయి.

"ఏంటే, రెండు వారాల ప్రయాణానికి ఇల్లంతా ప్యాక్ చేశావ్?" విసుక్కున్నాడు జగదీశ్.

"అంకుల్, ఇప్పటికే చాలా వదిలేసానని దిగులుగా ఉంది ఆంటీ. ఇంకా పెంచకండి దాన్ని!" అంది నీలూ సునందకి సపోర్ట్ గా.

అందరూ ఇంటి బైటికొచ్చారు. బైట మీడియా లేదు, అసలెవరూ పట్టించుకున్నట్టే లేదు. ఊపిరి పీల్చుకుంటూ ఓ పెద్ద ఫ్లై ట్యాక్సీలో బయల్దేరారు కుటుంబమంతా.

పది నిమిషాల తర్వాత ఎయిర్‌పోర్టు దగ్గర టాక్సీ స్టాండ్ లోకి దిగుతున్నప్పుడు అర్థమైంది వాళ్లకి ఇంటి దగ్గరున్న ప్రశాంత తంతా ఇక్కడ సునామీలా మారబోతోందని.

వందల మంది స్టేట్, నేషనల్ మీడియా ప్రతినిధులు కెమెరాలూ, మైక్ లతో వాళ్ళ చుట్టూ మూగి పోయారు.

“మార్స్ లో ఎన్నాళ్ళుంటారు? తిరిగొస్తారా రారా? మార్స్ లో అమ్మాయిలు ఏలియన్స్ లా ఉంటారట? మీ స్పేస్ షిప్ దేంతో చేసారు? అది పేలిపోతే మీరేం చేస్తారు?” ఇలా గుక్క తిప్పుకోకుండా ఫ్యామిలీలో అందర్నీ టార్గెట్ చేసి అడిగారు. ఆ ఆరుగారూ బిక్కమొహాలేస్కోని చూస్తుంటే ఓ లేడీ రిపోర్టర్ కొంచెం ముందుకెళ్లి “ఆ కట్నమేదో నాకే ఇవ్వండంకుల్, మీ వాడ్ని ఇక్కడే చేస్కుంటాను. హాయ్ హీరో, నేను ఓకే కదా నీకు!” అంటూ రిషీ డొక్కల్లో పొడిచింది. పరిస్థితి చెయ్యి దాటిపోతోందని జగదీశ్ ప్రెస్ వాళ్లని తోసుకుంటూ ఎయిర్‌పోర్టు లోపలికి వెళ్లబోతుంటే చివరిగా టీవీ420 యాంకర్ పట్టుకుంది. చచ్చినట్లు ఆగారు వాళ్ళు సడెన్ బ్రేకేసినట్టు.

“లైవ్ లో ఉన్న ప్రేక్షకులకి బ్రేకింగ్ న్యూస్ – కుజ గ్రహం మీద కాలు పెట్ట బోతున్న తెలుగు కుటుంబం ఇప్పుడే ఇక్కడికి రావడం జరిగింది. వాళ్ళ మొహాల్లో టెన్షన్ స్పష్టంగా తెలుస్తోంది, భూమిని వదిలి వెళ్తున్నామన్న బాధతో కుమిలి పోతున్నామని కూడా చెప్తున్నారు. ఏదేమైనా, టీవీ420 వాళ్ళ స్పాన్సర్ షిప్ లో ఈ పెళ్ళి జరుగుతున్నందుకు వాళ్ళంతా ఆనందం కూడా వ్యక్తం చేసారు.” అంది వాళ్ళ మొహాల మీద కెమెరా తిప్పుతూ.

వాళ్ళ ఛానెల్ ఎమ్.డీ వచ్చి ఏదో ఓ అందమైన ప్యాకెట్ ఇచ్చాడు రిషీకి.

“మా ఛానెల్ తరఫున మీ పెళ్ళి కానుక. ఇది మీకో సర్‌ప్రైజ్. దయచేసి దీన్ని మీ స్పేస్ ట్రావెల్ లోనే తెరవాలని మా కోరిక.” అన్నాడు. తర్వాత యాంకర్ రిషీ కి నేల మీదున్న ఒక పెద్ద స్టిక్కర్ వైపు చూపించింది దాని మీద "ఫస్ట్ స్టెప్ ఫర్ యూ, జైంట్ లీప్ ఫర్ తెలుగు మీడియా, ఎడ్యుకేషన్ ఇండస్ట్రీ!" అని రాసి పక్కనే పెద్ద ‘1’ నంబర్ వేసుంది.

“ప్లీజ్ క్యారీ ఆన్, మీ కోసమే అది.” అన్నాడా ఛానెల్ ఎమ్.డీ. రిషీ అడుగేసి ముందుకెళ్లాక అక్కడున్న అందరూ చప్పట్లు కొట్టారు. ఎయిర్‌పోర్ట్ సెక్యూరిటీ అడ్డు పడటంతో ఆ మీడియాని తప్పించుకుని లోపలికి పారిపోయారు త్వరగా వాళ్ళంతా.

“రిషీ డార్లింగ్, ఇంకో సారి ఆలోచించు. పెళ్ళికి రెడీ నేను!” ఇందాకటి రిపోర్టర్ మళ్ళీ అరిచింది వెనక నుండి.

లోపల చెకిన్ అయ్యాక వాళ్ళ ఫ్లైటు గేట్ దగ్గర వెయిట్ చేస్తుంటే రిషీకి సడెన్ గా ఏదో గుర్తుకొచ్చింది. హఠాత్తుగా పైకి లేచి అటూ, ఇటూ తిరగడం మొదలుపెట్టాడు. అప్పటివరకూ చివరి వరుసలో కూర్చొని నిద్రపోతున్న స్వలాభానంద రిషీ వెనగ్గా వచ్చి భుజం గట్టిగా తట్టి “ఏంటి, నా గురించే వెతుకుతున్నావా? డోంట్ వర్రీ, నిన్నొదిలెక్కడికీ పోను. నీ

నీడన్నా మిస్సౌతుందేమో గానీ, ఈ స్వలా మాత్రం కాదు. పద, లెట్స్ స్టార్ట్ ది హిస్టారిక్ జర్నీ!" అన్నాడు అతడి మోహంలో మోహం పెట్టి.

*మార్స్ లాంచ్ స్టేషన్, ఫ్లోరిడా*

ఓ పెద్ద కాన్ఫరెన్స్ రూంలో కుర్చోనుంది రిషీ ఫ్యామిలీ. రెండ్రోజుల ముందే దగ్గర లో ఉన్న హోటల్ లో దిగారు వాళ్ళు. అప్పటికే నానా రకరకాల మెడికల్, సైకలాజికల్ టెస్టులు చేశారా స్పేస్ ట్రావెల్ కి సరిపోతారో లేదో అని. ఊళ్లో పక్కనే ఉన్న క్యాసినోకి కూడా వెళ్ళనీకుండా ఆపెయ్యడంతో బాగా ఫ్రస్ట్రేషన్ లో ఉన్నాడు మల్లి. హాలు బైట ఎవరో వస్తున్నట్టు చప్పుడవ్వడంతో అందరూ అలర్టయ్యారు.

అంతలో, తలుపులు తోసుకుని హడావిడిగా లోపలికొచ్చిందో ఆఫీసర్. జీన్స్, టీషర్ట్ లో చాలా ఫిట్ గా, స్మార్ట్ గా ఉంది. తన గ్లాసెస్ క్లియర్ గా ఎదుటి వాళ్లని గుర్తుపట్టి వాళ్ళ పేర్లనీ, ఇన్ఫర్మేషన్ నీ తన కళ్ల ముందున్న తెరలో చూపెడుతున్నాయి. తను డైరెక్ట్ గా వెళ్ళి రిషీకి షేక్ హ్యాండిస్తూ

"హాయ్, ఐ యామ్ నందూ. చీఫ్ ట్రైనర్ ఆఫ్ మార్స్ ట్రావెల్స్." అంది.

యంగ్ అండ్ డైనమిక్ గా ఉన్న ఆ అమ్మాయి చీఫ్ అంటే తనని ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయారు అందరూ.

"తక్కువ శాలరీ ఇచ్చి పెట్టుకోనుంటారీ అమ్మాయిని, నాకేదో డౌట్ గా ఉంది వీళ్ళ మీద." నసిగాడు మల్లి.

"రేయ్, చిన్నగా! ఆ అమ్మాయి వింటే బాగుండదు. చూట్టానికి ఇండియన్ లా ఉంది కూడా." అన్నాడు జగదీశ్.

"అవునన్నోయ్, మన వాళ్ళు ఈ దేశంలో చాలా స్టేట్స్ ని కబ్జా చేసి, పాపం అమెరికన్లని తరిమేశారంటా. వాళ్ళు బాగా గొడవచేస్తే అక్కడక్కడా జాలిపడి మైనారిటీ హక్కులు కల్పిస్తున్నారంట. ఇంకెంత మందిని ఇళ్ళల్లో పనికి కూడా పెట్టుకుంటున్నారంట." అన్నాడు నోటిమీద వేలు పెడుతూ.

"అవన్నీ సరే గానీ, ఇక్కడే పెరిగినమ్మాయిలాగుంది. మన భాషలు వచ్చంటారా?" అంది సునంద.

తన గురించే జరుగుతున్న సంభాషణ వింటూ చిరునవ్వుతో అందరినీ కూర్చోమని సైగచేస్తూ, ఎదురుగా ఉన్న స్క్రీన్ దగ్గర నిలబడింది తను.

సునంద వైపు వేలు చూపిస్తూ "మీరు, మీరు చెప్పండి మార్స్ కి ఎందుకు వెళ్ళాలనుకుంటున్నారో?" అంది దృఢంగా.

అందరూ షాక్ తిన్నారొక్కసారిగా తన తెలుగు విని. మళ్ళి చిన్నగా విసిల్ వేసి "ఫ్లోరిడాని తెలుగువాళ్లు పంచుకురాన్న మాట." అన్నాడు అందరికీ వినిపించేటట్టు.

నందూ కోపంగా చూస్తే "అదేనండీ, మా వాడి పెళ్ళికోసం బయల్దేరాం. మార్స్ కి కూడా ఓ టూరేసినట్టుంటది కదా అని మా ఫ్యామిలీని గూడా తీస్కెల్తున్నాడు మా అన్నాయ్." అన్నాడు మాట మారుస్తూ మళ్ళి.

"వావ్! పెళ్ళి కోసం మార్స్ దాకా వెల్తున్న ఫస్ట్ ఫ్యామిలీని మిమ్మల్నే చూస్తున్నా. అయినా ఇప్పట్లో ఇష్టముంటే కలిసుంటున్నారు, లేకపోతే విడిపోతున్నారు. ఇంత కష్టపడి పెళ్ళి చేస్కోని, రేపు విడిపోవాల్సొస్తే?"

"మేడమ్, ప్లీజ్. పెళ్ళి ముందు అలాంటి అశుభాలు మాట్లాడొద్దు." వారించాడు జగదీశ్ చెయ్యూపుతూ.

"నిజాలు మాట్లాడితే మీకు అశుభాల్లానే అనిపిస్తాయ్. ఎనీవేస్, మీ మనీ, మీ ఇష్టం." అంది భుజాలెగరేస్తూ.

రిషీకీ కోపమొచ్చినా నందూ మొహాన్ని చూస్తూ ఏమీ అనలేకపోయాడు.

వెనకున్న స్క్రీన్ మీద 'ట్రైనింగ్ ప్రోగ్రాం ప్లాన్' అని రావడం మొదలవడంతో నందూ సర్దుకుని "మిమ్మల్ని రాబోయే మూడు రోజులూ కొంచెం ఇబ్బంది పెట్టబోతున్నాను. ప్లీజ్ అందరూ ఓపికతో ఉండాలి..." అని ఇంకా ఏదో చెప్పేంతలోనే మళ్లి పైకి లేచి చకచకా బైటకి నడవబోయాడు.

నందూ షాక్ తిని "హలో, ఎక్కడికండీ? వుయ్ ఆర్ జస్ట్ స్టార్టింగ్!" అంది.

"ఏం లేదు మేడమ్, నాకు ఇబ్బంది పడటమంటే చాలా ఇబ్బంది. అందుకే మిమ్మల్ని ఇబ్బందిపెట్టకూడదని ముందే వెళ్ళిపోతున్నాను. లాంచ్ రోజు కలుద్దాం మళ్ళీ!" అని ముందుకెళ్ళబోయాడు.

రిషీ కిసుక్కున నవ్వి "బాబాయ్, ప్లీజ్. వచ్చి కుర్చో. ఆ అమ్మాయికి హార్ట్ ఎటాక్ వచ్చేలా ఉంది. ముందు రోజే నీ తడాఖా చూపిస్తే ఇంక ముందు ముందు ఎలా భరిస్తుందో నిన్ను?" అన్నాడు.

"మా వాడు చెప్పాడు కదా అని కుర్చుంటున్నా, లేకపోతే ఇప్పటి కల్లా దగ్గరున్న క్యాసినోలో ఓ చక్రం తిప్పేవాణ్ణి." అంటూ మళ్ళీ సీట్లో వచ్చి పడ్డాడు.

గట్టిగా ఊపిరి పీల్చుకుని స్క్రీన్ పైనున్న విషయాలు చెప్తోంది నందూ.

"మార్స్ కి వెళ్ళాలంటే ఇప్పటి లేటెస్ట్ టెక్నాలజీతో నాలుగు రోజులు పడుతుంది. మొదట్లో ఆరు నెలల దాకా పట్టేది కానీ తర్వాత బాగా తగ్గింది. మీ అందరికీ స్పేస్ క్రాఫ్ట్ లో ఎలా ఉండాలో ట్రైన్ చేస్తాం ఈ మూడు రోజుల్లో. కొన్ని స్పెషల్ టెస్టులు కూడా ఉంటాయి."

"ఇప్పటికే మీ వాళ్ళు సగం రక్తం లాగేశారు వంద రకాల టెస్టులు చేసి. ఇంకా ఏం టెస్టులమ్మా!" అంది సునంద ఇంజక్షన్లతో నొప్పిగా ఉన్న భుజం మీద రుద్దుకుంటూ.

"ఇవి వేరే ఆంటీ. బ్లడ్ తో పనిలేదు." అంది నందూ.

"ఈసారి మనుషుల్నే పిండేయ్యాలని డిసైడయ్యారొదినా, చిన్నచిన్న బ్లడ్డు సీసాలు చాలట్లేదంట" అన్నాడు మల్లి చల్లగా.

బుసకొట్టినట్టు చూసింది నందూ.

"చూడండి, మీరు వెళ్తోంది మయామీ బీచ్ కి కాదు, మార్స్ కి. ఆ ప్రయాణంలో వచ్చే ఇబ్బందులకి సిద్ధంగా ఉండాలి. ప్లీజ్, మీరందరూ సీరియస్ గా ఫాలో అవ్వాలి ఈ ట్రైనింగ్ ప్రోగ్రాం. నేను చివరికి ఓకే చేస్తేనే మీ ప్రయాణమైనా, ఈ పెళ్లైనా!" అంది అందరి వైపూ చూస్తూ.

"అసలీ కష్టాలేం పడకుండా ఉండకూడదనే కదా, కోట్లు తగలేసింది. ఇంకా ఈ ట్రైనింగ్ లేంటి? మాకు సహాయంగా ఎవరైనా ఉంటే సరి స్పేస్ క్రాఫ్ట్ లో." అన్నాడు జగదీశ్ 'డబ్బులన్నీ ఎక్కడికి పోతున్నాయో' అన్నట్టుగా ఫేసు పెట్టి.

"కరెక్టన్నాయ్, ఎయిర్ హోస్టెస్ లాగా స్పేస్ హోస్టెస్ ఎవరైనా…" అంటూ అదో రకంగా నవ్వాడు మల్లి.

నందూ అసహాయంగా రిషీ వైపు చూసింది.

"కొంచెం అందరూ తనకి గ్యాప్ ఇస్తారా? ఓ మీద పడిపోతున్నారు. తన పని తనని చెయ్యనివ్వండి. మీ గొడవకి, ట్రైనింగ్ కి ముందే మనల్ని ఫెయిల్ చేసేలా ఉంది." అన్నాడు వెనక్కి తిరిగి రిషీ కోపంగా. అందరూ సైలెంటైపోయారు.

నందూ చకచకా మూడు రోజుల ప్రోగ్రాం ఏంటో చెప్పి, వాళ్ళందరినీ ఓ చిన్న వ్యాన్ లో దగ్గరలో ఉన్న హ్యాంగర్ కి తీసుకెళ్లింది. ఆ హ్యాంగర్ లోపల ఓ ఫుట్ బాల్ స్టేడియం అంత స్థలం ఉంది. రకరకాల విమానాలూ, స్పేస్ క్రాఫ్ట్ లూ పెట్టున్నాయ్ అక్కడక్కడా. పైన పెద్ద పెద్ద క్రేన్ లు హెవీ మెటీరియల్స్ ని అటూ ఇటూ మోస్తున్నాయి. ఏదో కొత్త లోకంలోకి వచ్చినట్టుంది వాళ్లకి.

"అటు చూడండి ఆ మూల రెడ్ కలర్ లో ఉందే అదే మీ స్పేస్ క్రాఫ్ట్. "అంది నందూ చెయ్యి చూపిస్తూ. నీలూ, రిషీ పరిగెత్తుకుంటూ వెళ్ళారు ముందు. అందరికీ లోపలి విషయాలన్నీ వివరించి చెప్పింది నందూ.

"ఈ సీట్ నాది, ఫ్రంట్ వ్యూ బాగా కనిపిస్తది." అన్నాడు మల్లి ఓ సీట్ లో సెటిల్ అవుతూ.

"కుదరదు, మీరు వేరే సీట్ చూస్కోండి." అంది నందూ.

"చూడన్నాయ్, ఈ అమ్మాయి అన్నిటికి అడ్డం చెప్తోంది. ఏ ఇక్కడెవడన్నా వీ.వీ.ఐ.పీ కుర్చుంటాడా?"

"అంత కన్నా ఎక్కువ, మీ పైలట్ కుర్చుంటాడు." అంది నవ్వుతూ.

"ఛ, సర్లే, ఆ విండో సీటు మీద కర్చీఫేస్తన్నా ఐతే." అన్నాడు అక్కడికి మారిపోతూ.

తర్వాత రోజంతా స్పేస్ క్రాఫ్ట్ లోకి ఎక్కడం, దిగటం, లోపల ఏదైనా జరిగితే ఏం చెయ్యాలో, భూమ్మీద కంట్రోల్ సెంటర్ కీ, మార్స్ వాళ్ళకీ మెసేజ్ ఎలా పంపాలో ప్రాక్టీస్ చేయించింది వాళ్లతో. రిషీకి కొన్ని బాధ్యతలు కూడా ఇచ్చింది పైలట్ కి సహాయంగా ఉండటానికి.

నెక్స్ట్ డే పొద్దున్నే హోటల్ నుండి సరాసరి ఒక ఎరోప్లేన్ దగ్గరికి తీసుకెళ్లారు వాళ్లని. ముందే అందరినీ టైట్ గా ఉండే బాడీ సూట్ లు వేస్కోమన్నారు. ఇబ్బందిగా ఉన్నా కష్టపడి వేస్కున్నారంతా. ఆ విమానం వెనక భాగం వైపు తెరిచి ఉంది. లోపల ఖాళీగా ఉంది. అక్కడే రెడీగా ఉంది నందూ నల్ల బాడీ సూట్ తో, మెరిసే గాగుల్స్ తో.

"గుడ్ మార్నింగ్, నిన్న మీకు చెప్పినట్టు, స్పేస్ లో గ్రావిటీ ఉండదు. ఆ స్టేట్ లో ఎలా ఉంటుందో తెలియడానికే ఈ ట్రైనింగ్." అంటూ అందరినీ లోపలికి తీసుకెళ్ళింది.

మామూలు విమానాల్లో ఉన్నట్టు ప్యాసింజర్ సీట్లు లేవు లోపల. ఓ అంచుకి ఫోల్డ్ చేసున్న సీట్లని తెరిచి కుర్చున్నారందరూ. అందరికీ గుండెలూ అదురుతున్నాయి. మార్స్ అంటే టికెట్ కొనుక్కోని, స్నాక్స్ తింటూ వెళ్ళే ప్లేస్ కాదని అర్థమౌతోంది మెల్లగా.

విమానం బాగా పైకెళ్ళాక ఒక ఛాంబర్ లోకి తీసుకెళ్ళింది నందూ అందరినీ. ఆ ఛాంబర్ గోడల చుట్టూ, సీలింగ్, ఫ్లోర్ మీద మెత్తని ప్యాడింగ్ ఉంది. ఏం జరిగినా, ఎవరికీ దెబ్బ తగలకుండా. తన చుట్టూ చేరిన వాళ్ళని చూస్తూ అంది "మనకి 40–50 సెకన్ల వరకే ఈ గ్రావిటీ లెస్ స్టేట్ ఉంటుంది. నేను చెప్పినప్పుడు అందరూ చేతులు ముందుకి చాచి కాళ్లని వెనక పైకి లేపండి, ఈత కొడుతున్నట్టు గా." అంది.

"ఏమైనా తేడాలొస్తే ముందుకి పడి మా పళ్ళు రాలితే!?" అన్నాడు మల్లి దిక్కులు చూస్తూ.

అది పట్టించుకోకుండా "3...2...1...గో" అంది నందూ. ఉన్నట్టుండి గాల్లో తేలుతున్నారందరూ. రిషీ అలా గాల్లో తేలి గోడలని తంతూ అటూ, ఇటూ తిరుగుతున్నాడు. జగదీశ్, సునందలు చేతులు పట్టుకుని మెల్లగా అక్కడే తేలుతున్నారు. మల్లి తలకిందులుగా తిరిగిపోయి ఉక్కిరిబిక్కిరైతే నందూ అతన్ని మామూలుగా తిప్పింది. ఒక్క నిమిషం పాటు బరువు తెలీకుండా పక్షుల్లా మారిపోయారందరూ. అదో విచిత్రమైన స్టేట్. పురోహితుడు స్వలా మాత్రం గట్టిగా ఒక పక్కనున్న హ్యాండిల్ పట్టుకుని నించున్నాడు మిగతా వాళ్ళ విన్యాసాలు చూసి నవ్వుతూ. చివరికి నందూ సిగ్నల్ తో అందరూ మళ్ళీ కాళ్లని కిందికి తిప్పారు. ఒక్క క్షణంలో కింద అతుక్కుపోయారు.

అలా ఇంకో మూడు సార్లు చేసాక కిందికి ల్యాండ్ అయ్యింది వాళ్ళ ఎరోప్లేన్. నందూ అందరితో "ఎలా అనిపించింది? ఆర్ యూ ఆల్ రైట్?" అడిగితే, నోరుకి అడ్డంగా చెయ్యి పెట్టుకోని అర్జంట్ గా బాత్రూం వైపు పరిగెత్తాడు మల్లి. జగదీశ్ నవ్వుతూ "పర్లేదు, మేము ఓకే. ఇలాంటి టెక్నాలజీ మా ఊళ్లో పెడితే ట్రాఫిక్ గొడవ లేకుండా గాల్లో తేలుతూ వెళ్ళొచ్చు." అన్నాడు నవ్వుతూ.

కొంచెం సేపు రిలాక్స్ అయ్యాక మళ్ళీ వాళ్లకి అంతరిక్షం గురించిన విషయాలూ, దానికి సంబంధించిన మెటీరియల్స్ చదవమని ఇచ్చింది నందూ. "ఈ ట్రైనింగులతో పెళ్ళి కి కాదు, మిలిట్రీలో చేరడానికెల్తున్నట్టుంది." అని నసుగుతూ టైం పాస్ చేశాడు మల్లి.

చివరి రోజు ట్రైనింగ్. అందరినీ ఆ స్పేస్ స్టేషన్ కి దూరంగా ఉన్న ఒక పెద్ద బిల్డింగ్ కి తీసుకెళ్లింది నందూ. అక్కడి రెండో ఫ్లోర్ లో ఉన్న పెద్ద విండోలో నుండి చూస్తే బిల్డింగ్ మధ్య భాగంలో ఒక పెద్ద సర్కిల్ షేప్ లో ఉన్న డివైజ్ కనపడుతోంది. దానికి రెండు వైపులా రెండు చిన్న క్యాబిన్స్ అటాచ్ చేసున్నాయి.

"ఏంటి మా ఊళ్ళో జరిగే ఎగ్జిబిషన్ లో పెట్టే రైడ్ లాగుంది. ఒక్కసారి ఇద్దరి నే ఎక్కిస్తారా?" అన్నాడు మల్లి.

"అలాంటిదే, మీరు స్పేస్ క్రాఫ్ట్ లో పైకెళ్ళేటప్పుడు, చాలా ఫోర్సెస్ మీ బాడీమీద పని చేస్తుంటాయి. అవి తట్టుకోగలరో లేదో తెలియడానికే ఈ టెస్టు." అంటూ రిషీనీ, సునందనీ పంపింది ముందు. ఆ మిషన్ వేగంగా తిరిగుతున్నారిషీ, సునందలు లోపల బానే తట్టుకుని నిలబడగలిగారు కానీ కిటికీ లోంచి వాళ్ళ వేగాన్ని చూస్తున్న జగదీశ్ కే కళ్ళు తిరిగాయి. ఎందుకైనా మంచిదని తన టర్న్ వచ్చినప్పుడు చేతిలో వొమిట్ బ్యాగులు పట్టుకుని కూర్చున్నాడు. మల్లి మాత్రం తిరిగి బైటికొచ్చాక ఆ తిప్పే ఆపరేటర్ అంతు చూస్తానంటూ హడావిడిగా అటూ ఇటూ తిరిగాడు కాసేపు. మొత్తానికి చిన్న చిన్న ఇబ్బందులు పడ్డా, అందరూ ఆ టెస్టులో పాసయ్యారు.

చివరికి అన్ని టెస్ట్ రిసల్ట్స్ చూసి, అందరినీ ప్రయాణానికి 'ఓకే' అని స్టాంపేసింది నందూ. ఆ ఆనందంలో ఆమెని అమాంతం హగ్ చేసుకున్నాడు రిషీ. ఏం చేశాడో తెలిసి ఇబ్బందిగా వెనక్కొస్తున్నప్పుడు "ఏరా! ఆగి పోదామా మరి, ఇక్కడే పెట్టుకుందాం పెళ్ళి , జస్ట్ పెళ్ళి కూతురు ఛేంజ్ అంతే." అన్నాడు మల్లి అతని చెవిలో. దెబ్బ తిన్నట్టు చూసి, ఒక్క క్షణంలో తేరుకుని, "నందూ, మమ్మల్ని ఇంత కేర్ ఫుల్ గా ట్రైన్ చేసి పాస్ చేసినందుకు, నీకు మా ఫ్యామిలీ అంతా ఈ ఈవినింగ్ పార్టీ ఇద్దామనుకుంటున్నాం. ప్లీజ్ యూ నీడ్ యాక్సెప్ట్ ఇట్." అన్నాడు పెద్దగా.

నవ్వింది తను తల వాల్చి.

## 10

ఆ రోజు సాయంత్రం అందరూ లేజీగా, జాలీగా ఉన్నారు హోటల్లో. సడెన్ గా టైం ఆరైందని రిషీ అందర్నీ డిన్నర్ కెళ్దామని హడావిడి పెట్టడం మొదలు పెట్టాడు.

"మూడు రోజులు ఈ నస గాళ్లు పిండొదిలేసాక ఇప్పుడే కొంచెం బ్రేక్ తీసుకుంటున్నాం, మమ్మల్నొదిరెయ్ రా." అన్నాడు మల్లి.

"అవును బాబూ, రేపీ పాటికి అందరం పైకి పోతాం, కొద్ది సేపైనా రెస్టు తీస్కోనీ..." అన్నాడు స్వలా.

"ఏంటండీ ఆ పాడు మాటలు! పైకి కాదు, పక్క గ్రహానికనండి." అంది సునంద.

"పైకెళ్తే గానీ పక్కకెళ్ళలేం గదండీ..." అంటూ చుట్టూ అందర్నీ చూసి ఠక్కున ఆపేసాడు స్వలా.

ఛాన్సిస్తే కదలరని, అందర్నీ డిన్నర్ కి లాక్కెళ్ళాడు రిషీ. వెళ్తూ వెళ్తూ తనకి నచ్చిన ఆరెంజ్ జాకెట్ వేస్కున్నాడు.

"బ్రో, నువ్వీ మధ్య బాగా ఫ్యాషన్ ఫాలో అవుతున్నట్టున్నావ్?" అంది నీలూ కారులోకి ఎక్కుతున్నప్పుడు.

"ఫ్యాషన్ ని కాదే, ఆ నాసా మేడమ్ ని ఫాలో అవుతున్నట్టున్నాడు." అన్నాడు మల్లి ఒక కన్ను పైకెత్తి రిషీని డౌట్ గా చూస్తూ.

జగదీశ్, సునందలు నోరు తెరిచారు. "బాబాయ్, విశాతో పెళ్ళి పెట్టుకుని నందూతో... అలా ఎలా అంటావ్?" అన్నాడు రిషీ అసహనంగా.

"రెండ్రోజుల్నించీ తనని చూస్తున్నప్పుడల్లా నీ మొహం వెలిగిపోతోంది. ఏదైనా ఉంటే ఇక్కడే చెప్పెయ్! మళ్ళీ మార్స్ దాకా తీస్కెళ్లి ముహూర్తం టైంకి మీ అమ్మ నీ రూంలోకి చూసి 'మున్నా!' అనీ, నాన్న 'రిషీ!' అని గావుకేక పెట్టడాలూ, నువ్వు రూం వెనక కిటికీ లోంచి దూకి అప్పుడే బయల్దేరుతున్న రాకెట్టు పట్టుకొని భూమ్మీద కొచ్చి నందూ తో భారీ ఎమోషనల్ డైలాగులు కొట్టడాలూ, మార్సు వాళ్ళు ఇదే అదనుగా భూమ్మీద పగ పెంచేసుకోని యుద్ధం ప్రకటించడాలూ! ఇవన్నీ వద్దమ్మా." అన్నాడు హడావిడిగా. అందరూ ఒక్క నిమిషం నిశ్శబ్దంగా ఉండి, పెద్దగా నవ్వేసారు.

"మీలో చాలా టాలెంట్ ఉంది సార్, మూవీస్ కి స్టోరీ లెందుకు రాయట్లేదు!?" అన్నాడు స్వలా సీరియస్ గా.

రిషీ మాత్రం కోపంతో “బాబాయ్, ఇంకో మాటంటే, నడుస్తున్న కార్లోంచి కిందికి తోసేస్తా నిన్ను.” అన్నాడు.

వాళ్ళ కారునే కొంత దూరం నుండి ఇంకో కారు ఫాలో అవుతోందని గమనించలేదెవరూ. రెస్టారెంట్ పార్కింగ్ లో రిషీ కారు దిగి బైటకి రాగానే, వెనక కారులో గమనిస్తున్న జానీ తన ముందు స్క్రీన్ లో ఉన్న రిషీ ఫొటోని మ్యాచ్ చేస్కోని “దట్ ఆరెంజ్ జాకెట్ గయ్.” అన్నాడు వేలితో ముందు చూపిస్తూ.

“వెళ్దామా?” అడిగాడు పక్క సీట్లో గన్ తో రెడీగా ఉన్నతను.

“లేదు, ఇట్స్ డేంజరస్. బైట వెయిట్ చేద్దాం. వీళ్ళు ఈ దారిలోనే వెనక్కి వెళ్ళాలి. అప్పుడు చూద్దాం.” అంటూ వాళ్ళ కారుని వెనక్కి తిప్పి పక్కనే ఉన్న దట్టమైన చెట్ల పక్కన ఆపి ఉంచాడు జానీ.

రిషీ వాళ్ళందరూ లోపలి కెళ్ళాక ఒక రోబో వచ్చి వాళ్లని తనతో తీసుకెళ్లింది. అక్కడ ఓ వైపు బార్, మరో వైపు డైనింగ్ సీట్లూ ఉన్నాయి. మల్లి ఆ బార్ దగ్గరే బ్రేక్ వేసినట్టు ఆగిపోతే వాళ్ళావిడ బలవంతంగా ముందుకి తోసుకెళ్ళాల్సొచ్చింది. ముందే రిజర్వ్ చేసిన టేబుల్ దగ్గర నందూ గ్రీన్ స్లీవ్ లెస్ టాప్, జీన్స్ వేసుకోనుంది. తన అందర్నీ చూస్తూ నవ్వుతూ వచ్చి రిషీకీ హగ్గిచ్చి పక్కనే కుర్చో పెట్టుకుంది.

“మీ అందరికీ ఈ రెస్టారెంట్ స్పెషాలిటీ తెలుసా, ప్రపంచంలో మొట్టమొదటి అన్నీ రోబోలతో నడిచే రెస్టారెంట్ ఇది. పదేళ్ల నుండి సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది.” అంది కళ్ళు పెద్దవి చేస్తూ.

చుట్టూ తిరుగుతూ ఆర్డర్స్ తీసుకుంటున్న రోబోలని చూసి ఆశ్చర్యపోయారందరూ.

“మరి లోపల చెఫ్స్?” అడిగాడు సందేహంగా మల్లి.

“లోపలి చెఫ్సే కాదంకుల్, బార్ టెండర్ కూడా రోబోనే!” అంది తను.

“అది సరే, ఇంతకీ డబ్బులైనా మనుషులకిస్తాయా? లేతే ఇవే ఎక్కడో ఖర్చు పెట్టేసి, సున్నం పెడతాయా?” అన్నాడు కళ్ళు తిప్పుతూ.

"ఏమో అంకుల్, వాటిష్టం అనుకుంటా."

వాళ్లని కట్ చేసి నందూతో మాట్లాడ్డం మొదలుపెట్టాడు రిషీ. మాటల్లో వాళ్ళ కళ్ళు మధ్య మధ్యలో కలుస్తూ ఇబ్బందిగా ఉన్నప్పుడు ఇద్దరూ ప్లేటులోకి, పక్కనోళ్ళ వైపు చూడటం చేస్తున్నారు.

ఎదురుగా మల్లి వైపోసారి చూస్తే తను కళ్ళతోనే 'ఏం జరుగుతోంది' అన్నట్టు సైగ చేసాడు. రిషీ నవ్వి తల అడ్డంగా ఊపాడు. చివరికి అందరూ డెసెర్ట్స్ తింటున్నప్పుడు అలాగే మాటల మధ్య లోంచి రిషీ తలెత్తి చూస్తే టేబుల్ చివర నుండి సునంద తన వైపే సీరియస్ గా చూస్తుండటంతో దొంగలాగా తల తిప్పుకున్నాడు తను.

డిన్నర్ అయ్యాక అందరూ బయల్దేరబోతుంటే, నందూ మొహం దిగులుగా మారింది. ఏదైతే అదౌతుందని తను "రిషీ, క్యాన్ యూ గివ్ మి సమ్ కంపెనీ?" అంది. అతను పక్కనే ఉన్న సునంద వైపు అసహాయంగా చూస్తే "ఆంటీ, రిషీని జాగ్రత్తగా ఇంట్లో దింపే బాధ్యత నాది. ఇట్స్ జస్ట్ ఫర్ సమ్ టైం." అంది. సునంద వాళ్ళిద్దరి వైపు చూస్తూ "రిషీ, తొందరగా వచ్చేయ్. రేపటి కి లేట్ అవ్వ కూడదు మనం." అంది సీరియస్ గా.

వాళ్ళు కారెక్కాక "చూశావా వదినా! నేను ముందే చెప్పానా?" అన్నాడు మల్లి అవకాశం కోసం చూస్తున్న వాడిలా. మౌనంగా ఉంది తను.

"డాడ్! తనొక ఫ్రెండ్, లోన్లీగా ఉంది. మాట్లాడుకోవడానికి ఉండమంది, నథింగ్ రాంగ్ ఇన్ దట్." అంది నీలూ భుజాలెగరేస్తూ.

వాళ్ళు వెళ్లిపోయాక రిషీని బార్ దగ్గరికి తెచ్చింది నందూ. ఎదురుగా ఓ రోబో డ్రింక్స్ కలుపుతోంది.

"టూ బ్లూ హిల్స్ ప్లీజ్." అంది.

"అలాంటివి నాకు పడవు. పైగా తాగి పడిపోతే, మీ నాసా వాళ్ళే నన్ను రాకెట్ కాదు కదా, ఆ లాంచ్ స్టేషన్ గడప కూడా తాకనివ్వరు." అన్నాడు సందేహంగా మొహం పెట్టి.

"అంత సీన్ లేదు, ఇది మార్టినీ కాక్ టైలే, లైట్ గానే ఉంటుంది." అంది సిప్ చేస్తూ.

"వద్దులే, ఇందాక మమ్మీ కూడా రమ్మంది. ఏదో తేడాగా చూసింది నన్ను. ఇప్పుడు తాగెల్తే ఫుల్లు క్లాస్ పీకుతుంది."

అతని మాట పూర్తవ్వకుండానే నందూ అతని కాలర్ పట్టుకొని తన దగ్గరగా లాక్కుంది. కళ్ళల్లో కళ్ళు పెట్టి చూస్తూ "మార్స్ వెళ్ళకపోతే ఛస్తావా! ఇక్కడ నేనున్నానుగా, స్టే విత్ మీ..." అంది తూగుతున్నట్టు.

రిషీకి షాక్ కొట్టినట్టయ్యింది. అలాగే తన కళ్ళలోకి ఓ నిమిషం చూస్తూ ఉండిపోయాడు. నందూ జీవితంలోని, మనసులోని ఒంటరితనం ఆమె కళ్ళల్లో స్పష్టంగా తెలుస్తోందతనికి. జాలేసింది. నందూ అతని కళ్ళూ, పెదాల వైపు మార్చి చూస్తూ ఇంకా దగ్గరగా రాబోయింది. అతనొక్క క్షణంలో తేరుకుని వెనక్కి జరిగి మెల్లగా తన కాలర్ ని ఆమె చేతి నుండి విడిపించుకున్నాడు.

ఒక్కసారి గట్టిగా ఊపిరి పీల్చుకుని, తన పక్కనే ఉన్న డ్రింక్‌ని గటగటా తాగేశాడు. అతడ్ని చూసి చిన్నగా నవ్వుతూ "భయపడ్డావా?" అంది.

తలూపాడతను అడ్డంగా.

"విశా అంటే జెలెస్ గా ఉంది నాకు. నీ అంత మంచి పార్టనర్ ని కొట్టేసినందుకు"

"నేనే లక్కీ, తను చాలా మంచిది."

"నేనూ మంచి దాన్నే, నాతో ఉండిపోతావా?" అంది మళ్ళీ.

"నందూ...ప్లీజ్!"

"ఎందుకురా ఎవరూ నా జీవితంలోకి రారు? వచ్చినా ఉండరు?" అంది ఇంకో డ్రింక్ గ్లాస్ పైకెత్తేస్తూ.

"నందూ, ఇన్నాళ్ళూ నువ్వు కావాలనుకుంటున్న వాళ్ల కోసం వెతుకుతున్నావేమో, ఓ సారి నీ చుట్టూ, నిన్ను కావాలనుకుంటున్న వాళ్లని చూడు..." అన్నాడు తన చెయ్యిమీద చెయ్యి పెడుతూ.

"అంతేనా, నువ్వు..."

"ఫ్రెండ్స్?!"

తను వంగిపోయి దిగులుగా ఉంది కొంత సేపు. తర్వాత చటుక్కున తలెత్తి ఇంకో డ్రింక్ అని సైగచేసింది రోబో వైపు.

రిషీ మధ్యలో "నో, నో మోర్ డ్రింక్స్. పద వెళ్దాం. ఇది లైట్ అన్నావ్, చూడు నీకెంత ఎక్కేసిందో." అన్నాడు తన చెయ్యి పట్టుకుని పైకి లేపబోతూ.

నందూ “జస్ట్ ఫ్రెండ్సా మనం!” అని తూలుతూ అతనితో బైటకి నడిచింది.

వాళ్ళు బైటికొచ్చేటప్పటికి అర్ధరాత్రి రెండు దాటుతోంది. బయట చల్లటి గాలి తగలడంతో నందూ వణకడం గమనించి తన జాకెట్ ని ఆమెకిచ్చాడు రిషీ. "థాంక్స్ మన ఫ్రెండ్ షిప్ కి గుర్తా?" అంది అది వేసుకుంటూ నందూ. ముందే వెయిట్ చేస్తున్న 'డ్రైవర్ లెస్ క్యాబ్' ఎక్కి నందూ ఇంటికి బయల్దేరారిద్దరూ.

దూరం నుంచి ఆరెంజ్ జాకెట్ వేసుకొని ఎవరో బయటికొస్తూ కనపడటంతో, అలెర్ట్ అయ్యాడు జానీ. "ఫాలో దట్ ఎల్లో కార్." అని ఆర్డరిచ్చాడు తన కారుకి.

"ఇట్ ఈస్ ఇల్లీగల్ టు ఫాలో అదర్ వెహికల్." అంది కారు.

"షట్ అప్ అండ్ డూ ఇట్!" అరిచాడు పెద్దగా.

మెల్లగా కొంత దూరంనుండి ఫాలో అయ్యారు ఒక పది నిమిషాలు. ముందున్న క్యాబ్ ఒక పెద్ద అపార్ట్మెంట్ కమ్యూనిటీ ముందు ఆగింది. అందు లోంచి ఆరెంజ్ జాకెట్ వేసుకున్న వ్యక్తి దిగి రెండు నిమిషాలు వంగి కారు విండోలోకి చూసి మాట్లాడుతున్నట్టు తెలుస్తోంది జానీకి.

"ఇందాక బయల్దేరిన హోటల్ ఇది కాదు కదా? ఇక్కడెందుకు దిగుతున్నాడు?" అడిగాడు పక్కనతను. జానీకీ అర్థం కాలేదు. అతనికవన్నీ అనవసరం. ఇద్దరూ వాళ్ళ కారు పక్కగా పార్క్ చేసి, ముందున్న కారు దూరం వెళ్ళిపోయే వరకూ ఆగి, ఆరెంజ్ జాకెట్ ని ఫాలో అవ్వడం మొదలుపెట్టారు.

## 11

**క్యాబ్ లో** వెల్తున్న రిషీ ఆలోచనలన్నీ నందూ చుట్టూనే తిరుగుతున్నాయి. ఆమెందుకో తన మాటలకింకా కన్విన్స్ అవ్వలేదనిపిస్తోంది. తన బిహేవియర్ చూస్తుంటే ఏదైనా పిచ్చి పని చేస్కుంటుందేమో అని ఒక్కసారిగా భయం పుట్టింది.

తనతో ఇంకో సారి మాట్లాడితే బెటర్ అని క్యాబ్ ని మళ్ళీ వెనక్కి తీసుకెళ్ళమన్నాడు. అయిదు నిమిషాల్లో వేగంగా మళ్ళీ నందూని దించిన చోటికి చేరాడు. కారు దిగుతూనే ఒక్కసారిగా మైండ్ బ్లాంక్ అయ్యిందతనికి. ఎదురుగా తలపై ముసుగేసి, చేతులు వెనక్కి కట్టేసున్న మనిషిని కారులోకి తొయ్యడానికి ప్రయత్నిస్తున్నారు ఇద్దరు. అతను గట్టిగా పెనుగులాడుతున్నాడు. దూరం నుంచి ఆ మనిషి ఆరెంజ్ కలర్ లో మెరవడంతో రిషీ తల తిరిగిపోయింది – నందూ!

ఇంకో ఆలోచన లేకుండా "లీవ్ హర్!" అని అరుస్తూ రన్ చేస్తున్నాడు అటు వైపు. అతడ్ని చూసిన జానీకీ అయోమయంగా ఉంది. అతని అసిస్టెంట్ గన్ తీసి రిషీ వైపు పాయింట్ చెయ్యబోతుంటే జానీ అరిచాడు "రేయ్, డోంట్ షూట్, ఇక్కడ కాదు. నాకేదో డౌట్ గా ఉంది." అంటూ నందూ ముఖం మీద ముసుగు తీసి ఆశ్చర్యపోయాడు. "జానీ, హూ ఈస్ షి?" అన్నాడు పక్కనోడు.

"అదే నాకూ కన్ఫ్యూజన్ గా ఉంది. మనం ఆ ఇండియన్ అనుకొని ఎవర్నో తెచ్చినట్టున్నాం." అన్నాడు.

రిషీ దగ్గరగా వచ్చేశాడు వాళ్లకి – "రేయ్ లీవ్ హర్, నందూనెందుకు కిడ్నాప్ చేస్తున్నారు?"

అసిస్టెంట్ జానీ వైపు చూసి "హీ ఈస్ ది గై, మనం లక్కీ, వాడే వచ్చాడు. లెట్స్ కిల్ హిమ్?" అన్నాడు. జానీ సైగ చేశాడు సరేనని.

ముసుగు తీసెయ్యడంతో ఇవన్నీ వింటున్న నందూ గట్టిగా వెంటనే రియాక్టయ్యి తన కాలితో అసిస్టెంట్ కో షాట్ ఇచ్చింది. వాడు కింద పడటంతో గన్ ఎగిరి ముందుకి పడింది. జానీ అరుస్తూ నందూ మీదికి రాబోతుంటే, రిషీ కిందున్న ఆ గన్ అందుకొని జానీ ముందు నేల మీద కాల్చాడు. జానీ భయంతో కారు అటు పక్కకి వెళ్ళి దాక్కున్నాడు. రిషీ పరిగెత్తుకుంటూ వచ్చి నందూ చేతికి కట్లు విప్పుతున్నాడు. జానీ సైగా చేస్తే, కిందపడున్న అసిస్టెంట్ వాడి రిస్ట్ బ్యాండ్ లో ఏదో కోడ్ నొక్కాడు. ఇద్దరూ రిషీ వెనకనుంచి అటాక్ చెయ్యబోయారు. అప్పుడే నందూ నోటికడ్డంగా వేసిన ప్లాస్టర్ కూడా తీసెయ్యడంతో "రిషీ" అని అరిచింది తనని అలెర్ట్ చేస్తూ. రిషీ గిరుక్కున వెనక్కి తిరిగి గన్ నొక్కితే అది పని చెయ్యలేదు. మళ్ళీ రెండు, మూడూ సార్లు ట్రై చేసినా అదే రిసల్ట్! జానీ పెద్దగా నవ్వాడు "అదెప్పుడో డిసేబుల్ అయ్యింది కానీ మర్యాదగా మాతో రా. లేకపోతే ఇద్దర్నీ ఇక్కడే చంపేస్తాం!" అన్నాడు.

రిషీని పక్కకి జరిపి నందూ స్టాన్స్ తీసుకుంది. తనొక ఫిట్ నెస్ ఫ్రీక్, మార్షల్ ఆర్ట్స్ స్పెషలిస్ట్. ఇలాంటి అవకాశం కోసమే చాలా రోజులుగా ఎదురు చూస్తోంది కూడా. జానీ అసిస్టెంట్ పరిగెత్తుతూ వచ్చి రిషీని కొట్టబోతే, అతని చెయ్యి పట్టుకుని మెలిపెట్టి, తన కాలితో 'బ్రెజిలియన్ లాక్' చేసింది. వాడు విలవిలలాడుతుంటే, జానీ పక్కనుండి దూసుకొచ్చి రిషీ మీద పడ్డాడు. రిషీ చేతిలో ఉన్న గన్ తో వాడి తల మీదా, భుజం మీదా కొట్టాడు. జానీ కూడా తగ్గకుండా చొక్కా పట్టుకుని తన తలతో అతని తలని ఢీ కొట్టాడు. మైకం కమ్మినట్టయ్యి వెనక్కి జరిగిపోయాడు రిషీ. వెంటనే అసిస్టెంట్ ని

వదిలేసి నందూ జానీ మీద కొచ్చింది రిషీని సేవ్ చెయ్యడానికి. జానీని రకరకాలుగా కొడుతోంది. అసిస్టెంట్ పరిగెత్తి కారు స్టార్ట్ చేసి పెద్దగా అరిచాడు "లెట్స్ గో, గో, గో!".

జానీ ఒక్క ఉదుటున పరిగెత్తి తెరిచున్న కారు సీట్లో కెళ్ళి పడ్డాడు. ఒక క్షణంలో ఊపందుకుందా కారు. జానీ విండో లోంచి బైటకి చూస్తూ "దీనివల్ల బతికి పొయ్యావ్, మార్స్ మీద అడుగుపెట్టావంటే, మళ్ళీ తిరిగి రావు. ఆలోచించుకో! గో బ్యాక్ టు హోమ్. యూ బ్లడీ..." అని అరుస్తూ ముందుకెళ్లి పోయాడు.

పది నిమిషాలలో హఠాత్తుగా జరిగిపోయిన ఆ సంఘటనతో కొంత సేపు ఇద్దరూ మౌనంగా ఉన్నారు. కొద్దిసేపటికి నందూ నవ్వుతూ రిషీ దగ్గరికొచ్చింది.

"ఈ ఆరెంజ్ జాకెట్ సేవ్ చేసింది నిన్నివాళ."

"యా, లేకపోతే నీలాంటి ఫైటర్ జోలికొస్తారా...ఇడియట్స్!" అన్నాడు తనూ నవ్వుతూ.

"రిషీ, మళ్ళీ వెనక్కెందుకొచ్చావ్?" అంది తను మాట మారుస్తూ. మొహం కొంచెం ఆశగా మారింది.

"ఏం లేదు, రేపు ట్రావెల్ కదా...నీతో..."

"ఆ...నాతో...?"

"బ్రేక్ ఫాస్ట్ ఏం తినాలో అడుగుదామనీ..." ఆపుకున్నా నవ్వు దాచలేక పోయాడు.

నందూ అరుస్తూ అతని వెంటపడింది "ప్లీజ్, సీరియస్ గా చెప్పరా!"

"నువ్వు ఫిసికల్ గా, మెంటల్ గా చాలా స్ట్రాంగ్ నందూ, నేనో ఏదో ఊహించుకోని నీకేదో చెప్పాలని వచ్చాను. అవేం అవసరం లేదని అర్థమైంది." అన్నాడు తన చేతిలో చెయ్యి వేస్తూ.

"రిషీ, ఐ విల్ మూవ్ ఆన్ ఇన్ లైఫ్, బట్ నువ్వెప్పుడూ స్పెషలే నాకు." అంది తను.

అతను మెల్లగా వెనక్కి వెళ్ళి క్యాబ్ ఎక్కబోతున్నప్పుడు అంది పెద్దగా

"రిషీ, బీ కేర్ ఫుల్, నువ్వు మార్స్ కి వెళ్లడం ఎవరికో ఇష్టం లేదు."

కొన్ని క్షణాలలా నిలబడ్డాడు రిషీ వెనక్కి తిరిగి నందూ వైపు చూస్తూ.

"రేపు అనుకున్న టైంకి లాంచింగ్ స్టేషన్ కొచ్చేస్తాం, నో ఛేంజ్ ఇన్ ప్లాన్." అన్నాడు కారులో కుర్చుంటూ.

## 12

తర్వాత మార్నింగ్ రిషీ నిద్ర లేచి చూసేటప్పటికి వాళ్ళ బ్యాచ్ అంతా సీరియస్ గా చూస్తోంది అతని వైపే. ముఖ్యంగా అమ్మా, మల్లి.

"ప్రిన్స్ ఆఫ్ మార్స్ నిద్రలేచాడొదినా!" అన్నాడు మల్లి.

"చూస్తున్నా, యువరాజు గారికేం కావాలో కనుక్కోండి." అంది సునంద.

"అయ్యో వారు నిన్నే సూచించితిరి కదా, ఇద్దరు ముగ్గురు యువరాణులు కావాలని!"

"అయితే గ్రహానికో యువరాణి కావాలన్న మాట, వారెప్పుడు ఏ గ్రహంపై దండయాత్ర చేస్తారో తెలియదు కదా మన మట్టి బుర్రలకి."

"అబ్బా ఆపండి మీ ఇద్దరూ...పొద్దున్నే టార్గెట్ చేసి మరీ కుమ్మేస్తున్నారు."

"మహారాణీ, యువరాజు గారికి కోపం వచ్చినట్టుంది. వారు నాకు ఉరిశిక్ష విధించకుండా మీరే రక్షించాలి. మీ సేవకుడిని." అన్నాడు మల్లి చేతులు కట్టుకుంటూ.

"ఏహె, రాజూ లేదూ రాణీ లేదు. అవును, నందూ కొంచెం క్లోజ్ గా మూవయ్యింది. తనకి క్లియర్ గా చెప్పాను నాకలాంటి ఫీలింగ్స్ లేవని. వుయ్ ఆర్ జస్ట్ ఫ్రెండ్స్...అంతే." అన్నాడు.

"వాడు పాపం చెప్తున్నాడు కదే, ఏం లేదని. ఇంక వదిలెయ్యండి వాణ్ణి." అన్నాడు జగదీశ్ వెనక నుండి.

"మీ ఆజ్ఞ జహాపనా!" అని వంగి సలాం చేసుకుంటూ వెనక్కి వెళ్ళాడు మల్లి.

నీలూ తుళ్ళిపడి నవ్వి రిషీ చెవి దగ్గర వంగి "మరి మొహం మీద ఆ దెబ్బేంట్రా?" అంది చిన్నగా.

"ష్..." అన్నాడతను నోటి మీద వేలు పెడుతూ.

తర్వాత అందరూ హడావిడిగా రెడీ అయ్యి, లగేజ్ తో మధ్యాహ్నానికల్లా 'లాంచ్ స్టేషన్' కి చేరారు. వాతావరణం అంతా నార్మల్ గా ఉండటంతో సాయంత్రం ఆరింటికి టేకాఫ్ కన్ఫర్మ్ చేసారు. అందరూ స్పేస్ సూట్స్, హెల్మెట్స్ తో రెడీ అయ్యారు. ఇంకో సారి చిన్న చిన్న టెస్ట్ లు చేసాక వాళ్ళ గ్రూప్ ని ఒక రూంలోకి తీసుకెళ్ళారు.

అక్కడే పొట్టిగా ఉన్న ఆఫీసర్ ఒకతను అందర్నీ కూర్చోమని సైగ చేశాడు.

"గుడ్ ఆఫ్టర్ నూన్ ఎవ్రీవన్, నా పేరు లీ, మీ స్పేస్ క్రాఫ్ట్ పైలట్ ని." అని పరిచయం చేసుకున్నాడు.

మల్లి రిషీ వైపు వంగి "ఇతనేంట్రా ఇంత పొట్టిగా ఉన్నాడు. ముందు కనపడుతుందా మరి నడిపేటప్పుడు?" అడిగాడు.

రిషీ మొహం వికారంగా పెట్టి “ఇదేమన్నా, బస్సా బాబాయ్ , స్పేస్ క్రాఫ్ట్! అన్నీ ముందున్న స్క్రీన్స్ లో కనిపిస్తాయి, ఎక్కడికీ వంగి చూడక్కర్లా.” అన్నాడు.

“ఏమోరా, ఎదురుగా వాటినేదో అంటారు కదా ఆండ్రాయిడ్స్ ఏవో వొస్తే, చూసి పక్కకి తిప్పాలి కదా అని డౌటొచ్చి అడిగా.” అన్నాడు.

“ఆస్టరాయిడ్...ఆండ్రాయిడ్ కాదు.” అన్నాడు తల అడ్డంగా ఊపుతూ.

ఎదురుగా లీ చెప్పుకుంటూ పోతున్నాడు “టేకాఫ్ కి ఇంకా రెండు గంటలుంది. మా వాళ్ళు స్పేస్ క్రాఫ్ట్ ఫైనల్ చెక్ చేస్తున్నారు. ఆల్ షుడ్ బీ ఫైన్. ముందు మీకు కొన్ని ఇన్ స్ట్రక్షన్స్ ఉన్నాయి, జాగ్రత్తగా వినండి, ఏమైనా డౌట్స్ ఉంటే అడగండి. నాలుగు రోజులు కలిసి ట్రావెల్ చెయ్యబోతున్నాం కదా, పర్లేదు ఓపెన్ గా ఉండండి, ఇట్స్ ఫైన్”

“టైంకి ఫుడ్ అదీ ఉంటుందా లోపల...ట్రైనింగ్ లో అడగటం మర్చిపొయ్యాను.” అన్నాడు జగదీశ్.

“గుడ్ క్వశ్చన్, ఫుడ్ టైంకి మీ సీట్ల ముందున్న బాక్స్ ఓపెన్ అవుతుంది. దాంట్లో ప్యాక్ చేసిన ఫుడ్ ఉంటుంది. మీరే తీస్కొని తినచ్చు. మీకు స్పెసిఫిక్ గా కొన్ని ఇండియన్ వెరైటీస్ కూడా ఉంటాయి.” అన్నాడు.

శాటిస్పై అయిపొయ్యాడు జగదీశ్.

“ఫస్ట్ వన్, మనం పైకి వెళ్ళడాన్ని ‘లిఫ్ట్ ఆఫ్’ అంటాం ఎరోప్లేన్ ‘టేక్ ఆఫ్’ లాగా. ఆ టైంలో మనం భూమి గ్రావిటీ నుండి బైటకి వెళ్తాం. తర్వాత దాదాపు మూడు రోజులు మార్స్ వైపు ప్రయాణం. చివరి ఆరు గంటల్లో మార్స్ ఆర్బిట్ లోకి ప్రవేశిస్తాం, చివరిగా ‘ల్యాండింగ్’ ఉంటుంది.” అన్నాడు.

“డైరెక్ట్ గా మార్స్ కేగా, మధ్యలో స్టాప్ లేం లేవుగా?” అన్నాడు మల్లి.

షాక్ తిన్నాడు లీ.

“లీ, మా వాళ్లని పట్టించుకోకండి. నాన్నా, ఇలాంటి ప్రశ్న లేస్తే, నిన్ను మధ్యలో మూన్ మీద దించేసి వెళ్ళి పోతాం. నువ్వు చక్కగా బ్రేక్ జర్నీ చేసి, నెక్స్ట్ రాకెట్ పట్టుకోని రా!” బెదిరించింది నీలూ.

“ఎనీవేస్, ఇంకో విషయం. భూమ్మీద లాగా మనకి జర్నీలో సూర్యోదయం, సూర్యాస్తమయం సరిగ్గా ఉండవు. దాదాపు సూర్యుడు కనపడుతూనే ఉంటాడు ఎప్పుడూ. మీరు స్పేస్ క్రాఫ్ట్ లో సిగ్నల్ ప్రకారం నిద్ర పోవడానికి ప్రయత్నించాలి.” అన్నాడు.

“నాకు అవర్లీ సీరియల్ చూడక పోతే నిద్ర పట్టి చావదు. మాకు ఇంటర్నెట్ యాక్సెస్ ఉంటుంది కదా?” అడిగింది సునంద భయపడుతూ.

“అవర్లీ సీరియలా, అదేంటి!”

"అదేనండీ, మా చిన్నప్పుడు డైలీ సీరియల్స్ వచ్చేవి ఇండియాలో, తర్వాత అంత డిలే భరించలేమని గొడవపెడితే, ఇప్పుడు ప్రతి గంటకీ ఒక టెన్ మినిట్స్ సీరియల్ ఇస్తున్నారు. అదో రెండు గంటలు మిస్సైతే నాకు పిచ్చెక్కుతుంది." అంది బాధగా.

"నేను కూడా ఫేవరెట్ లైవ్ చూడకపోతే..."

"నాకు 'నీఫేసు' యాప్ లేకపోతే..."

అందరూ మీద పడిపోతుంటే లీ రెండు చేతులూ పైకెత్తి శాంతపరుస్తూ "ప్లీజ్, మీ డిమాండ్స్ అన్నీ మా టెక్నికల్ టీంకి చెప్పండి. వాళ్ళు సెట్ చేస్తారు. కాకపోతే భూమ్మీదున్నట్టు '100K మెగా క్వాంటమ్' వీడియో క్వాలిటీని మాత్రం ఎక్స్పెక్ట్ చెయ్యద్దు." అన్నాడు తల విదిలిస్తూ.

"పర్లేదు నాలుగు రోజులేగా, క్వాలిటీలో అడ్జస్ట్ అవ్వగలం, కదే!" అంది మల్లి భార్య వైపు చూస్తూ సునంద.

"ఇకపోతే..." అనబోయాడు లీ.

"ఇంకేముంటాయ్, మనిషికి ముఖ్యమైన మూడూ – ఫుడ్డూ, బెడ్డూ, నెట్టూ కవర్ చేసేసాం కదా?" అన్నాడు మల్లి అడ్డు కట్టేస్తూ.

లీ నిట్టూర్చాడు ఒక్క క్షణం అందరి వైపూ చూస్తూ "హుమ్...జాగ్రత్తగా వినండి...ఈ నాలుగు రోజులూ నేనేం చెప్తే అది వినాలి అందరూ...నాక్కొంచెం తిక్క అసలే." అన్నాడు సూటిగా మల్లినే చూస్తూ.

"చాన్సే ఇల్లె! మా ఆయన కన్నా తిక్కోడింతవరకూ పుట్టలేదీ ఎర్త్ మీద." అంది మల్లి భార్య సడెన్ గా. మెలికలు తిరిగిపోతూ సిగ్గుపడ్డాడు మల్లి.

లీ మొహం ఎర్రగా మారింది. ఒక్క క్షణం ఆలస్యం చెయ్యకుండా "సీ యూ ఆల్ ఇన్ వన్ అవర్." అని తలమీద కొట్టుకుంటూ వెళ్ళిపొయ్యాడా రూం లోంచి.

ఆ ప్రిపరేషన్ బిల్డింగ్ నుండి బైటికొచ్చారందరూ స్పేస్ సూట్లు వేసుకోని. దూరంగా వాళ్ళు వెళ్ళాల్సిన రాకెట్ నిటారుగా నిలబడి లాంచ్ కి రెడీగా ఉంది. వాళ్ళ ముందుకొక ఫ్లయింగ్ వెహికిల్ వచ్చి నిలబడింది. అందరూ ఎక్కాక, అది సరాసరి ఆ రాకెట్ కొన భాగంలో ఉన్న క్యాప్సూల్ ముందు డ్రాప్ చేసింది రెండు నిమిషాలలో. ఆ టవర్ మీద నుండి కిందికి చూసి గుండె జారిపోయింది మల్లికి "నాకసలే హైట్సంటే పిచ్చి భయం అన్నాయ్, ఏంటో ఇంత పైకి తెచ్చి పడేసింది." అన్నాడు టెన్షన్ గా గుండె మీద చెయ్యి పెడుతూ.

"అందుకేనా బాబాయ్, జీవితంలో ఎత్తుకెదగమన్నా చిరాకు పడుతుంటావ్?!" అన్నాడు రిషీ.

“రేయ్, ఇక్కడ జోకులేసావనుకో, నేనన్నా దూకేస్తా, నిన్నన్నా తోసేస్తా! మళ్ళీ ‘మార్స్ కెళ్ళబోతూ మల్లి చేసిన దారుణం’ అని మీడియాలో వస్తే నా రెస్పాన్సిబిలిటీ కాదు.” అన్నాడు వణుకుతూ.

పక్కనున్న అసిస్టెంట్ ఒకతను "ఎవరన్నా బాత్‌రూం వాడాలంటే ప్లీజ్, ఇదే భూమ్మీది లాస్ట్ బాత్‌రూం." అన్నాడు నవ్వుతూ ఓ డోర్ వైపు చూపిస్తూ.

"ఈ సూట్లతో ఇప్పుడా జిమ్నాస్టిక్స్ ఎందుకులే, పైకెళ్ళాక ప్రశాంతంగా చూస్కుంటా అవన్నీ." అన్నాడు మల్లి.

"మీ ఇష్టం, నేను చెప్పాల్సింది చెప్పాను." అన్నాడతను భుజాలెగరేస్తూ.

అందరూ అక్కడి టెక్నీషియన్స్ సాయంతో మెల్లగా క్యాప్సూల్ లోపలికెళ్ళి కుర్చున్నారు. లోపల రెండు వరసలలో నాలుగు సీట్లున్నాయి. మధ్యలో నడిచేందుకు చిన్న స్పేస్. క్యాప్సూల్ ముందు భాగంలో పైలట్లకి రెండు సీట్లున్నాయి.

ముందు అనుకున్నట్లు గానే ఓ వైపు మల్లి, స్వలాభానంద విండో సీట్లల్లో కుర్చున్నారు. ఇంకో పక్క విండో పక్కన నీలూ, రిషీ కుర్చున్నారు. మిగతా వాళ్ళంతా మధ్య సీట్లల్లో సెటిలయ్యారు. చివరికి పైలట్ లీ వచ్చి ముందు కాక్ పిట్ లో కూర్చొని అన్నీ చెక్ చేసుకున్నాడు. మెల్లగా తలుపులు మూసుకున్నాయి. ఎదురుగా ఉన్న పెద్ద స్క్రీన్ పైన కౌంట్ డౌన్ మొదలైంది.

టీ–3 మినిట్స్: రాకెట్ ఇంజిన్ మొదలైంది. రాకెట్ కింద అంతా తెల్లటి పొగ కమ్ముకుంది.

టీ–2 మినిట్స్: రాకెట్ పైభాగంలో ఉన్న ఆక్సిజన్ సరఫరా పైపు పక్కకి జరిగింది. లోపలున్న వాళ్లకి హెల్మెట్లు పెట్టుకొమ్మని స్పీకర్ లో కమాండ్స్ వచ్చాయి. అందరూ హెల్మెట్లు పెట్టుకుని వాటిని టైట్ గా లాక్ చేసుకున్నారు. ఆ క్యాప్సూల్లో ఆక్సిజన్ ప్రవహించడం మొదలయ్యింది.

టీ–50 సెకన్లు: బైట నుండి పవర్ రావడం ఆగిపోయింది. కేవలం లోపలి ఇంజిన్ సాయంతో నడుస్తోందా రాకెట్ ఇప్పుడు.

టీ–30 సెకన్లు: గ్రౌండ్ కంట్రోల్ టీం ఆటోమేటిక్ లాంచ్ ని మొదలుపెట్టింది.

టీ–10 సెకన్లు: కౌంట్ డౌన్ మొదలైంది. లోపలున్న వాళ్ళు గట్టిగా సీట్లని పట్టుకున్నారు.

టీ–0 సెకన్లు: మీథేన్ ఫ్యూయెల్ తో నిండిన బూస్టర్ ట్యాంక్ మండటంతో కింద భాగంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చుట్టూ ముప్పై అడుగుల ఎత్తుకి పొగా, దుమ్మూ విరజిమ్మాయి. ఆ రాకెట్ లౌడ్ గా శబ్దం చేస్తూ పైకి దూసుకుపోతోంది. దాని వేగానికి లోపలున్న వాళ్ళు గట్టిగా సీట్లకి అతుక్కుపోయారు.

ఆకాశంలోని మేఘాల్లోకి మెల్లగా ఫేడ్ అయిపోతున్న ఆ రాకెట్ ని దూరంగా లాంచింగ్ స్టేషన్ నుంచి చూస్తున్న నందూ కళ్ళల్లో టెన్షన్ స్పష్టంగా కనిపిస్తోంది.

## 13

రాకెట్ పైకి లిఫ్ట్ ఆఫ్ అయిన కొన్ని నిమిషాల వరకూ రిషీ వాళ్ళందరూ సైలెంట్ గా ఉన్నారు. భూమి వాతావరణం దాటి బైటికొచ్చేటప్పుడు మాత్రం వాళ్లందరికీ విచిత్రమైన అనుభూతి కలిగింది. ఒక ఐదు నిమిషాలు అంతా షేక్ అవుతున్నట్టు అటూ, ఇటూ కదిలిపోయి ఉన్నట్టుండి ఒళ్ళంతా తేలికైనట్టు అనిపిస్తోంది. ఫస్ట్ స్టేజ్, సెకండ్ స్టేజ్ బూస్టర్లు వాటి పని అవి చేసి స్పేస్ క్రాఫ్ట్ నుండి విడిపోయాయి. ఎదురుగా ఉన్న స్క్రీన్ లో వాళ్ళ ఫ్లైట్ స్టేటస్ తెలుస్తోంది. ఆ స్పేస్ క్రాఫ్ట్ వేగం మెల్లగా పెరుగుతున్నట్టు చూపిస్తోంది.

టైం టు రీచ్ మార్స్ – 95 గంటలు.

కొంతసేపటికి లీ నుంచి సిగ్నలొచ్చింది రిలాక్సవ్వచ్చని. అందరూ ఒకర్నొకరు చూసుకొని ప్రశాంతంగా ఊపిరి పీల్చుకున్నారు. మెల్లగా వాళ్ళ హెల్మెట్లు తీసి పక్కన పెట్టారు.

స్పేస్ క్రాఫ్ట్ ఎక్కినప్పటి నుండి ముందు సీటుకి ఎటాచ్ చేసున్న బాక్స్ వైపే ఆతృతగా చూస్తున్నాడు జగదీశ్. 'ఫుడ్' అని రాసుంది దానిమీద. సిగ్నల్ వచ్చిన వెంటనే ఆగలేక దాన్ని ఓపెన్ చేద్దామని ట్రై చెయ్యబోయాడు.

"రాంగ్ టైం, ఓపెన్ ఆఫ్టర్ టూ అవర్స్" అని అరిచిందా బాక్స్ తన స్పీకర్ లోంచి. గబుక్కున చెయ్యి వెనక్కి తీసుకున్నాడు తిట్టుకుంటూ. పక్కనున్న సునంద అనుమానంగా చూస్తే

"జస్ట్, ఏం పెడతాడో చూద్దామని..." అన్నాడు నీరసంగా నవ్వుతూ.

"ఏంటన్నాయ్, నీ టైం బ్యాడ్ అంటుందా అది?" అన్నాడు మల్లి పక్కనుండి.

"నిన్ను తీస్కొచ్చినప్పటినుండే మా బ్యాడ్ టైం స్టార్టయ్యింది, ఇప్పుడు కొత్తగా అయ్యేదేముంది?" అన్నాడు చిరాగ్గా.

"భలేవాడివే, నాది లక్కీ హ్యాండంటారన్నాయ్ మా బెట్టింగ్ క్లబ్బులో."

"అబ్బా, మీ ఆర్గ్యుమెంట్స్ ఆపి బైటికి చూడండి అందరూ. ఎర్త్ ఎంత అందంగా కనిపిస్తోందో పైనుండి." అన్నాడు రిషీ వంగి బైటికి చూస్తూ.

“రోజూ చూసిందే కదరా చిన్నప్పట్నించీ? చెట్లూ, కొండలూ, నీళ్ళూ...ఎక్కడ చూసినా ఇవేగా, కొత్తగా ఏముంటది?” పెదవి విరిచాడు మల్లి.

“నాన్నా ఓ సారి చూడు, బ్లూగా ఎంత ముద్దుగా ఉందో మన ప్లానెట్!” అరిచింది నీలూ.

“అంతేలే, ఏదీ మనకి దగ్గర నుండి అందంగా కనపడి చావదు, దూరపు గ్రహాలు నునుపు అంటారందుకే.”

“నువ్వు చూడకపోతే పొయ్యావ్ కానీ, సామెతలని ఖూనీ చెయ్యకు!”

అందరూ చాలా సేపు మైమరిచిపోయి అలానే చూస్తూ ఉండిపొయ్యారు బైటికి. నల్లటి వాక్యూమ్ లో బ్లూ బంతినొకదాన్ని వేలాడేసినట్టుంది భూమి. చాలా తక్కువ మంది చూసుంటారలా భూమిని. అంత దూరం నుండి చూస్తున్నప్పుడు, *“భూమ్మీదున్న మనుషులు, వాళ్లలో వ్యత్యాసాలూ ఎంత చిన్నవో!”* అన్న ఫీలింగైతే అందరిలో కలుగుతోంది.

కొంతసేపయ్యాక మల్లికి ఎందుకో ఇబ్బందిగా అనిపించింది. చూస్తే సీట్ బెల్టులు గట్టిగా కట్టేసుండటం వల్ల అని అర్థమై, హడావిడిగా వాటిని ఓపెన్ చెయ్యడం మొదలుపెట్టాడు. పక్కనే ఉన్న వాళ్ళావిడ ఏదో చెప్పబోయేంతలోనే ఉన్న నడుం కీ, భుజాలకీ ఉన్న రెండు బెల్టులు విప్పేసి ఆమెకో హ్యాపీ లుక్కిచ్చాడు. అంతే ఒక్క క్షణంలో గాల్లోకి లేచిపోయాడు, వాళ్ళావిడ గట్టిగా పట్టుకునేంతలోపే ఆ స్పేస్ క్రాఫ్ట్ సీలింగ్ వైపు తేలుకుంటూ వెళ్ళి పోయాడు. అనుకోకుండా అలా జరగడం వల్ల షాకయ్యి పెద్దగా అరవడం మొదలుపెట్టాడు. అందరూ అతని వైపు ఆశ్చర్యంగా చూస్తున్నారు. నీలూ, రిషీ పెద్దగా నవ్వుతున్నారు. జగదీశ్ తిడుతున్నాడు. కానీ ఎవరికీ కిందకెలా దించాలో అర్థం కాలేదు.

కాసేపటికి మల్లి తేరుకుని “నాకేమన్నా భయమనుకున్నారా? ఇవన్నీ గోటితో సమానం!” అటూ, ఇటూ గోడలని కాళ్లతో , చేతులతో తంతూ ఎంజాయ్ చెయ్యటం మొదలుపెట్టాడు.

అది చూసి వాళ్ళావిడ “ఏవండీ, కిందికి దిగండి, ఇప్పటికే బావగారు మీరు గాలికి తిరుగుతున్నారని తిడుతుంటారు. మీరది డైరెక్ట్ గా ప్రూవ్ చేస్తున్నారు!” అంది.

“ఆయనకి దిగాలనే ఉందమ్మా, ఎలా దిగాలో తెలీక కాలక్షేపం చేస్తున్నాడు.” అన్నాడు మొదటిసారి మాట్లాడుతూ స్వలా. అతనికంతా ఏదో కలలా ఉంది ఇంకా.

రిషీ, నీలూ ఉండబట్టలేక వాళ్ళ, వాళ్ళ బెల్టులూ తీసేసి గాల్లో తిరగడం మొదలుపెట్టారు. అందరికీ సరదాగా ఉందిప్పుడు. నీలూకో చిలిపి ఆలోచనొచ్చి కిందున్న వాళ్ళమ్మతో, “అమ్మా నా రిస్ట్ బ్యాండ్ ఇస్తున్నా క్యాచ్ పట్టుకో!” అని ఆమె వైపు విసిరేసింది. ఆమె హడావిడి పడి పట్టుకోటానికి చెయ్యి చాపితే, ఆ రిస్ట్ బ్యాండ్ కొంతదూరం వచ్చి గాల్లో తేలడం మొదలుపెట్టింది.

వాళ్లమ్మ "ఆ మెళ్ళో ఉన్న చైన్ అదీ జాగ్రత్త, అది కూడా ఎక్కడో పారేస్కునేవ్ ఇలాంటి కోతి చేష్టలే చేసి." అంది కోపంగా. ఆ మాట నీలూ పెద్దగా పట్టిచ్చుకోకపోయినా, మల్లికేదో గుర్తొచ్చి, హఠాత్తుగా ఎగరడం ఆపేసి, గోడల మీదున్న ల్యాడర్ పట్టుకోని కిందికి దిగాడు. గట్టిగా సీట్లు పట్టుకొని తన హ్యాండ్ బ్యాగూ, వాళ్ళావిడ బ్యాగూ దేనికోసమో తెగ వెతికాడు. అనుకున్నది దొరక్క పోవడంతో, సైలెంట్ గా తన సీట్లో కూర్చుండిపోయాడు. కొంతసేపటికి అది గమనించిన రిషీ కిందకొచ్చాడు. దూరంగా చిన్న మార్బుల్ లా కనిపిస్తున్న భూమి వైపే దిగులుగా చూస్తున్న మల్లి భుజంమీద చెయ్యేసి అడిగాడు "ఏమైంది బాబాయ్, ఎనీథింగ్ మిస్సింగ్?" అన్నాడు వెనక నుండి.

"రేయ్, షుమారు ఎర్త్ నుండి ఎంత దూరం వచ్చుంటాం?" అడిగాడు మల్లి బాధగా.

"టూ అవర్స్ అయ్యింది కదా, చాలా మిలియన్ మైళ్లు వచ్చుంటాం. దేనికైనా ఇప్పుడు?"

"ప్చ్...దాన్ని మర్చిపొయ్యాను, ఇప్పుడే చూస్కున్నాను. ఎక్కడా లేదురా!"

"ఏం మర్చిపొయ్యావ్, ఏంటది?"

అప్పటికే పిన్ని తల పట్టుకొని కిందికి చూస్తోంది అవమానంగా.

"అసలెలా మర్చిపొయ్యానో అర్ధం కావట్లేదు. దాన్ని చూసుకోకుండా నిద్ర పట్టదే నాకు..."

"ఏహె, ఎంటది?"

"నాన్నా...చెప్పావో..." నీలూ బెదిరింపు.

"ఏంటి, నీకు అంత పర్సనల్?"

"వాడి బొంద, వాడికేం పర్సనల్ ఉంటాయి, అంతా పబ్లిక్కే. ఏంటో చెప్పరా బాబూ!" అరిచాడు జగదీశ్.

"అదీ... అదీ...టూ మంత్స్ క్రితం జరిగిన 'బిగ్ బాస్ 60' సీజన్లో నాకో మెడలొచ్చిందిరా..." అన్నాడు మొహమాట పడుతూ.

"ఏవండీ...!"

"నాన్నా...!"

"వావ్, నాకు చెప్పలేదెవ్వరూ! వుయ్ షుడ్ సెలబ్రేట్ దిస్. దేనికొచ్చిందింతకీ మెడల్?" అడిగాడు రిషీ ఉత్సాహంగా.

"అలా అడుగు, అసలక్కడేం ఉద్ధరించాడట!" అన్నాడు జగదీశ్.

"ఏం చెయ్యనందుకే ఇచ్చార్రా, 'బెస్ట్ బేవార్స్ హౌస్ మేట్.' అని కొత్తగా పెట్టారంట."

రిషీ నవ్వాపుకోలేకపొయ్యాడు "దాంట్లో ఏముంది బాబాయ్ గొప్ప, యు ఆర్ టూ మచ్!"

"రేయ్, ఎంత కష్టం అనుకున్నావ్ ఖాళీగా ఉండటం! పొద్దుట్నించీ, రాత్రి దాకా ఆ షోలో జరిగే గొడవల్ని పట్టించుకోకుండా, గాసిప్స్ కి టెంప్ట్ అవ్వకుండా, ఆ బిగ్ బాస్ గాడు చెప్పే పనులేమీ చెయ్యకుండా...అబ్బో చాలా టఫ్!" అన్నాడు తల విదిలిస్తూ.

"అదో పెద్ద అవార్డు, దానికి మళ్ళీ నువ్వు తెగ ఫీలవ్వడం! సిగ్గుండాలి." అన్నాడు జగదీశ్.

"ప్లీజ్ అన్నాయ్, జీవితంలో నాకొచ్చిన ఒకే ఒక్క అవార్డది. హోటల్లో ఎక్కడో మర్చిపోయుంటాను."

"ఇప్పుడేం చేద్దాం ఐతే?"

"మన పైలట్ లీ స్పేస్ క్రాఫ్ట్ ని కొంచెం వెనక్కి తీస్కెళ్తే ఫాస్ట్ గా దిగి తెచ్చేస్కుంటాను. అడిగితే ఫీలౌతాడంటావా?" అన్నాడు సందేహంగా మల్లి.

ఇంతలో హఠాత్తుగా ముందు కాక్ పిట్ నుండి గాల్లో తేలుకుంటూ వచ్చాడు లీ. వీళ్ళ బ్యాచ్ ని పట్టించుకోకుండా మెల్లగా స్పేస్ క్రాఫ్ట్ వెనకవైపుకెళ్ళాడు. రెండు నిమిషాల తర్వాత ఓ పెద్ద సుత్తితో తిరిగి ప్రత్యక్షమయ్యాడు. అందరూ ఆశ్చర్యంతో పైకి చూస్తుంటే అతను మాత్రం మల్లి వైపు చూపిస్తూ "సర్, ఇందాకట్నించీ ఇతని టార్చర్ తట్టుకోలేకపోతున్నాను. ఇతను ఇంకొక్క మాట మాట్లాడితే, సుత్తితో ఈ విండో పగలకొట్టి బైటికి దూకేస్తా!" అన్నాడు ఆవేశంగా.

ఊహించని లీ ఆవేశానికి అందరూ షాక్ లో ఉండిపోయారో నిమిషం.

ఆ సైలెన్స్ ని బ్రేక్ చేస్తూ "ఈ మాత్రం దానికి పగలకొట్టి మరీ దూకడం ఎందుకు, మామూలుగా డోర్ ఓపెన్ చేస్కోనే దూకచ్చుగా." నసిగాడు మల్లి.

ఆ సుత్తిని గాల్లోనే వదిలేసి చైనీస్ లో పచ్చి బూతులు తిట్టుకుంటూ ముందుకెళ్ళిపోయాడు లీ.

🦋🦋🦋

**కొంతసేపటికి** "ఇప్పుడు మీకు రాత్రయ్యింది, అందరూ డిన్నర్ చెయ్యచ్చు. ఇవాళ్టి స్పెషాలిటీస్, ఇడ్లీ, సాంబార్, బిసిబెళా బాత్ విత్ పికిల్! ఎంజాయ్." అని వచ్చింది స్పీకర్ లో.

అప్పటికే ఆకలితో నకనకలాడుతున్న జగదీశ్ తన ఎదురుగా ఉన్న బాక్స్ ని దాదాపు విరగ్గొట్టేంత పని చేసి ఓపెన్ చేశాడు. దాంట్లో మెరుస్తున్న ప్యాకెట్ ని చూసి పక్కనే ఉన్న రిషీతో

"ఏంట్రా, ఇంత పెద్ద స్పేస్ క్రాఫ్ట్, పైగా కోట్లు తీసుకున్నారు, కనీసం స్పూనూ, ఫోర్కులు కూడా ఇవ్వలేదు. చేత్తో ఎలా తినడం ఇవన్నీ?" అంటూ ఆ ప్యాకెట్ ని ఓపెన్ చేసి చూసి ఒక్క నిమిషం షాకయ్యి చూస్తూ ఉండిపోయాడు.

ఏం జరిగిందో అర్థమయ్యాక వెంటనే తేరుకుని “దారుణం! కంప్లీట్ చీటింగ్ ఇది, ఏది గ్రౌండ్ కంట్రోలెక్కడ, నేను స్పేస్ ఎక్స్ చీఫ్ తో మాట్లాడాలిప్పుడే, ఐ విల్ షో వాట్ ఐ యామ్!” అంటూ చిన్న సైజు గాడ్జిల్లాలా అరవడం మొదలుపెట్టాడు.

అందరూ అయోమయంగా వాళ్ళ సీట్ల ముందున్న బాక్సులు తీసి చూట్టం మొదలుపెట్టారు. సునంద ఆ సీల్ చేసిన ట్రాన్సపరెంట్ ప్యాకెట్ని చూస్తూ “ఏంటండీ, ఇడ్లీ సాంబారన్నారు, ఓన్లీ చట్నీ ఒక్కటే ఉంది దీంట్లో!” అంది.

మల్లికి బల్బు వెలిగి “వదినా, అది చట్నీ కాదు. మొత్తం ఇడ్లీ సాంబార్, చట్నీ అన్నీ గ్రైండర్లో ఏసి చితగ్గొట్టి చేసిన పేస్టు!” అన్నాడు పెద్దగా నవ్వుతూ.

రిషీ, నీలూ నవ్వుకుంటూ ఆ పేస్టునే తినబోయారు.

“ఆగండి! ఎవ్వరూ పేస్ట్ ని టేస్ట్ చెయ్యడానికి వీల్లేదు, ఇంత డబ్బులకి ఇదా వాళ్లిచ్చే ఫుడ్డు...” అంటూ గ్రౌండ్ కంట్రోల్ కి కాల్చేసి గట్టిగా అరిచాడు జగదీశ్.

అటునుంచి మాత్రం “స్పేస్ క్రాఫ్ట్ లో పార్టికల్స్ పడి గాల్లో తేలుతూ అక్కడా ఇక్కడా ఇరుక్కుంటే, మీరు మార్స్ కాదు, ప్లూటో కెళ్తారు. అందుకే జాగ్రత్త కోసం, థిక్ పేస్ట్ లాగా చేస్తాం ఫుడ్డంతా. మీకిష్టం లేకపోతే తినకండి, మార్స్ కెళ్ళాక హాస్పిటల్లో పిజ్జాలూ, బర్గర్లూ తినచ్చు.” అని బెదిరింపు వచ్చింది.

“నాన్నా, ఏదో ఒకటి, ఆకలేస్తోంది తిననీ...” అని జగదీశ్ ని పట్టించుకోకుండా ప్యాకెట్ కట్ చేసి తినడం మొదలుపెట్టాడు రిషీ.

“టేస్ట్ లో ఏం తేడా లేదులేన్నాయ్...ఈ సారికి వదిన చేసిన ఫుడ్డనుకోని కళ్ళు మూసుకోని కానిచ్చెయ్.” అన్నాడు.

సునంద తల విసురుగా తిప్పి ‘కొడ్తా’ అన్నట్టు వేలితో బెదిరించింది.

అందరూ మొత్తానికి డిన్నర్ అయ్యిందనిపించారు.

కొంతసేపటికి ఆ స్పేస్ క్రాఫ్ట్ విండోలు ఆటోమేటిక్గా మూసుకున్నాయి. లోపల లైట్లు డిమ్ అయ్యాయి. “ఇట్ ఈస్ టైం టు స్లీప్.” అని అనౌన్స్ మెంట్ వచ్చింది మైక్ లో.

“ఛీ, నా బతుకు, మా ఆవిడ కన్నా దారుణంగా తయారైంది ఈ మైక్ అమ్మాయి. తిండికి, నిద్రక్కూడా స్వతంత్రం లేదిక్కడ.” పైకే తిట్టుకున్నాడు మల్లి. మెల్లగా అందరూ నిద్రలోకి జారుకున్నారు.

కలత నిద్రతో అటూ ఇటూ తిరిగిన స్వలా అర్థరాత్రి ఓ సారి కళ్ళు తెరిచి పైకి చూస్తూ గావు కేక పెట్టాడు. “దయ్యం, దయ్యం” అంటూ మల్లిని పట్టుకొని వణికి పోయాడు. మల్లి చిరాగ్గా “మీ కలలూ మీరూ. పడుకోండి గురూ గారూ.” అన్నాడు కళ్ళు తెరవకుండానే.

"అయ్యో కల కాదండీ, మీ ఆవిడ దయ్యమై నా చుట్టూ తిరుగుతోందండీ." అన్నాడు స్వలా ఇంకా వణికి పోతూ. ఆ గొడవ విని అందరూ లేచారు. చూస్తే మల్లి భార్య జుట్టు విరబోసుకోని పడుకున్న స్టేట్ లోనే అలా గాల్లో తేలుతోంది. కింద తన సీటు ఖాళీగా ఉంది. ఉన్నట్టుండి

"నిన్ను పీక్కు తింటారా, అక్కడే ఉండు వస్తున్నా." అని మత్తుగా అంది గాల్లో తను.

అందరి నోట్లో తడారిపోయింది. మల్లి కళ్ళు నులుముకోని భయభయంగా చూస్తూ, "ఏమే, బంగారం..." అని పిలిచాడు. దానికి సమాధానం లేదు.

"నిన్ను కసా కసా పొడిచి..."

"అమ్మో... ఏమైందే!" అంది నీలూ బింకంగా.

రిషీనే ధైర్యం చేసి బెల్టు తీసుకోని గాల్లోకి వెళ్ళి "పిన్నీ, పిన్నీ..." అని పిలిచాడు తన భుజం మీద తడుతూ. తను హఠాత్తుగా కళ్ళు తెరిచి రిషీ గొంతు పట్టుకుంది. కెవ్వుమని అరిచారు సునందా, నీలూ కింద.

రిషీ మళ్ళీ గట్టిగా "పిన్నీ, పిన్నీ, నేను రిషీని. ఏమైంది నీకు?" అని గట్టిగా అరిచాడు.

వెంటనే ఆమె తెలివిలోకొచ్చి పైకీ, కిందకీ చూస్తూ అమాయకంగా "ఏమైంది రిషీ, ఇక్కడున్నానేంటి?" అంది.

"ఓసినీ! హడలు కొట్టావు కదే అందరినీ." అంది సునంద. సిగ్గుపడుతూ మళ్ళీ తన సీట్లో కొచ్చి కూర్చుంది పిన్ని మెల్లగా.

"నీకు నిద్రలో నడిచే అలవాటే అందని తెలుసు గానీ, ఇలా ఎగిరే అలవాటుందని తెలీదే." అన్నాడు మల్లి.

"బాబూ, మీ అలవాట్లేంటో, మీ వ్యవహారాలేంటో నా ఛావుకొచ్చేట్టుంది. ఏం ఫ్యామిలీరా బాబూ!" విసుక్కున్నాడు స్వలా.

"సర్లే పంతులు గారూ, రేపు మా ఆవిడ బెల్టుకి పాస్ కోడ్ పెడతాలే. అది ఎంటర్ చేస్తే గానీ బెల్టు రాకుండా." అన్నాడు మల్లి తన తెలివికి తనే మురిసిపోతూ.

"ఎందుకూ, పాస్ కోడ్ చెప్పమని పక్కనున్నోళ్ళని గొంతు పిసికి చంపడానికా!" అన్నాడు స్వలా విండో వైపు తిరిగి పడుకుం

కొన్ని గంటల తర్వాత "గుడ్ మార్నింగ్!" అని వినబడింది స్పీకర్లో.

మెల్లగా అందరూ నిద్ర లేస్తున్నారు. అప్పటికే స్వలా కొంత విండో డోర్ పైకి ఓపెన్ చేసి బైటికి చూస్తున్నాడు.

జగదీశ్ "ఏంటండీ, రాత్రి నుండి పడుకోలేదా? ఏంటి సీరియస్ గా ఏదో ఆలోచిస్తున్నారు?" అడిగాడు.

"ఏం లేదండీ, ఆ దూరంగా చూడండి ఎర్రగా, అదే మార్స్ అయ్యుంటుంది." అన్నాడు.

"గురూ గారికి బాగా ఎక్సైటింగా ఉన్నట్లుంది ఈ ట్రిప్పు." అన్నాడు మల్లి ఒళ్లు విరుచుకుంటూ.

"అదేనండీ, ఏదీ మనతో ఆగిపోకూడదు. అందుకే 'గ్రహాంతర మ్యాట్రిమోనీ' ఒకటి మొదలు పెడదామనుకుంటున్నా!" అన్నాడు ప్రశాంతంగా.

అదిరిపడ్డారు అందరూ.

మల్లి ముందుగా తేరుకుని "వామ్మో, వామ్మో నువ్వు మామూలోడివి కాదు గురూ." అన్నాడు.

అందరూ ఆశ్చర్యంలోనే ఉన్నారింకా.

"ఆలోచించండి, ఇక్కడి వాళ్ళ ప్రొఫైల్స్ తీసుకెళ్లి అక్కడ చూపిస్తాం. అక్కడి వాళ్ళవెలాగూ మన సిస్టంలో ఉండనే ఉన్నాయి. మీరు పెళ్ళి పనుల్లో ఉన్నప్పుడు నేను చకచకా నాలుగు పెళ్ళిళ్ళు రెడీ చేసెయ్యొచ్చు." అన్నాడు ఉత్సాహంగా.

"ఈ ట్రిప్పు మనకి గిట్టుబాటౌతుందో లేదో తెలీదు కాదన్నాయ్, ఈ పంతులు గారికి ఫుల్లు పైసా వసూల్." అన్నాడు మల్లి.

"ఇంత దూరం వచ్చి మరీ ఎవరు చేసుకుంటారండీ? మనలాంటి పిచ్చోళ్ళు ఎంతమంది ఉంటారని..." అంది సునంద తేలిగ్గా తీసేస్తూ.

"పిచ్చోళ్ళు లేకపోతే తయారు చేస్తానండీ! మార్స్ అమ్మాయిని చేసుకుంటే మిలియన్స్ కలిసొస్తాయని ప్రచారం చేస్తాను. వీళ్లకి ఎర్త్ మీద అబ్బాయిలంటే ఫుల్లు ఆక్సిజన్ రిచ్ బాడీస్, మీ వంశం గట్టిగా నిలబడుతుందని సైంటిస్టుల చేత ప్రమాణాలు చేయిస్తాను. ఇంకా మండితే, భూమ్మీద జాతకాలు సరిపోక ముదిరిపోతున్న అమ్మాయిల్నీ, అబ్బాయిల్నీ మార్స్ లో ఐతే జాతకాలు భేషుగ్గా సరిపోతాయని, అక్కడికి తీసుకొచ్చి మరీ పెళ్ళిళ్ళు చేయిస్తాను." గుక్క తిప్పుకోకుండా చెప్పాడు.

అందరి నోళ్లూ తెరిచే ఉన్నాయి కాసేపు.

"ఇవన్నీ శాస్త్రాల్లో ఉన్నాయాండీ? తప్పు కదా...?" అంది పిన్ని సందేహంగా.

"ఏమోనండీ, ఎవరు చదివారు శాస్త్రాలూ, అవీ!" గొణిగాడు స్వలా.

"ఏంటండీ?"

"అబ్బే, ఉన్నాయండీ. తప్పకుండా ఉండే ఉంటాయి. మన శాస్త్రాల్లో లేనిదేంటి చెప్పండి."

"నువ్వేదైనా చెయ్యగలవ్, అసాధ్యుడిలా ఉన్నావ్. ఇంకా నయం, మార్స్ లో తీర్థ క్షేత్రం వెలిసిందని ప్రచారం చేసేవ్ కొంచెం చనువిస్తే." అన్నాడు మల్లి.

“దట్స్ ఏ గ్రేట్ ఐడియా అండీ, దేవుడు సర్వాంతర్యామి. భూమ్మీద ఆయన తిరగ్గా లేంది, మార్సొక లెక్కా. అక్కడే తిరిగే ఉంటాడు, ఎక్కడో మూల వెలిసే ఉంటాడు. ఓ పన్చేద్దాం! మనిద్దరం పార్టనర్ షిప్ తీస్కొని ‘మార్స్ యాత్రా స్పెషల్’ ఒకటి పెడదామా? పెళ్ళిళ్లకు పెళ్ళిళ్లూ, దర్శనాలకు దర్శనాలూ...స్వామియే...” అంటూ గాల్లో దణ్ణం పెట్టాడు స్వలా.

మల్లి సీట్ బెల్టు తెంపుకొని బాత్‌రూం వైపు హడావిడిగా తేలుకుంటూ పారిపోయాడు.

15

తర్వాత మూడు రోజులూ గందరగోళంగా గడిచాయి అందరికీ.

ఓ సారి స్వలా బాత్‌రూం నుంచి బయటికొచ్చి నాసా వాళ్ళ ముత్తాతల నుండి అందరినీ బండ బూతులు తిట్టడం మొదలుపెట్టాడు.

“గురూ గారూ, ఎంటీ హడావిడి? కూల్ కూల్!” అన్నాడు మల్లి.

“ఏంటండీ కూల్, ఇక్కడ మండిపోతుంటే?”

“అదే ఏమైంది లోపల?”

“అసలు రెస్ట్ రూం అంటే ఏంటండీ, ప్రశాంతంగా రెస్టు తీసుకోవాల్సిన చోటు. అలాంటిది, బెల్టులు కట్టేసుకోని బాత్‌రూంలో కూర్చోడం కన్నా దారుణమేవన్నా ఉందా?!”

“అడగండి, ఇంకా గట్టిగా అడగండి. వీళ్ళు ఇంత ఇంత అమౌంట్ తీసుకోని ఇచ్చే ఫెసిలిటీస్ ఇవ్వా!” వంత పాడాడు జగదీశ్.

“మీరాగండీ, అన్నిట్నీ డాలర్స్ కే లింక్ పెడతారు.” చిరాకు పడ్డాడు స్వలా.

“రెండ్రోజులేగా, అడ్జస్ట్ అవ్వండంకుల్, మేమందరం అవ్వట్లా?” అన్నాడు రిషీ చిరాగ్గా.

“ఆ బెల్టులకి తోడు ఆ వాక్యూం క్లీనరొకటి, ఇంకా నయం, కొంచెం గట్టిగా లాగితే నేను కూడా లోపలికెళ్ళి పోయేవాణ్ణి.” అన్నాడు గుండెలమీద చేతులు వేసుకుంటూ.

“భలే వారే. ఇవన్నీ అలవాటు చేసేస్కోవాలి మీరు తొందరగా. మన వెంచర్ వర్కౌటవ్వదు లేతే. గుర్తుందిగా – గ్రహాంతర స్పెషల్ ట్రావెల్స్!” నవ్వాడు మల్లి పెద్దగా.

రెండో రోజు, అందరినీ ఇన్‌స్పైర్ చేసి గాల్లో పేకాట ఆడించాడు మల్లి. ముందు వద్దు అంటూనే భయం భయంగా వాళ్లతో జాయినయ్యాడు లీ. మల్లి చేసిన బ్లఫింగ్ తో పేకాట కాస్తా వాళ్ళిద్దరి మధ్య స్పేస్ కుస్తీ గా మారింది. మిగతా అందరూ రెండు గ్రూపులుగా విడిపోయి, చుట్టూ చేరి వాళ్లని ఎంకరేజ్ చెయ్యడం మొదలుపెట్టారు. ఆ స్పీకర్ లో కింద గ్రౌండ్ కంట్రోల్ జనాలు బెదిరించకపోతే, రాకెట్ ని రెండుగా చీల్చి, చెరో దిక్కుకి పోయే వాళ్ళు.

మూడో రోజు అందరూ నిద్ర లేవగానే అప్పటికే జగదీశ్ ఉల్లాసంగా గాల్లో తేలుతూ "సర్ప్రైజ్" అని అరిచాడు. అందరూ ఏమైందో అర్థంకాక తల గోక్కుంటుంటే, ఆ ప్యాకెట్ లోంచి

TV 420 వాళ్ళిచ్చిన టీషర్ట్ లు తీసి అందరికీ పంచాడు ఆప్యాయంగా.

"ఇంకో గంటలో మనకి లైవ్ ఉంది. టకటక రెడీ అయ్యి రండి." హుకుం జారీ చేశాడు.

అందరూ అతణ్ణి తిట్టుకుంటూ రెడీ అయ్యి క్రికెట్ టీం లాగా బ్లూ టీషర్ట్ లేస్కొనొచ్చి కుర్చున్నారు. ఆ హడావిడికి లీ లోపలి కొచ్చి పగల బడి నవ్వి "ఏంటీ ఈ బ్యాండ్ మేళం అవతారాలు?" అన్నాడు.

మల్లికి మండి "హో చూహూ, కొంబాన్వా!" అని అదో రకంగా చైనీస్ మార్షల్ ఆర్ట్ సినిమాలో విలన్లా అరిచాడు. లీ బుర్ర గోక్కుంటూ కాక్ పిట్ లో కెళ్ళిపోయాడు.

"ఏంట్రా ఏమన్నావ్ వాణ్ణి?" అన్నాడు జగదీశ్.

"అదీ జపనీస్ లో భీభత్సమైన తిట్టన్నాయ్. జీవితంలో మన జోలికి రాడింక వాడు." అన్నాడు మల్లి.

"నాన్నా! లీ చైనీస్ కదా?" అంది నీలూ తల పట్టుకుంటూ.

హఠాత్తుగా తల తిప్పి, పైకీ, కిందకీ చూట్టం మొదలుపెట్టాడు మల్లి.

ఆ TV 420 యాంకర్ వీళ్లతో ఓ గంటసేపు ఆడుకుంది. సరదాగా "కాల్ టు స్పేస్" అనే ప్రోగ్రాం పెట్టి భూమ్మీద జనాల చేత వీళ్లకి డైరెక్ట్ గా కాల్స్ చేయించింది.

ఒక కాలర్ "ఎక్కడ దాకా ఎల్తన్నారు సార్?" అనడిగాడు.

ఇంకోడు "ఇక్కడ మాకున్న వైరస్ లు చాలక మీరు స్పేస్ నుంచి కొత్త వైరస్ లు తేవడానికెల్తున్నారా?" అని నిలదీశాడు.

ఒకామె "హబ్బ, ఎన్నాళ్ళక్కలిసిందో మీ లైను! సార్ సార్, ఆ 'నింగిలో పొర్లుతూ' సాంగ్ వెయ్యరా? నా ఫేవరెట్టది!" అంది సిగ్గు పడుతూ.

ఆ ప్రశ్నలు విన్నాక, ఆ కాలర్స్ కన్నా మల్లే కొన్ని వేల రెట్ల జ్ఞానిలా కనపడ్డాడు వాళ్లందరికీ.

ఈ ఫ్యామిలీ బాధ భరించలేక ప్రతిరోజూ కొత్త సుయిసైడ్ అటెంప్ట్స్ చేసేవాడు లీ. మూడో రోజు రాత్రి ఉన్నట్టుండి లోపకికొచ్చి గాల్లో యోగాసనం వేసుక్కుర్చున్నాడు. ఎంతసేపటికీ కదలక పోతుంటే జగదీశ్ కి డౌటొచ్చి అడిగాడు.

'ఆమరణ నిరాహార దీక్ష' చేస్తున్నానన్నాడు లీ.

"ఆల్ రెడీ ఫుల్లుగా నూడుల్స్ తినేసొచ్చుంటాడు. ఇంకేం దీక్ష!" వెటకారంగా అన్నాడు మల్లి.

దాదాపు ఏడ్చినంత పని చేశాడు లీ అది విని.

జగదీశ్, రిషీ బాగా బతిమిలాడారు.

మల్లి గొడవ చెయ్యడం ఆపకపోతే కానీ దీకష్ ఆపేది లేదన్నాడు లీ.

"పోతే పోనీ అన్నాయ్. ఎవడో పోతాడని, పుట్టుకతో వచ్చిన లక్షణాల్ని మార్చుకోలేం కదా." అన్నాడు మల్లి.

జగదీశ్ గట్టిగా తిడుతూ "వాడు పోతే, అ స్పేస్ క్రాఫ్ట్ ఎటో పోతుంది. ఆ తర్వాత..."

"ఓకే, ఓకే, నీ డబ్బులనీ స్పేస్ లోకి పోతాయ్...అంతేగా!" పూర్తి చేశాడు మల్లి.

ఆ తర్వాత లెమన్ జ్యూస్ పేస్టు తినిపించి మరీ లీ దీక్ష విరమింపజేశారు ఫ్యామిలీ అంతా.

మల్లి నోరు కొంతసేపైనా మూతపడటంతో, ఆ ఆనందం పట్టలేక కాసేపు రిషీని పైలట్ సీట్లో కూర్చొబెట్టి నీ ఇష్టమొచ్చిన బటన్స్ నొక్కుకోమన్నాడు లీ!

చివరి రోజు. "సిక్స్ అవర్స్ టు ల్యాండ్." అని వచ్చింది అనౌన్స్ మెంట్. రిషీకి ఎక్సైటింగా ఉంది. స్వలా కిటికీలోంచే మార్స్ మీద గుడికి మంచి స్పాట్ వెతుకుదామని బైటకి చూట్టం మొదలు పెట్టాడు. మల్లికి హఠాత్తుగా ఏదో గుర్తుకొచ్చింది. తన రిస్ట్ బ్యాండ్ నొక్కితే ఎదురు గాల్లో తన మొహాన్ని ప్రొజెక్ట్ చేసిందది. అద్దంలో చూసుకున్నట్టు రకరకాలుగా క్రాఫ్ సర్దాడు గానీ ఎందుకో నచ్చలేదు. వెనక్కి తిరిగి "రేయ్, రిషీ, నా ట్రిమ్మర్ ఆ బ్యాగ్ లో ఉంది ఇవ్వరా, కాస్త లైట్ గా ట్రిమ్ చేస్కుంటాను." అన్నాడు.

షాకయ్యాడు రిషీ. "బాబాయ్ అలాంటివన్నీ ఇక్కడ కుదరవు, దిగాక చేస్కోవచ్చుగా?"

"దిగిన వెంటనే పెళ్ళి వాళ్లకి మన మొహాలు గ్లామరస్ గా కనిపించాలనే కదరా! అసలే మనలాంటి యూత్ మీద ఎక్స్పెక్టేషన్స్ మరీ ఎక్కువ జనాలకి." అన్నాడు మొహం సీరియస్గా పెడుతూ.

"లీని అడుగు, అసలు ఒప్పుకుంటాడో లేదో..."

మల్లి అది పట్టించుకోకుండా తన షేవర్ తీస్కొని ఆన్ చేశాడు. ఆ శబ్దం వినపడి హడావిడిగా లోపలి కొచ్చాడు లీ.

మల్లి చేతిలో ట్రిమ్మర్ చూసి షాకయ్యి – "ఎక్కేటప్పుడే చెప్పాను మీ అందరికీ, ఇక్కడ ఏడవడానికే కుదరదు, కన్నీళ్ళు పైకి ఎగిరి ఏ మిషన్లో ఐనా ఇరుక్కుంటే మనం అందరం ఇక్కడే మార్స్ కి ఇంకో ఉపగ్రహంలా తిరుగుతూ ఉండిపోతాం. అలాంటిది షేవింగ్, కటింగ్ ఇలాంటివి అస్సలు ట్రై చెయ్యద్దు. ప్లీజ్." అన్నాడు పెద్దగా.

తిరిగి లోపలి కెళ్ళబోతూ నమ్మకం కుదరక మల్లి వంక చూశాడు.

"కొంపదీసి ట్రిమ్ చేస్తే? ఆ వెంట్రుకలన్నీ గాల్లోకి ఎగిరితే...?" వణుకు పుట్టి, మల్లి చేతిలో ఉన్న ట్రిమ్మర్ లాక్కొని, లోపల్నుంచి ఇంకో పెద్ద డివైస్ తెచ్చిచ్చాడు లీ.

"ఏంటిది?" అన్నట్టు సందేహంగా చూశాడు మల్లి.

"ఇది నా పర్సనల్ స్పేస్ షేవర్. మనం షేవ్ చేస్కుంటున్నప్పుడే వాక్యూమ్ చేసి వెంట్రుకలన్నీ లోపలికి లాగేస్తుంది. ఎవరితో షేర్ చేస్కోను నావేవీ. నువ్వు ఆగేట్టు లేవనీ..." మొహం చిరాగ్గా పెట్టి అన్నాడు లీ.

మల్లి వాళ్ళావిడ "అబ్బ, ఇది మన ఎర్త్ లో గూడా కొనుక్కుందామండీ, ప్రతిరోజూ మీ షేవింగూ, ట్రిమ్మింగూ అయ్యాక ఆ వెంట్రుకలన్నీ క్లీన్ చెయ్యలేక ఛస్తున్నా." అంది దాని వైపు ఆశ్చర్యంగా చూస్తూ.

ఆ ఆదర్శ దంపతుల్ని కళ్ళార్పకుండా చూసి, తల బాదుకుంటూ కాక్ పిట్ లోకెళ్ళిపోయాడు లీ.

వాళ్ళ స్పేస్ క్రాఫ్ట్ సేఫ్ గా ల్యాండయ్యింది మార్స్ మీద. అందరూ లేచి మెల్లగా స్పేస్ సూట్ వేసుకుని, హెల్మెట్స్ పెట్టుకుని బైటికి రాబోతుంటే డోర్ కి అడ్డంగా నిల్చునున్నాడు లీ.

"మళ్ళీ ఎర్త్ మీదికి ఎప్పుడు మీ రిటర్న్?" అడిగాడు సిన్సియెర్ గా.

"చూసావా అన్నాయ్, వీడిక్కొంచెం తిక్క గానీ, మనమంటే తెగ పిచ్చి." గొణిగాడు మల్లి జగదీశ్ వైపు చూస్తూ.

"ఓ నెల రోజులు ఉంటాం ఇక్కడ. ఎక్సాక్ట్ గా మళ్ళీ వెళ్ళే డేట్ తెలీదు. మ్యారేజ్ అయిన దాన్ని బట్టీ. ఎందుకు?" అడిగాడు జగదీశ్.

"ఎప్పుడైనా పర్లేదు, నాకో రోజు ముందుగా కాల్ చెయ్యండి చాలు. ఏ టైంలో ఐనా సరే." అన్నాడు లీ.

అందరూ ఆశ్చర్యపోయారు.

"తప్పకుండా చెప్తారుగా." అన్నాడు లీ మళ్ళీ.

"సరే, చెప్తాంలే." అన్నాడు జగదీశ్.

"థాంక్యూ, శాలరీ లాస్ ఐనా సరే ఆ వారమంతా సెలవు పెట్టుకుందామని..." అన్నాడు లీ అందరికీ దణ్ణం పెడుతూ.

రిషీ, నీలూ పగలబడి నవ్వ బోయి, నోటికి చెయ్యి అడ్డం పెట్టుకోని స్పేస్ క్రాఫ్ట్ బైటికి నడిచారు.

## 16

స్పేస్ క్రాఫ్ట్ బైట కొచ్చిన వాళ్ళంతా ఒక్కసారిగా అలా నిలబడిపోయారు చుట్టూ చూస్తూ. నేలకి 200 అడుగుల ఎత్తులో ఉన్నారింకా. చుట్టూ ఎర్రటి నేల, పర్వతాలూ, ఆకాశం!

"అబ్బ, మా క్లబ్బులో ఫ్రెండ్ చెప్పింది నిజమేనన్నాయ్, కమ్యూనిస్టులందరూ కలిపి కట్టుకున్నారంట ఈ గ్రహాన్ని! ఫుల్లు ఎర్రజెండా."

"నాకైతే అంతా శుభప్రదంగా కనపడుతోందండీ!" అన్నాడు స్వలా నోరు తెరుచుకోని చూస్తూ.

నేలమీద గ్లాస్ ప్యానెల్స్ తో, చిన్నా పెద్దా డోమ్స్ లాగా వరుసగా పేర్చినట్టు చాలా బిల్డింగ్ లు ఉన్నాయి. వాటికి చుట్టూ సోలార్ ప్యానెళ్ళు కొన్ని మైళ్ల వరకూ స్ప్రెడ్ అయి ఉన్నాయి. వాటి చుట్టూ కొన్ని వందల విండ్ టర్బైన్స్ తిరుగుతున్నాయి. అదంతా ఒక పెద్ద కాలనీ లాగా కనిపిస్తోంది. ఆ కాలనీ మధ్యలో రోడ్లు గ్లాస్ టన్నెల్స్ లోపల ఉన్నాయి. చిన్న చిన్న వెహికల్స్ అటూ ఇటూ వెల్తున్నాయి ఆ టన్నెల్స్ లో. ఆ కాలనీ బైట కూడా కొన్ని ఎల్లో కలర్ వెహికల్స్ తిరుగుతున్నాయి. మనుషులైతే ఇంకా ఎవరూ కనపడలేదు వాళ్లకి.

"వెల్కం టు మార్స్! మీ ఎదురుగా ఉన్న ఎలివేటర్ ఎక్కండి." అని వినపడింది.

మెల్లగా ఎలివేటర్ ఎక్కి, కిందికి వెళ్ళారంతా.

అక్కడ ఉన్న క్రూ సూట్లూ, హెల్మెట్లూ అన్నీ తీసేసి అందరికీ 'రేడియేషన్' చెక్స్ చేశారు. అందరికీ ఏవో లిక్విడ్స్ ఇచ్చి ఓ గంటసేపు అబ్జర్వేషన్ లో పెట్టి, వీళ్ళు గ్రహాంతర స్మగ్లర్లు కాదని లగేజ్ లన్నీ చెక్ చేశాక బైటికి వదిలారు.

ఆ లాంచ్ స్టేషన్ గేటుకి ఓ పెద్ద గ్లాస్ డోమ్ కిందికి వచ్చారు వాళ్ళు. అక్కడే విశా వాళ్ళ ఫ్యామిలీ ఆతృతగా వెయిట్ చేస్తూ కనపడింది. రిషీ కనపడగానే విశా పరిగెత్తుకుంటూ వచ్చి అతణ్ణి కౌగిలించుకుంది. రిషీ కూడా కొన్ని క్షణాలు అలా ఉండి, మెల్లగా తనని పట్టుకుని ముందుకు నడిచాడు. అందరూ మళ్ళీ ఇంకో సారి పరిచయాలు చేసుకున్నారు.

"మిమ్మల్ని వీడియోలో చూసి పొట్టిగా ఉంటారనుకున్నా, పొడుగే మీరు." అన్నాడు జగదీశ్ తో విశా వాళ్ళ నాన్న మహా.

"మేమూ మీ బాల్డ్ హెడ్ చూసి పూర్తిగా గుండనుకున్నాం వీడియోలో, ఇంకా కొన్ని వెంట్రుకలున్నాయి పైన." అన్నాడు మల్లి క్యాజువల్ గా.

షాక్ తిని "మీరూ...రిషీ అంకుల్ కదా?" అన్నాడు మహా కన్ఫర్మ్ చేసుకుంటూ.

అందరూ తలలూపారు చుట్టూ.

"ఇక్కడికి వెహికల్స్ అలౌ చెయ్యరు పదండి పార్కింగ్ లాట్ కెల్దాం." అంది విశా వాళ్ళ అమ్మ కీర్తి.

రిషీ, విశా ఈ ప్రపంచంలో లేరు.

"చాలా లగేజ్ ఉంది కదండీ? ఒక్కో బ్యాగే 30 కేజీలుండచ్చు. మనం మోసుకెళ్లలేం ఇవన్నీ, ఇక్కడ రోబోట్ కూలీలుండరా?" అన్నాడు జగదీశ్ చుట్టూ చూస్తూ.

కీర్తి నవ్వుతూ వచ్చి రెండు బ్యాగ్ లని అవలీలగా ఎత్తి, మోసుకుంటూ పార్కింగ్ లాట్ వైపు స్పీడ్ గా నడిచింది.

రిషీ బ్యాచ్ నోరెళ్ళబెట్టారు.

“మంచి జిమ్ బాడీ అనుకుంటా ఆవిడది! చూసి నేర్చుకోవే.” అన్నాడు మల్లి వాళ్ళావిడతో.

విశా నవ్వి, “లేదంకుల్, మార్స్ లో వస్తువుల బరువు తగ్గిపోతుంది. భూమ్మీద 30 కేజీలుంటే, అది ఇక్కడ 10 కేజీలే అనిపిస్తుంది. చూడండి.” అంటూ సునాయాసంగా తనూ ఇంకో రెండు బ్యాగ్ లు తీసుకుంది. మిగతా వాళ్లూ చక చకా ఎత్తేసి నడవటం మొదలుపెట్టారు.

అలా వాళ్ళు పదడుగులు ముందుకు వేశారో లేదో, వెనక నుండి

“అబ్బా, వదలండీ, ఏంటీ పనులు? అందరూ చూస్తే ఏమనుకుంటారు?” అని వినబడింది.

చటుక్కున వెనక్కి తిరిగి చూస్తే – మల్లి వాళ్ళావిడని రెండు చేతుల్తో పైకెత్తుకొని గిరగిరా తిరుగుతున్నాడు.

నీలూ తల పట్టుకోని “నాన్నా, ఏం చేస్తున్నావ్? దించు అమ్మని!” అని గదిమింది.

“ఉండవే, పెళ్ళయిన ఇన్నాళ్ల కి మా ఆవిడని ఎత్తుకొని తిప్పాలనే నా కల వర్కౌట్ అయ్యింది. మళ్ళీ , మళ్ళీ వస్తుందా చెప్పు ఈ గోల్డెన్ ఛాన్సు? ఫోటో తియ్యవే తొందరగా.” అన్నాడు మల్లి.

“అయ్యా, ఇంకా నెలరోజులిక్కడుంటాం, ఎత్తుకోవడం ఏం ఖర్మ, పైకి విసిరేసి క్యాచ్ కూడా ఆడుకోవచ్చు ఒకరినొకరు. పబ్లిక్ లో ఈ సరసాలు ఆపితే, ఇంక ఇంటికెళ్దామా? మామూలు తిండి తిని నాలుగు రోజులయ్యింది.” అన్నాడు స్వలా.

టేస్ట్ లేని వాళ్ళందరినీ తిట్టుకుంటూ ముందుకి నడిచాడు మల్లి.

జగదీశ్ ఒక చిన్న ట్రక్ లాంటి బ్లూ వెహికిల్ లో లగేజ్ పెట్టి అందర్నీ ఎక్కించాడు. ట్రైన్ ట్రాక్స్ లా ఉన్న వాటి మీద వెళ్తోందా వెహికిల్ ఆటోమేటిక్‌గా. వాళ్ళు ఇందాక పైనుంచి చూసిన గ్లాస్ ట్యూబ్ లాంటి రోడ్డు మీద ఇప్పుడు వెళ్తున్నారు. చుట్టూ బ్లూ, గ్రీన్ వెహికల్స్ వెళ్తున్నాయి అటూ ఇటూ.

“బైట ఎల్లో వెహికల్స్ చూశాం అంకుల్, అవేంటి?” అడిగాడు రిషీ.

“అవి, ఈ కాలనీ బైటకి వెళ్ళేందుకు వాడతారు. బైట చాలా వర్క్స్ జరుగుతాయి, ఎలక్ట్రిసిటీ ప్లాంట్, పోల్స్ దగ్గర వాటర్ జనరేషన్ ప్లాంట్, ఇట్లా బైట చేసే పనులకి. కానీ బైట వాతావరణం చాలా హార్ష్ గా ఉంటుంది. దానికి తగ్గట్టే డిజైన్ చేస్తారు వాటిని. లోపల మనకి కంట్రోల్ డ్ ఎన్విరాన్మెంట్ కనక అంత ఇబ్బంది లేదు.” అన్నాడు మహా.

అందరూ ఆ గ్లాస్ టన్నెల్ లోంచి పైకి చూస్తున్నారు ఆశ్చర్యంగా ఆ కాలనీని. ఇంతలో ఉన్నట్టుండి పెద్దగా అలారం మోగటం మొదలైంది చుట్టూ. రెడ్ లైట్స్ వెలుగుతున్నాయి వెహికిల్ లోపలా రోడ్డు మీదా. చుట్టుపక్కల వెహికల్స్ అన్నీ హఠాత్తుగా ఆగిపోయాయి.

మహా వాళ్ళావిడ కీర్తి భయంగా చూసింది భర్త వైపు. ఆమె భుజం పట్టుకున్నాడతను ధైర్యం చెబుతున్నట్టు. వెనక నుండి విశా కూడా ఒక చెయ్యి వేసింది ఆమె మీద. రిషీ వాళ్ళకంతా గందర గోళంగా ఉంది.

"బ్రేస్ ఫర్ ఇంపాక్ట్ ఇన్ టూ మినిట్స్..." అని వినపడింది బైటనుండి స్పీకర్స్ లో.

పైన ఆకాశం ఇంకా ఎర్రగా మారిపోతోంది. ఏదో గాలి వీస్తున్నట్టు శబ్దం వస్తోంది.

"ఒన్ మినిట్..."

"ఏంటి బావగారూ, ఏం జరుగుతోంది?" అన్నాడు వాళ్ళ భయాన్ని చూసి జగదీశ్.

"తుఫాను – స్టార్మ్. శాండ్ స్టార్మ్ రాబోతోంది. గట్టిగా పట్టుకోండి సీట్ల ముందున్న హ్యాండిల్ బార్స్ ని అందరూ." అన్నాడు మహా సీరియస్ గా.

ఉన్నట్టుండి ఆ శబ్దం బాగా పెద్దదయ్యింది. ఆ గ్లాస్ టన్నెల్ పైన అంతా ఎర్రటి గాలి బలంగా వీస్తున్నట్టు కనబడుతోంది.

"3...2...1..."

ఒక్కసారి వీళ్ళున్న వెహికిల్ గట్టిగా షేక్ అయ్యింది. అందరూ కెవ్వున కేక పెట్టారు. అది పడుపోతుందేమోనని భయంగా ఒకళ్లనొకళ్లు గట్టిగా పట్టుకున్నారు. కొన్ని సెకన్ల పాటు భూకంపం వచ్చినట్టనిపించింది వాళ్లకి. ఎంత వేగంగా వచ్చిందో, అంతే వేగంగా వెళ్ళి పోయిందా తుఫాను. ఓ రెండు నిమిషాలని కుదుటపడ్డారందరూ.

"ఇట్స్ ఆల్ రైట్, పెద్దదేం కాదు. అంతా బానే ఉన్నారు కదా." అన్నాడు. ఆ షాక్ నుంచి ఇంకా తేరుకోలేదు రిషీ వాళ్ళు.

"ఏం గురూ గారూ, ఇందాక అంతా శుభప్రదంగా ఉందన్నారు? ఇది మంగళ గ్రహం కాదు, అమంగళ గ్రహం లా ఉంది. అన్నాయ్, ఈ విజువల్ ఎఫెక్ట్స్ గురించి ముందే తెలుసా నీకు?" అన్నాడు మల్లి.

తల అడ్డంగా ఊపాడు జగదీశ్.

"కమాన్, ఇది చాలా కామన్ మార్స్ లో. ఈ కాలనీ పెద్ద పెద్ద తుఫానులకి నిలబడింది. మీకేం కాదని నాది హామీ." అన్నాడు వెనక్కి తిరిగి.

అందరూ బానే ఉన్నట్టున్నారు కానీ మల్లి వాళ్ళావిడ ఇంకా కళ్ళు మూసుకుని, దణ్ణం పెడుతూ, చిన్నగా ఏదో చదువుకుంటోంది. అందరూ సైలెంటయ్యాక మెల్లగా కళ్ళు తెరిచింది.

"హమ్మయ్య, మీరు బానే ఉన్నారు కదా? మీ గురించే మొక్కుకున్నా?" అంది మల్లి ఆరాధనగా తడుముతూ.

మళ్లి గర్వంగా చూస్తూ "ఏంటే నేనంటే అంత పిచ్చి నీకు, ఇంత చిన్న దానికి, నువ్వు పది వారాలు ఫాస్టింగ్ చెయ్యడాలూ, గుళ్లో చుట్టూ పొర్లు దండాలు పెట్టడాలూ...అలాంటి మొక్కులు నాకు నచ్చవు." అన్నాడు.

"అందుకే, అలా అనుకోలేదు ఈసారి, బాలాజీ కి నువ్వే మోకాళ్లమీద నడిచొస్తావని మొక్కుకున్నా!" అంది.

అందరూ భళ్ళున నవ్వారు.

"ఓసేయ్, నీకు దణ్ణం పెడతాను. ఆ మొక్కు వాపస్ తీస్కోవే, నా వల్ల కాదు." మూలిగాడు మళ్లి బాధగా.

"నో ఛాన్స్, బాలాజీ తో గేమ్స్ ఆడకూడదు." అంది తను.

"పోనీ మన పైలట్ లీ కాళ్లూ, గడ్డం పట్టుకోని ఇక్కడే వైకుంఠం ఎక్కడుంటుందో కనుక్కోని అక్కడికే తీస్కెళ్లి డైరెక్ట్ గా దర్శనానికి ట్రై చేద్దామే." అన్నాడు దీనంగా.

"అక్కడ మెట్లుంటాయో లేదో...?"

"అంటే...నీకూ దేవుడూ, దర్శనం ముఖ్యం కాదు, మెట్లు మీద నేను మోకాళ్లతో వెళ్ళడమే ఇంపార్టెంటన్నమాట!"

"ఊ...మీరు మోకాళ్ళ మీద కొండెక్కాల్సిందే..."

"కానీండే...చంపెయ్యండి మా లాంటి అమాయకపు భర్తల్ని."

మహా, కీర్తి నవ్వుకున్నారు ఈ వింత జంటని చూసి. మిగతా మార్స్ విషయాలు మాట్లాడుకుంటూ ఇంకో పది నిమిషాల్లో విశా వాళ్లింటికి చేరుకున్నారందరూ.

## 17

అన్ని ఇళ్ళల్లాగే ఒక డోమ్ షేప్ లో ఉంది విశా వాళ్ళ ఇల్లు కూడా. మొత్తం మూడు అంతస్తులుగా ఉంది. రెండు అంతస్తులు నెల పైన ఉంటే, కింద లెవెల్ నేల కిందికి ఉంది. మధ్య లెవెల్లో చిన్న హాలూ, కిచెనూ ఉంటే, పైనా కిందా బెడ్ రూమ్స్, వర్కింగ్ రూమ్స్ ఉన్నాయి. సూర్యుడు ఉన్నంత సేపూ అన్ని ఫ్లోర్స్ కీ లైట్ పడేటట్టుగా సెంటర్ లో ఖాళీ ఉంచి డిజైన్ చేశారు ఇంటిని. పైకీ, కిందకీ వెళ్ళేందుకు స్పైరల్ స్టెప్స్ ఉన్నాయి దాని చుట్టూ.

రిషీ వాళ్ళు కింద లెవెల్ బేస్మెంట్ లో ఉన్న బెడ్రూంస్ లో సెటిలయ్యారు. స్వలా కి సపరేట్ గా అక్కడే ఒక చిన్న రూం ఇచ్చారు. రిషీ వాళ్ళు మధ్యాహ్నం రెస్ట్ తీసుకోని, సాయంత్రం ఏడింటికి డిన్నర్ టైంకి కలిశారు మధ్య లెవెల్లో.

సునంద, విశాని పక్కనే కూర్చోబెట్టుకుంది. కీర్తి వాళ్లిద్దరూ కాలేజ్ లో ఎలా కలిసారో, ఎందుకిష్టపడ్డారో సరదాగా కొన్ని ప్రశ్నలేస్తోంది. మహా, జగదీశ్ వాళ్ళ జాబ్ లూ, బ్యాగ్రౌండ్ ల గురించి మాట్లాడుకున్నారు కాసేపు. తర్వాత వాళ్లందరికీ ఇల్లంతా తిప్పి చూపించింది విశా.

ఒక చోట గ్లాస్ క్యాబినెట్ లో స్పేస్ సూట్ లు ఉండడంతో, రిషీ అక్కడే ఆగిపోయి –

"ఎప్పుడెప్పుడు వేసుకుంటారు వీటిని?" అనడిగాడు.

"దాదాపు మా వర్క్ అంతా కాలనీ లోపలే ఉంటుంది. ఎప్పుడైనా నాన్న అసైన్‌మెంట్ మీద బైటికెళ్తే వేసుకెళ్తారు. నేనూ కొత్త సాయిల్ సాంపుల్స్ తేవాలంటే వెల్తూ ఉంటాను." అంది విశా.

"ప్రతిసారీ, ఇదో తలకాయ నొప్పి కదా విశా? నేనైతే అస్సలివేవీ లేకుండానే అలా బైటికెళ్లి తిరిగొద్దామనుకుంటున్నా రేపు." అన్నాడు మల్లి క్యాజువల్ గా.

విశా వాళ్ళ ఫ్యామిలీ గిరుక్కున తిరిగి చూసింది మల్లి వైపు. ముగ్గురూ హడావిడిగా అతని చుట్టూ చేరిపోయారు.

"–30 డిగ్రీ సెల్సియస్ చలికి గడ్డ కట్టుకుని రెండు నిమిషాల్లో పోతారు." అంది విశా.

"ఇంకా బతికుంటే, కార్బన్ డై ఆక్సైడ్ లంగ్స్ లోకెళ్ళి వెంటనే పోతావ్." అన్నాడు మహా.

"ఆ తర్వాత, సూర్యుడి నుంచి డైరెక్ట్ గా పడే యూ.వీ రేడియేషన్ కి మీ ఫ్యూజ్ ఎగిరిపోతుంది." కీర్తి.

"ఇంకా తట్టుకుంటే, మీ బ్లడ్ బాయిలవ్వడం మొదలవుతుంది."

"ఇంకా బతికి నువ్వో ఐదు నిమిషాలు నడిచే లోపు, ఇసుక తుఫానులో కొట్టుకుపోతావ్."

"ఇంకో పది అడుగులేసేసరికి క్యాన్సరొచ్చి, అక్కడే రక్తం కక్కుకుని ఛస్తారు."

అంతా నిశ్శబ్దం అలుముకుంది ఆ గదిలో. మల్లి బిక్కచచ్చిపోయున్నాడు మధ్యలో.

"ఏవండీ, పోయేటట్టున్నాడండీ ఈయన, కొంచెం గ్యాపిద్దాం!" అంది కీర్తి తీరిగ్గా.

మల్లి గట్టిగా ఏడుస్తూ "వామ్మో, వామ్మో, ఇవన్నీ నాకేం చెప్పకుండానే చిన్న పిల్లాణ్ణి చేసి ఇక్కడికి తీసుకొచ్చారు. మార్స్ కెల్దామనొచ్చా కానీ మార్చురీకి పంపించేట్టున్నార్రోయ్!" అంటూ మార్స్ నీ, మార్స్ ని కట్టిన వాళ్లని, కనుక్కున్న వాళ్లని అందర్నీ కలిపి పచ్చి బూతులు తిట్టాడు.

"హేయ్, కూల్ డౌన్, ఇవన్నీ జాగ్రత్తలు తీసుకోకపోతే జరిగేవి. మేమ్మిమ్మల్ని జాగ్రత్తగానే చూస్కుంటాం. డోంట్ వర్రీ మల్లి." అన్నాడు మహా భుజం మీద తడుతూ.

"సరే గానీ, నాకు కొంచెం మంచి స్పేస్ సూట్ ఇవ్వండి. ఇప్పుడే దాచిపెట్టుకుంటాను. మళ్ళీ ఐపొయ్యాయి...తూచ్ అంటే నాకు కుదరదు." అన్నాడు చిన్న పిల్లాడిలా.

ఈ హడావిడి మధ్యలో ఎవరో వచ్చినట్టు హాల్లో స్క్రీన్ మీద కనబడింది.

"అయ్యో! మర్చిపొయ్యానండీ, పెళ్ళి పనుల్లో హెల్ప్ గా ఉంటాడని, మాకు తెలిసిన కుర్రాడిని కూడా రమ్మన్నాను డిన్నర్ కి." అంటూ డోర్ ఓపెన్ చేసింది కీర్తి.

సన్నగా, పొడుగ్గా ఓ ముప్పై ఏళ్ళ వయసున్న అతను లోపలి కొచ్చాడు. అతని హెయిర్ స్టైల్ యారో లాగా పొడుచుకొని ఉంది పైకి. ఓ చెవికి రింగూ, మెడలో మెరుస్తున్న చైనూ! మెడ మీద ఓ వైపు ఏదో గ్రహం బొమ్మ టాట్టూ ఉంది. ఎర్త్ బొమ్మైతే కాదు!

"రారా! ఇతను రజనీష్ అనీ, మా ఫ్యామిలీ ఫ్రెండ్స్ వాళ్ళబ్బాయి." అని పరిచయం చేసింది కీర్తి అందరికీ. అతను డైరెక్టుగా వెళ్ళి విశాని హగ్ చేసుకున్నాడు. బాగా తెలిసినతను అని అర్థమైంది రిషీ వాళ్ళకి.

చెయ్యి చాచి, షేక్ హ్యాండ్ ఇస్తూ "హాయ్, రజనీష్!" అన్నాడు రిషీ.

"బ్రో, కాల్ మీ రస్క్, రజనీష్ ఈజ్ ఓల్డ్ స్టైల్!" అన్నాడతను.

"రస్కా, అదేం పేరు?" అడిగాడు రిషీ.

"అంటే రజనీ ఎలోన్ మస్క్ కి పిచ్చ ఫ్యాన్. అందుకే..." అంది విశా.

"ఎహ్, రజనీష్ + మస్క్ లో తలా తోకా కలిపేసి 'రస్క్' అని నేనే పేరు మార్చేసుకున్నా!" అన్నాడు చిలిపిగా నవ్వుతూ.

"మార్స్ లో ఉన్నా తెలుగు బానే మాట్లాడుతున్నారే ఇక్కడి పిల్లలు?" అంది సునంద ఆశ్చర్యపోతూ.

"భలే వారే, చిన్నప్పటి నుండి, 'మార్స్ లో మన బడి', 'మార్స్ భారతి' లాంటి తెలుగు క్లాసులకి పంపి అరగదీస్తే, ఇదిగో ఈ మాత్రమన్నా ఉన్నారు." అంది కీర్తి కళ్ళు తిప్పుతూ.

"మామ్! ఇప్పుడవన్నీ అవసరమా, మాట్లాడుతున్నాం కదా నువ్వనుకున్నట్టు." అంది విశా.

"ఇదంతా నా గురించి కాదే, మన భాష, మన తెలుగు చచ్చిపోకుండా." సరిచేసింది కీర్తి.

విశా, రస్క్ ఇద్దరూ ఒకరిమొహాలొకరు చూస్కొని లేచి ఆమెకి దణ్ణం పెట్టారు –

"మా తెలుగు తల్లికి మల్లె పూదండ..." పాడుతూ.

తర్వాత అందరూ డిన్నర్ కి కూర్చొన్నప్పుడు రిషీ తన ఫ్యామిలీని పరిచయం చెయ్యబోయాడు రస్క్ కి.

విశా రిషీని ఆపేస్తూ "రస్క్ కి ఎదుటి వాళ్ళ ఫేసులని బట్టి వాళ్ళ హిస్టరీ చెప్పే టాలెంటుంది. తనే చెప్తాడు చూడు మీ గురించి." అంది.

రస్క్ నవ్వుతూ "మార్స్ మొహాలంటే ఈజీ గానీ, ఈ ఎర్త్ జనాల మీదెప్పుడూ ట్రై చెయ్యలేదు. లెట్స్ సీ." అంటూ జగదీశ్ వైపూ, మల్లి వైపూ మార్చి మార్చి రెండు నిమిషాలు చూశాడు. చాలా రోజుల తర్వాత హోం పుడ్డు దొరకడంతో జగదీశ్ పుడ్డు మీద బాగా ఫోకస్ చేశాడు. మల్లి మాత్రం నవ్వుతూ, టిప్ టాప్ గా ట్రిమ్మయ్యి కనపడ్డాడు రస్క్ కి.

"ఓకే, హియర్ ఇట్ ఈస్, వీళ్ళిద్దరూ బ్రదర్స్." అన్నాడు అందరూ తలలూపారు.

“ఇక్కడ, ఈయన మల్లి, మల్లి ఎస్. హీ ఈస్ యంగర్! పుడ్డు తో బిజీగా ఉన్నాయన ఎల్డర్ బ్రదర్!” చప్పట్లు కొట్టేంత పనిచేశారు చుట్టూ.

“చిన్నప్పుడే వీళ్ళ పేరెంట్స్ పోతే, మల్లి, పూర్ ఫెలో ఫ్యామిలీ మొత్తాన్నీ తనే సపోర్ట్ చేసుకుంటూ వచ్చాడు. ఇంకా చేస్తూనే ఉన్నాడు. హార్డ్ వర్కర్, ఎప్పుడూ తన గురించి ఆలోచించుకోడు.

దిస్ గై, జగదీశ్, క్వైట్ ఆపోసిట్. చిన్నప్పటి నుంచీ లేజీగా తిరుగుతూ, తమ్ముడి మీద ఆధారపడి బతుకుతున్నాడు.”

జగదీశ్ నోట్లో ముద్ద కూడా మింగకుండా ఆశ్చర్యంగా చూట్టం మొదలుపెట్టాడు.

“రస్క్...అదీ...” రిషీ అడ్డు పడబోయాడు.

“ఫ్లోలో ఉన్నా, డోంట్ స్టాప్ మీ బ్రో. మల్లి నానా కష్టాలూ పడి మంచి జాబ్ తెచ్చుకుని ఇంత పెద్ద ఫ్యామిలీని పోషిస్తుంటే, జగదీశ్ ఇంట్లో కుర్చోని తింటూ ఉంటాడు. పైగా గ్యాంబ్లింగ్, డ్రింక్ చేసి దార్లో పడిపోవడాలూ... అసలు మీ ఇంట్లో అందరూ ఈ మల్లి ఫొటోకి దండేసి రోజూ దణ్ణం పెట్టాలి ఐ సే.

ఓ సారీ, కాన్సిల్ ‘దండ’, ఛ, ఛ నో ‘దండ’. సారీ మల్లి...” అంటూ జగదీశ్ హఠాత్తుగా పైకి లేవడంతో మధ్యలో ఆపేశాడు.

“ఆపరా! అంతకు మించి ఇంకొక్క మాట్లాడితే నీ నాలుక చీరేస్తాను!” అనే క్లాసిక్ డైలాగ్ చెప్పబోతూ మింగేసినా, జగదీశ్ మొహం మాత్రం ఎర్రగా, సీరియస్ గా తయారైంది.

అందరూ రస్క్ వైపు కోపంగా చూస్తున్నారు.

“వాట్! ఏమన్నా తప్పుగా చెప్పానా? ఎక్కడో చిన్న చిన్న తప్పులుండటం కామనే. అసలే ఎర్త్ మొహాలు, అంత ఈజీ కాదు.” అన్నాడు తను.

మల్లి లేచి చప్పట్లు కొడుతూ “అదుర్స్ బయ్యా, ఇన్నాళ్ల నన్ను పొగిడిన మొట్టమొదటి వ్యక్తివి నువ్వు. హ్యాట్సాఫ్ బాసూ నీకు. నువ్వు అన్నీ కరెక్ట్ గానే చెప్పావ్ గానీ జస్ట్ మనుషుల్నే, తారుమారు చేశావ్.” అన్నాడు నవ్వుతూ.

“అంటే, హార్డ్ వర్కింగ్, లాయల్, స్టూడియెస్, మార్వెలెస్ హ్యూమన్ బీయింగ్...” అంటూ సందేహంగా ఆపాడు రస్క్.

అందరూ టక్కున జగదీశ్ వైపు వేళ్ళు చూపించారు.

“మల్లి, మై హీరో...నువ్వు, నువ్వు లేజీ, ఇర్రెస్పాన్సిబుల్, గ్యాంబ్లర్ వా...” నమ్మలేనట్టు అడిగాడు.

“హుమ్...ఈ జన్మకింతే బ్రదరూ, వదిలెయ్. ఎవరి నుదుటిమీద మీద ఏం రాసుందో...

నన్నిలా బతకమని ఆ ఖుదా ఆజ్ఞ!" అన్నాడు మళ్లి నిట్టూరుస్తూ.

ఆ టెన్షన్ కొంచెం తగ్గాక అందరూ డిన్నర్ చెయ్యడం మొదలు పెట్టారు. ఇందాకటి నుండి ఈ సంభాషణలు వింటూ సైలెంట్ గా ఉన్న స్వలా

"మీరు మాటి మాటికి ఎర్త్ వాళ్ళూ, ఎర్త్ మొహాలూ అనడం నాకు నచ్చలేదండీ." అన్నాడు రస్క్ వైపు చూస్తూ.

రస్క్ రిప్లై ఇచ్చే లోపు విశా అందుకోని "ఏమనుకోకండంకుల్, వీడికి కొంచెం 'ప్లానెట్ ఫీలింగ్' ఎక్కువ." అంది జాలిగా చూస్తూ.

"అదేం ఫీలింగూ?" అంది సునంద ఆశ్చర్యపోతూ.

"అదే ఆంటీ, ఎర్త్ మీద 'క్యాస్ట్ ఫీలింగూ', 'రిలిజియన్ ఫీలింగ్' లాగే ఇక్కడ చాలా మందికి ప్లానెట్ ఫీలింగెక్కువ. మార్స్ వాళ్ళే గొప్ప ఎర్త్ వాళ్ళ కన్నా అని..."

"వావ్, మన వాళ్ళు ఎక్కడికెళ్లినా మారరన్నమాట ఐతే" అన్నాడు రిషీ తల ఊపుతూ.

"చెప్పానుగా రిషీ ముందే, అదో వ్యసనం మనకి, వదిలెయ్." అన్నాడు.

రస్క్ చెయ్యి ముందుకి పెట్టి మార్స్ వాళ్ళ ప్లెడ్జ్ చెప్పాడు. అందరూ సైలెంటయిపోయారు.

"మార్స్ నా ఆత్మ, పరమాత్మ, జీవాత్మ...మార్స్ నుంచి నన్ను వేరు చెయ్యగలరేమో కానీ, నా నుంచి మార్స్ ని వేరు చెయ్యలేరు!" అనుకుంటూ బైటికెళ్లి పోయాడు.

18

పొద్దున్నే కీర్తి హడావిడి పెట్టింది అందరినీ. పెళ్ళి కి ఇంకా రెండు వారాలే ఉందని టెన్షన్ గా ఉంది అందరికీ. అసలే మార్స్ లో జరుగుతున్న తొలి తెలుగు పెళ్ళి ! అక్కడ అన్ని పనులూ వాళ్ళే చేసుకోవాల్సి ఉండటంతో, విశాకి, రిషీకి పెద్ద లిస్టిచ్చి చేసుకురమ్మంది. పనిలో పనిగా మార్స్ లో ఓ రౌండ్ వేసినట్టు ఉంటుందని రిషీని ఎంకరేజ్ చేసింది విశా. తనతో బైట పడటానికే చూస్తున్న రిషీ వెంటనే ఓకే చెప్పేశాడు.

పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఎక్కి కాలనీ సెంటర్ వైపు బయల్దేరారిద్దరూ. దార్లో రస్క్ కూడా కలిశాడు.

"ఔను విశా, ఎప్పట్నించో నిన్నోటడుగుదామనుకున్నా, ఆ ఎర్త్ నీకు ముందు అలవాటు లేదు కదా? ఎలా ఉన్నావక్కడ? ఆ పొల్యూషన్, పాలిటిక్స్, జనాలూ, ట్రాఫిక్...నో వే!"

"హలో బ్రో, నేనిక్కడే ఉన్నా? కనపడుతున్నానా? హలో" అన్నాడు రిషీ రస్క్ మొహం మీద చెయ్యాడిస్తూ.

"నువ్వుండు బాసూ, విశా నువ్వు చెప్పు ఎలా ఉన్నావ్ వన్ ఇయర్ అసలక్కడ?"

“తప్పు! తనుంది రెండేళ్లు బ్రో, వన్నియర్ కాదు.” అన్నాడు రిషీ నవ్వుతూ.

“అక్కడే నాకు మండేది మీ ఎర్త్ జనాలంటే, సెన్స్ లేకుండా. మార్స్ లో ఒన్ ఇయర్ అంటే ఎర్త్ లో టూ ఇయర్స్ బాసూ. కొంచెం స్లోగా తిరుగుతాంలే మేం సన్ చుట్టూ. అది తప్పితే అన్నిట్లో ఫాస్టే...డోంట్ అండర్ ఎస్టిమేట్ అజ్!”

“వావ్! మీ మార్స్ లెక్కలే వేరు బ్రో.” అన్నాడు రిషీ చేతులు రెండు పైకెత్తి లొంగిపోతున్నట్టు యాక్ట్ చేస్తూ.

అంతలో సడెన్ గా ఆ ట్రైన్ లాంటి వెహికిల్ ఆగింది. ఆ పక్కనే ఈ పెద్ద సర్కిల్, ఆ సర్కిల్ మధ్యలో ఓ స్టాట్యూ కనపడ్డాయి రిషీకి. రస్క్ ఆ విగ్రహం వైపే ఆరాధనగా చూస్తున్నాడు. మళ్ళీ ప్లెడ్జ్ నోట్లో గొణుక్కున్నట్టు వినపడింది రిషీకి.

“ఎవరిదీ స్టాట్యూ?”

“హేయ్, ఏంటా క్వశ్చన్. అసలు మార్స్ గురించి ఏం తెలీకుండా ఎలా వచ్చేస్తారు బాసూ? ఏం విశా ఈ ఎర్త్ లింగ్స్ కేం చెప్పలేదు?” అన్నాడు రస్క్ ఆశ్చర్యంగా చూస్తూ.

భుజాలెగరేసింది తను “నీ అంత బాగా నాకు రాదులే, యూ బీ ద గైడ్.”

“రిషీ, ఆ విగ్రహం ఎవరిదో కాదు – మార్సే కలగా తన జీవితాన్ని ధారపోసి, ఆ ఎర్త్ నుండి స్వాతంత్రం సంపాదించి పెట్టి, భావితరాలైన మాకు ఆదర్శంగా నిలిచిన మేధావి, మా ‘మార్స్ పిత’ – ఎలోన్ మస్క్ ది!” అన్నాడు కట్టలు తెగిన ఆవేశంతో. విశా అతని వీపు మీద రుద్ది కూల్ చెయ్యాల్సి వచ్చింది.

“ఓ మస్క్ దా, మా ఎర్త్ మీద అతణ్ణి ‘క్రాక్’ అంటారే?” అని నాలుక్కరుచుకున్నాడు రిషీ.

విశా కోపంగా చూసింది.

రస్క్ కోపంగా తన షర్ట్ స్లీవ్ పైకి లాగి భుజం మీద వేయించుకున్న ఎలోన్ మస్క్ టాటూ చూపించాడు. “మేమేం పిలుచుకుంటామో తెలుసా ఆ మహానుభావుణ్ణి – ‘మస్క్ తాత’ అని. మీ ఎర్త్ వాళ్లకి అర్థం కాలేదు కనకే ఆయన గొప్పోడయ్యాడు.” అన్నాడు కోపంగా.

కొంత సేపు ముగ్గురూ సైలెంట్ గా ఉన్నారు. ట్రైన్ కొన్ని టన్నెల్స్ లాంటివి దాటింది. చుట్టూ చీకటిగా ఉంది ఇంకొంత సేపు. “కొన్ని చోట్ల అండర్ గ్రౌండ్ లో వెళ్ళాలి ఇక్కడ.” అంది విశా.

“విశా, నీకు గుర్తుందా, మనం భూమ్మీద ఎంత ఫ్రీ గా బైటికెళ్ళగలిగే వాళ్ళమో, హాయిగా తిరిగ్గలిగే వాళ్ళమో, వెదర్ ని ఎంజాయ్ చేసే వాళ్ళమో...ప్చ్ ఇక్కడా ఛాన్స్ లేదు.” అన్నాడు జాలిగా.

“ఏదీ, ఎర్త్ మీదున్న పాయిజనస్ గాలి పీల్చుకోటానికి, పొల్యూటెడ్ వెదర్ లో తిరగడానికీ, మాస్కులు పెట్టుకొని మరీ బైటికెళ్లి ఎంజాయ్ చేసే వాళ్ళు కదా!” రస్క్ వెటకారం.

రిషీ అన్ని విషయాలూ లీక్ చేసేసినట్టు విశా వైపు అనుమానంగా చూశాడు.

"తనేం చెప్పలేదు బాసూ, మాకూ ఇక్కడ లైవ్ స్ట్రీమింగ్ ఛానెల్సున్నాయ్. ఎర్త్ లో ఏం జరుగుతుందో మొత్తం తెలుసిక్కడ!"

"మీ కన్నా లక్ష రెట్లు నయం మేము. మీరు జస్ట్ బైటికెళ్లి , డైరెక్ట్ గా సూర్యుణ్ణి చూసి, గట్టిగా రెండుసార్లు ఇక్కడి గాలి పీలిస్తేనే పోతారు." అన్నాడు రిషీ కసిగా.

పరిస్థితి చెయ్యి దాటి పోతోందని, విశా "కూల్, కూల్" అని సెటిల్ చేసింది ఇద్దరినీ. వాళ్ళ స్టాప్ రావడంతో ముగ్గురూ కిందికి దిగారు. ఎదురుగా ఉన్న బిల్డింగ్ ని చూస్తూనే రిషీ షాక్ తో అక్కడే నిలబడిపోయాడు.

ఆరు అంతస్తులున్న ఆ పెద్ద బిల్డింగ్ ముందు, వాల్ మీద పైనుంచి కింద దాకా ఓ పెద్ద డిజిటల్ కటౌట్ ప్రొజెక్ట్ అవుతోంది. యాభై అడుగుల హైట్ ఉన్న ఆ వర్చువల్ కటౌట్ లో, ఒక చేతిలో లేజర్ కొడవలీ, ఇంకో చేత్తో వైబ్రేనియమ్ శూలంతో, పరిగెత్తుకొస్తున్న 'అల్లు పరాక్రమ్'! కింద తన కొత్త సినిమా టైటిల్ మెరుస్తోంది ఎర్రగా – 'పగతో కాదు ప్రేమతో చంపేస్తా!'

"ఇక్కడ...ఇక్కడ...అల్లు పరాక్రమ్ ది..." రిషీ కంప్లీట్ చెయ్యలేకపోయాడు.

విశా "సర్ప్రైజ్!" అంది రిషీని టీస్ చేస్తూ.

రస్క్ "ఎర్త్ ఆర్ మార్స్...మా పరాక్రమ్ బయ్యా అదుర్స్!" అన్నాడు విజిలేస్తూ.

"నువ్వు...మా స్టన్నింగ్ స్టార్ ఫ్యాన్ వా..." అన్నాడు రిషీ ఆనందం పట్టలేక.

రస్క్, విశా ఒకళ్లనొకళ్లు చూసి నవ్వుకున్నారు పగలబడి.

"ఫ్యానా! కాదు బాసూ..." అని మళ్ళీ కటౌట్ పైకి చూపించాడు.

అక్కడ మెల్లగా "ఆల్ మార్స్ అల్లు పరాక్రమ్ ఫ్యాన్స్ అసోషియేషన్ – ప్రెసిడెంట్ రస్క్!" అని స్క్రోల్ అవుతోంది.

"బ్రో...కాంట్ బిలీవ్ ఇట్!" అన్నాడు రిషీ అమాంతం రస్క్ ని కౌగిలించుకుంటూ.

"చూస్తే, నువ్వు మన బ్యాచ్ లానే ఉన్నావ్." అన్నాడు.

"వీడికీ పిచ్చే మీ పరాక్రమ్ అంటే!" అంది విశా నవ్వుతూ.

"సూపర్ బాసూ. ఇది చాలు. ఫిదా అయిపోయా నీకు. ఇంక చూడు మార్స్ లో నీకు ఏది కావాలంటే అది చేస్తా." అన్నాడు రస్క్ హడావిడిగా.

"అవును బ్రో, అన్న ఎర్త్ లో స్టార్ కదా? నీకసలే ఎర్త్ంటే పడదు. మరెలా...?"

"ఊర్కో బాసూ, స్టన్నింగ్ స్టార్ కి ఎర్తేంటీ, మార్సేంటీ? ఆ మహానుభావుడు, గ్రేట్ యాక్టర్ 'అల్లు అర్జున్' తర్వాత, అంత క్రేజ్ ఉంది ఆయన మనవడు మన అన్నకే గదా. మనోడు ప్యాన్ యూనివర్స్ స్టార్, ఎప్పుడో ఇక్కడికి తెచ్చే ప్లాన్ గూడా చేస్తున్నాం." అన్నాడు రస్క్.

"ఎప్పుడంట ఈ మూవీ రిలీజ్, చాలా ఎక్సైటింగ్గా ఉంది ఫస్ట్ లుక్." మాటలు కలిపేశాడు రిషీ అలవోకగా.

"మరి మామూలు కాంబినేషనా చెప్పు? త్రివిక్రమ్ మోహన్ డైరెక్షన్లో, మన స్టన్నింగ్ స్టార్, పవర్ మెల్టింగ్ స్టారూ కలిసి ఫస్ట్ టైం వస్తోంది. రచ్చ రచ్చ చేశారంట. టాక్!"

"ఎంత పెట్టి తీసారో...?"

"మినిమం పది వేల కోట్లు బాసూ! మన్నోళ్ళ రెమ్యూనరేషనే ఓ థౌసండ్ క్రోర్సుంటది ఈజీగా!" అన్నాడు రస్క్ ముందుకి వంగుతూ.

"ఐనా నేను పర్సనల్గా మ్యానేజ్ చేసి, మార్స్ మీద డిజిటల్ రైట్సన్నీ కొనేసా. మూవీ డిస్ట్రిబ్యూట్ చేస్తోంది నేనే!" అన్నాడు చిలిపిగా నవ్వుతూ.

రిషీ ఏదో అనుకున్నాడు గానీ, రస్క్ లో ఇంత విషయం ఉందనుకోలేదు అంతకు ముందు.

ఇందాక దాదాపు కొట్టుకోబోయేంత పని చేసిన వాళ్ళే ఇప్పుడు "మార్సూ, ఎర్తూ భాయీ భాయీ" లా కలిసిపోవడం విశాకి చాలా హ్యాపీగా ఉంది.

"హలో...ఇక్కడ మూవీ కబుర్లు పెట్టుకుంటే, అక్కడ పెళ్ళి పనెవడు చేస్తాడు. రేయ్, ఇందుకేనా మమ్మీ నిన్ను హెల్ప్ చెయ్యమంది?" అంది కోపం నటిస్తూ.

"ఏ బలే దానివే, నీ పెళ్ళి, నా పెళ్ళి కాదా చెప్పు. అన్నీ పక్కాగా ప్లాన్ చేద్దాం. ఫస్ట్ స్టాప్ వెడ్డింగ్ డిజైనర్ అని చెప్పింది కదా ఆంటీ. లెట్స్ గో, ఐ నో ద వే." అంటూ హడావిడిగా ఈ గల్లీలోకి తీస్కెళ్ళాడు ఇద్దర్నీ.

🦋🦋🦋

రెండు, మూడూ స్ట్రీట్ లు తిరిగాక ఒక పెద్ద డోమ్ లోకి వెళ్ళారు ముగ్గురూ. రకరకాల చిన్న షాప్స్ లా ఉన్నాయందులో. చిన్న సైజ్ మాల్ లాగా ఉందది. కాతే అన్నీ ఒకే లెవెల్లో ఉన్నాయి.

ఓ కార్నర్ లో ఉన్న షాప్ వైపు నడిచాడు తను. దాని మీద "వన్స్ ఇన్ ఎ లైఫ్ – వెడ్డింగ్ డిసైనర్స్" అనుంది.

"అవును, వీళ్ళ దగ్గరికొచ్చినోళ్ళు అప్పుల్లో పడి మళ్ళీ రాలేరేమో ఇక్కడికి." అన్నాడు రిషీ నవ్వుతూ. రస్క్ ఇబ్బందిగా నవ్వాడు ఓ సారి వెనక్కి చూసి. విశా నోటి మీద వేలు పెట్టింది మెల్లగా "ష్!" అంటూ. రిషీ కేం అర్థం కాలేదు.

లోపలొక అమ్మాయి నించొని స్క్రీన్ వైపు చూస్తోంది సీరియస్ గా. కొంచెం బొద్దుగా, గ్లాసెస్ తో, జుట్టుకి పింక్ కలర్ డై వేస్కొని ఉంది. రష్క్ ని చూడగానే నవ్వి క్యాసువల్గా తనని హగ్ చేసుకుంది.

“హాయ్ రక్షా!” అంది విశా వెనకాలే. తనూ ‘హాయ్’ చెప్పింది కళ్ళెగరేస్తూ.

రిషీ వైపు డౌట్ ఫుల్ గా చూస్తూ – “యు ఆర్ ఫ్రమ్ ఎర్త్ రైట్!” అంది రక్ష. తలూపాడూ రిషీ.

“వెల్, ఇక్కడ మీ ఇద్దరి మీదా చాలా టాక్ నడుస్తోంది. బానే ఉన్నాడు.” అంది విశాకి కన్నుకొడుతూ.

“రిషీ, రక్షా ఈస్ ది బెస్ట్ మన కాలనీలో, ఇప్పటికో ట్వెంటీ వెడ్డింగ్స్ డిజైన్ చేసుంటుంది. కదా బేబీ.” అన్నాడు సిగ్గు పడుతూ. వచ్చినప్పటి నుండి ఎందుకో అతని పద్ధతి మారిపోయింది పూర్తిగా. ఫోకస్ అంతా ఆ అమ్మాయి మీదే పెట్టాడు. ఇద్దరి మధ్యలో ఏదో జరుగుతోందని అర్థమైంది రిషీకి.

“రక్షా, యూ నో రైట్. ఇది ఫస్ట్ తెలుగు వెడ్డింగ్ ఇక్కడ. మమ్మీ మంచి ట్రెడిషనల్ థీమ్ లో డిజైన్ చేయించమంది.” అంది విశా.

“డోంట్ వర్రీ డూడ్, అవన్నీ నేను చూస్కుంటా. వెడ్డింగ్ ప్లేసూ, థీమూ, మీ డ్రెస్సులు, ఫుడ్డూ అన్నీ ప్లాన్ చేద్దాం. కొన్ని క్వశ్చన్స్ అడుగుతాను, దాన్ని బట్టి ఐడియా వస్తుంది. ఓకే!” అంది థంబ్సప్ చూపిస్తూ. తలూపారు ముగ్గురూ.

“వెడ్డింగ్ ఇండోరా, ఔట్ డోరా? అంటే కాలనీ లోపలా, బైటా?”

“లోపలే. బైట కూడా చేస్తారా?”

“ఒకరిద్దరు చేస్కున్నారు. చాలా ఎక్స్పెన్సివ్ కాతే. అందుకే అడిగా.” అంది.

“వద్దులే రక్షా, బైటై తే తాళి కట్టడానికి గ్లోవ్స్ తీస్తేనో, జీలకర్రా బెల్లం పెట్టడానికి హెల్మెట్ తీస్తేనో అట్నించటే…” చెయ్యి పైకి చూపిస్తూ అన్నాడు రిషీ. విశా ఒక్కటిచ్చింది వీపు మీద.

“లోపలే చేద్దాం. నో ఇష్యూ. లోపలైతే ఎలాంటి సెట్టింగ్ కావాలో చెప్పండి. ఐలాండ్ సెట్టింగ్, మౌంటైన్ సెట్టింగ్, మైథాలజీ సెట్టింగ్, స్పేస్ క్రాఫ్ట్ సెట్టింగ్…ఇంకా చాలా ఉన్నాయ్, కానీ పాపులర్ వి చెప్పాను.” అంది తను గుక్క తిప్పుకోకుండా.

“సెట్టింగ్ మోడల్స్ చూడచ్చా?” అన్నాడు రిషీ కల్పించుకుంటూ.

“గుడ్ క్వశ్చన్!” అంటూ తను గాల్లో చేతులు ఆడించింది. తన ముందున్న టేబుల్ మీద ఒక త్రీడీ మోడల్ ప్రొజెక్టయ్యింది. ఒక్కొక్క సెట్టింగ్ లో హాల్ డిజైన్ ఎలా ఉంటుందో, వార్డ్ రోబ్ ఎలా ఉంటుందో అన్నీ క్లియర్ గా కనపడుతున్నాయి.

ఐలాండ్ సెట్టింగ్ చూస్తున్నారు. చుట్టూ నీలం రంగు సముద్రం, తెల్లటి ఇసుక తో, అక్కడక్కడా చెట్లున్న ఐలాండ్ మధ్యలో కొన్ని సీట్లు ఉన్నాయి. అందరూ ఇంట్రస్టింగ్ గా చూస్తున్నారు.

"మీకు సేమ్ సెట్టింగ్ వర్చువల్ గా వేస్తాం. అచ్చం మీరు బీచ్ పక్కనే కుర్చోని పెళ్ళి చేసుకున్నట్టు ఉంటుంది. ఇక్కడ మనకి దొరకదు కదా, అందుకే బాగా పాపులర్ ఇది." అంది రక్ష.

"ఎంత ఇది ప్రైస్."

"కొంచెం ఎక్కువే. గాలి బాగా తగులుతున్నట్టు వచ్చే ఫీల్ కోసం, ఫ్యాన్స్ వాడాలి. నీకు తెలుసుగా ఇక్కడ ఆక్సిజన్ రేట్లు..."

"హుమ్...వద్దులే ఐతే, ఆ మైథాలజీ సెట్టింగేంటో చెప్పు, వినటానికి బాగుంది." అంది ఉత్సాహంగా.

"పెద్ద ఫారెస్ట్ మధ్యలో, ఓ ఫోర్ట్ లో ఉంటుందా సెట్టింగ్. మీ వార్డ్ రోబ్ కూడా ప్రిన్స్, ప్రిన్సెస్ లాగా ప్లాన్ చేద్దాం. ఇంకా చాలా కస్టమైజ్ చెయ్యచ్చు. మీడియం కాస్ట్ ఆప్షన్."

"ఇది బుక్ చేస్కోండి...రిషీ వచ్చి నిన్ను చారియట్ లో ఎత్తుకుపోతుంటే, వెనకాలే మేమంతా ఛేస్ చేసుకుంటూ వస్తాం. థ్రిల్లింగ్ గా ఉంటుంది." అన్నాడు రస్క్ విరగబడి నవ్వుతూ.

రక్ష సీరియస్ గా చూసింది. ఎందుకులే రిస్కని బైటికెళ్లి పోయాడు రస్క్.

"అదే ఫిక్స్ చెయ్యి రక్షా ఐతే..." అంది విశా.

"కూల్...ఒక రెండు సోల్స్ లో కస్టమైజేషన్స్ కన్ఫర్మ్ చెయ్యగలవా? ఎక్కువ టైం లేదు కదా." అంది.

"ఒక త్రీ సోల్స్ టైం ఇవ్వు...డెఫినిట్ గా చెప్తా." అంది విశా.

రిషీ అయోమయంగా చూస్తున్నాడు ఇద్దరి వైపూ.

"ఎంటీ...త్రీ సోల్స్ అంటే త్రీ డేస్" అంది విశా రిషీ భాషలో చెప్తూ.

"వావ్! మార్స్ లో అంతా మార్చి పడేశారు. చాల ట్విస్టులున్నాయక్కడ." అన్నాడు రిషీ.

"మెల్లమెల్లగా అన్నీ తెలుస్తాయి లే..." అంటుంటే అప్పుడే బైటికెళ్లి న రస్క్ పెద్దగా అరిచాడు.

"బాసూ...బాసూ...రిషీ! ఓ సారి బైటికి రా అర్జంట్ గా. కొంపలంటుకున్నాయిక్కడ!"

## 19

రస్క్ అరుపులు విని రక్షా తో సహా అందరూ బైటికి పరిగెత్తారు. రస్క్ ఆ చిన్న సైజు మాల్లో పైన వేలాడదీసిన స్క్రీన్ వైపు నోరెళ్ళబెట్టి చూస్తున్నాడు. రిషీ తల పైకెత్తి ఆ స్క్రీన్ మీద కనపడుతున్న వీడియో చూసి షాక్ తిన్నాడు. విశా నోటిమీద చెయ్యి పెట్టుకుంది.

వీడియోలో కొంతమంది భీభత్సంగా గొడవ పడుతున్నారు, అరుస్తున్నారు కొంత మంది చుట్టూ చేరి – "మారో, ఓ ఎర్త్ వాలేకో..." అన్నాడొకడు.

"మారో...మారో..." జపం చేస్తున్నారు కొంతమంది.

వాళ్లందరి మధ్యలో చొక్కా చిరిగి, జుట్టంతా రేగిపోయి, టేబుల్ మీద వాలిపోయున్న మల్లి!

ఒకడెవడో దగ్గరికెళ్ళబోతే, ఎగిరి వాణ్ణి తోసేశాడు మల్లి. మళ్ళీ అరుపులు అంతా.

"బాబాయ్...బాబాయ్ అక్కడున్నాడేంటి? వాట్ ఈస్ హ్యాపెనింగ్!" అరిచాడు రిషీ అయోమయంగా. రస్క్ కి కూడా కంగారుగా ఉంది.

"బాసూ...అది తేడా గ్యాంగ్ బాసూ...దాంట్లో చాలామందికి క్రిమినల్ రికార్డుంది. మీ వాడ్ని అర్జంట్ గా సేవ్ చెయ్యకపోతే..."

"పద...పద...ఎక్కడది? ఆ లొకేషన్ తెలుసా నీకు?" అడిగాడు రిషీ కంగారుగా బైటికి పరిగెడుతూ.

"ఐ నో, ఇండస్ట్రియల్ జోన్...ఫైవ్ మినిట్స్ లో తీస్కెళ్తా." అని రస్క్ రిస్ట్ వాచ్ డైల్ తిప్పాడు. వెంటనే ఒక అటానమస్ కారొొచ్చి నిలబడింది ముందు. అందరూ దాంట్లోకి దూకారు. స్పీడ్ గా తీసుకొొచ్చి చెప్పిన బిల్డింగ్ ముందు దింపిందది. రస్కే ముందు పరిగెత్తి, ఆ గేట్ ముందు తన కళ్లని స్కాన్ చేసి డోర్ తీశాడు. అందరూ ఆ అరుపులు వస్తున్న వైపు పరిగెత్తారు. విశా అప్పటికే పోలీసులకి మెసేజ్ చేసింది. వాళ్ళకింకా టెన్ మినిట్స్ పడుతున్నట్టు మెసేజ్ వచ్చింది తన డివైజ్ లో.

లోపల రెండు అంతస్తులు కిందికి దిగాక ఒక మూల ఉన్న బేస్మెంట్ వైపు వెళ్ళారు ముగ్గురూ. ఆ తలుపుల్ని హఠాత్తుగా తోశాడు రిషీ పెద్దగా అరుస్తూ. ఆ సౌండ్ కి లోపలంతా సైలెంట్ గా మారింది. అందరూ వీళ్ళ వైపే చూస్తున్నారు. కొంతమంది చేతుల్లో బీర్ బాటిల్స్ లాంటివున్నాయి. ఇంకొంత మంది ఏదో స్మోక్ చేస్తున్నారు. లోపలంతా పోగా, వాసనలతో నిండిపోయింది.

**"బాబాయ్...బాబాయ్..."** అన్నాడు రిషీ లోపలికి నడుస్తూ.

మధ్యలో ఒకడు అడ్డంగా వచ్చి నిల్చున్నాడు. మీసాలు పెంచి, అచ్చం మార్స్ రౌడీలా ఉన్నాడు.

"తూ భీ ఎర్త్ సే ఆయా క్యా...చస్తావ్...పో పో!" అన్నాడు గద్దిస్తూ.

"వో చాహియే..." అన్నాడు రిషీ.

చుట్టూ అందరూ నవ్వారు.

"వో హమ్ కో భీ చాహియే రే...డబ్బులు, మనీ ఎవడిస్తాడు?" అన్నాడు వాడు.

రిషీకేం అర్థం కాలేదు. "బాబాయ్...బాబాయ్...ఏంటిది, ఏమైంది?" అన్నాడు రిషీ.

మెల్లగా మూలిగాడు మల్లి.

"బాబాయ్... ఏం చేసాడో...హమ్ బోలేగా. ఇక్కడ వచ్చాడు, మాతో ఫుల్గా గ్యాంబ్లింగ్ ఆడి, చీట్ చెయ్యబోయాడు...నహీ చోడేంగే..." అన్నాడు కోపంగా వేలు చూపిస్తూ.

"నేనేం చీట్ చెయ్యలేదురా...వీళ్ళే ఎర్త్ నుండి వచ్చానంటే, గేమ్ మార్చేసి నామీదేస్తున్నారు." నీరసంగా అన్నాడు మల్లి.

"కిత్నా, కిత్నా పైసా దేనా హై?" అన్నాడు రిషీ పర్స్ తీస్తూ.

"హజార్ కాయిన్స్...సంఝా...తౌసండ్ కాయిన్స్..."

అప్పుడర్థమైంది రిషీకి తన పర్స్ ఇక్కడ పనికి రాదని.

విశా వైపు చూశాడు. తన మొహం అంతా చెమట. రస్క్ అయోమయంగా చూస్తున్నాడు.

"నేను ఇప్పుడు కొన్ని కాయిన్సిస్తాను. లేటర్, మిగిలినవి." అంది విశా వాళ్ళతో.

"అప్నా సైంటిస్ట్ కీ బేటీ హై...కర్ దేగీ...జానేదో." అన్నాడో ముసలి గూండా.

వాడు తలూపాడు. తన అకౌంట్ నుండి 100 కాయిన్స్ పే చేసింది.

రిషీ వెళ్ళి మెల్లగా మల్లిని లేపి బైటికి నడుస్తున్నాడు.

"రేయ్...నీకు ఎర్త్ మీదే వార్నింగిచ్చాడు మా బాస్...అయినా వినకుండా వచ్చారు. వెనక్కి వెళ్ళే ఛాన్సే లేదు." అన్నాడు వెనక నుండి. రిషీ గిరుక్కున తిరిగి చూసినా ఎవడన్నాడో తెలీలేదు.

రస్క్, విశా హడావిడి పెట్టారు తనని బైటికి నడిపిస్తూ.

అప్పుడే వచ్చిన కాప్స్ కి సర్ది చెప్పి పంపించేశాడు మల్లి. కంప్లైంట్ ఇస్తే వాళ్ళు మళ్ళీ ఈ ఫ్యామిలీనేంచేస్తారోనని భయమేసి.

కార్లో కూర్చొని దార్లో ఒక కెఫేలో ఆగారు వాళ్ళ నలుగురూ. అక్కడ సెటిలయ్యాక అరిచినట్టు అడిగాడు రస్క్ – "కొంచెముంటే పైకి పోయే వాడివంకుల్! అయినా మార్స్ మొత్తం భయపడే రౌడీలూ, మాఫియా గ్యాంగు మెంబర్లూ, డ్రగ్ పెడ్లర్స్ వచ్చే ఆ క్లబ్బుకెందుకెళ్ళావ్?" అన్నాడు.

“మీరెళ్ళాక నాకు బోర్ గా అనిపించింది. మనకు తెలిసిన విద్య నలుగురితో పంచుకోవాలని దార్లో అడిగితే, ఇక్కడికెళ్ళమన్నారు. నాకేం తెలుసు, ఎదవలందరూ ఇక్కడే జేరతారనీ…”

“ఇతనితో ఇన్నాళ్ళూ ఎర్త్ మీద ఎలా ఉన్నారు బాసూ…పైగా పక్కనే పెట్టుకుని ఫుడ్డూ, బెడ్డూ అన్నీ అరేంజ్ చేశారు. మీ డాడీ మామూలు గ్రేట్ కాదు.” అన్నాడు రస్క్.

రిషీ ఆపుకోలేక అడిగాడు విశాని “సారీ, నీకు ట్రబులిచ్చాను. మనీ కూడా నువ్వే కట్టావ్. ఎంత ఆ కాయిన్స్ వాల్యూ?” అన్నాడు. విశా అతని చెయ్యి మీద చెయ్యేసింది.

“పర్లేదు చెప్పు.” అన్నాడు.

“థౌసండ్ మార్స్ కాయిన్లంటే దాదాపు కోటి రూపీస్ బాసూ.” అన్నాడు రస్క్ పెద్దగా.

నోరు తెరిచారు రిషీ, మల్లి ఇద్దరూ.

“అంత నా దగ్గర లేవు రిషీ!” అంది విశా బాధగా.

“బాబాయ్, ఇంతింత గ్యాంబ్లింగ్ లో ఎందుకు పెట్టావసలు?”

“నిజ్జంగా చెప్తున్నారా, నాకసలు వాటి వాల్యూనే తెలీదు. జనరల్ గా ఆ టేబుల్ దగ్గర ఎంత కాడతారు అనడిగా…హండ్రెడ్ కాయిన్సన్నారు. వాళ్ళే ఇచ్చారు తెచ్చి నేనింకా అడగకుండానే…అలా వస్తూ…పోతూ ఉంటే, నేనే రెండు వేల కాయిన్స్ గెలిచాను. తర్వాత ఎవడో అరవడం మొదలుపెట్టాడు, “ఎర్త్ నుంచి వచ్చి ఇక్కడ గెలుస్తున్నాడీడు.” అని. టెన్షన్ స్టార్టయ్యింది. అందరూ టార్గెట్ చేసి నన్ను ఓడించారు. చివరికి నేనింక ఆపేస్తానంటే, ఒకడొచ్చి నెట్టాడు. ఆట మానేసి, నా మీద పడ్డారందరూ…” అన్నాడు.

“సార్, మీరు సరదాగా బైటికొచ్చి మార్స్ ‘శరవణ భవన్’ లో మసాలా దోశ తిని ఇంటికెళ్లక, హవాలా గ్యాంగ్ చేతిలో తన్నులు తిని వెళ్తున్నారు. బై గాడ్స్ గ్రేస్! మేము ఆ స్క్రీన్ లో చూశాం కాబట్టి సరిపోయింది.” అన్నాడు రస్క్.

“వెయిట్, వెయిట్…అసలు ఇలాంటివి నేనెప్పుడూ లైవ్ స్ట్రీం చెయ్యడం చూడలేదు చిన్నప్పటి నుండి. ఫస్ట్ టైం ఇలా. అదీ నేను ఆన్‌లైన్లో, లైవ్ చెక్ చేసాను కానీ ఈ ఫీడ్ ఎక్కడా రాలేదు. చివరికి పోలీసులకి మనం చెప్తే కానీ తెలీలేదు. ఇదంతా మనల్ని బెదిరించడానికి ఎవరో మనకి మాత్రమే కనపడేట్టు ప్లాన్ చేశారు.” అంది.

“క్లబ్బులో వాడెవడో నీకు వార్నింగ్ ఇచ్చారన్నాడు. ఎర్త్ మీద ఎమ్మన్నా అయ్యిందా?” అడిగాడు రస్క్ అనుమానంగా. రిషీ తన మీద జరిగిన అటాక్ గురించి చెప్పాడు.

విశా మొహంలో భయం కనపడుతోంది. అందరూ కాసేపు సైలెంట్ గా ఉన్నారు.

"ఇక్కడ నువ్వంటే ఎవడికో ఇష్టం లేదు బాసూ." అన్నాడు రస్క్ అటూ ఇటూ చూస్తూ.

## 20

ఆ టెన్షన్లో అక్కడే కాసేపు కూర్చుండిపోయారు నలుగురూ. రస్క్ వెళ్ళి నలుగురికీ కాఫీ తెచ్చాడు.

వాళ్ళు నలుగురూ మాట్లాడుతున్నప్పుడే రస్క్ కి డోర్ వైపు చూసి హడావిడిగా

"మనం అర్జంట్ గా ఇక్కడ్నుంచి వెళ్ళి పోతే బెటర్! వెనక్కి చూడొద్దు, 'ఎందుకు?' అని అడగొద్దు ప్లీజ్." అని లేవబోయాడు.

మళ్లి క్యాజువల్ గా వెనక్కి తిరిగి చూసి "ఏ ఎవడొస్తున్నాడు?" అన్నాడు.

రస్క్ కి తనని పీక నొక్కి చంపెయ్యాలన్నంత కోపం వచ్చింది. కష్టం మీద ఆపుకున్నాడు. అంతలోనే అనుకున్నదంతా అయ్యింది.

ఒకతను హడావిడిగా వాళ్ళ వైపు వస్తున్నాడు. అతని ఫీచర్స్ రఫ్ గా ఉన్నాయి కానీ డ్రస్ మాత్రం ప్రొఫెషనల్ గా ఉంది. విశా చైర్ వెనకగా వచ్చి తన భుజం పట్టుకుని ఊపేస్తూ అన్నాడు

"దిస్ ఈస్ టూ మచ్ రా! నువ్వు ఎర్త్ నుండి వచ్చానని కనీసం చెప్పలేదు?" అన్నాడు.

విశా షాక్ తో లేచి నిలబడి అతడ్ని చూస్తోంది. ఎవరో రిషీకి అర్థం కాలేదు.

ఈ నిమిషం తర్వాత "కొంచెం బిజీగా ఉన్నా, జాబ్ అదీ, అందుకే..." అంది ఇబ్బందిగా.

"నన్ను అవాయిడ్ చేస్తున్నావా!" అన్నాడతను విశాని హగ్ చేస్కోవాలని ట్రై చేస్తూ.

విశా అతడ్ని మెల్లగా నెట్టేస్తూ "దిస్ ఈస్ రిషీ, రిషీ మీట్ ధనా!" అంది ఇద్దరినీ చూపిస్తూ.

"హేయ్ రిషీ! విన్నా నీ గురించి. 'ఎర్త్ నుండి ఎగురుకుంటూ వచ్చిన గ్రూమ్'" అంటూ పక్షిలా చేతులూపుతూ ఇమిటేట్ చేశాడు నవ్వుతూ.

రిషీకి చిర్రెత్తుకొచ్చింది. "హలో, బాస్! హూ ఆర్..."

"కట్ ఇట్ బ్రో, ఆపెయ్. అక్కడితో ఆపెయ్, నా గురించి ఎంత తక్కువ తెలుసుకుంటే అంత మంచిది నీకు." అన్నాడు గట్టిగా.

రస్క్ హెల్ప్ చెయ్యాలని చూస్తూ "బావా...ప్లీజ్..." అనబోయేంతలో.

"నువ్వాపరా...డబుల్ క్రాసింగ్ ఏజెంట్! నువ్వైనా చెప్పచ్చుగా ఇది దిగిందని ఎర్త్ నుండి." అన్నాడు ధనా తిడుతున్నట్టు. నోరు మూసుకున్నాడు రస్క్.

“బేబీ, లే, ఓ సారి నీతో ప్రైవేట్ గా మాట్లాడాలి. ఇక్కడ కాదు. నాకో స్పెషల్ లౌంజ్ ఉంది బ్యాక్ సైడ్…లెట్స్ గో!” అంటూ తనని చెయ్యి పట్టుకొని లాక్కెళ్ళబోయాడు.

విశా ఏడవటం మొదలుపెట్టింది. రిషీ వాళ్ళకెదురుగా వచ్చి ధనా చెస్ట్ ని పుష్ చేస్తూ, విశా చేతిని లాక్కున్నాడు.

ఒక్క క్షణం ఆగి ధనా కోపంతో రిషీ కాలర్ పట్టుకోని మొహం మీద కొట్టబోయాడు.

“ఆగండి!” అరిచింది విశా కళ్ళు మూసుకోని. ఇద్దరూ ఆగిపోయారు దూరంగా జరిగి.

“బేబ్స్, జస్ట్ టైం ఫర్ అస్ టు టాక్. దానికి ఇంత సీనా, వీడేదో హీరోలా…” అన్నాడు ధనా.

“రిషీ, ఇట్స్ ఓకే, ఐ నో ధనా! ఒక టెన్ మినిట్స్ లో వచ్చేస్తాను. ఇట్ విల్ బీ ఫైన్.” అంది విశా.

రిషీ కళ్లతో ‘వద్దు’ అని చెప్తున్నా, పర్లేదన్నట్టు చెయ్యి చూపిస్తూ ధనాతో బైటికెళ్లి పోయింది తను.

రిషీకంతా అయోమయంగా ఉంది. తన కోపం ఇంకా తగ్గలేదు. బుర్రలో వందల ప్రశ్నలు!

“అసలేం జరుగుతోందిరా ఇక్కడ?! ఎవరన్నా చెప్పి చస్తారా?” అరిచాడు మళ్లి. ఇద్దరూ రస్క్ వైపు చూశారు. ఇబ్బందిగా మొహం పెట్టాడు రస్క్, ‘చెప్పక తప్పదా?’ అని.

“బాసూ, నేనూ, విశా నీతో ఈ విషయం చెప్పకుండా దాచిపెట్టాం. ధనా గాడు. మా ఇద్దరికీ కామన్ ఫ్రెండ్ వాడు. కాలేజ్ లో వాడు వేరే బ్యాచ్ తో కలిసి డ్రగ్స్ కి అలవాటు పడి తేడాగా తయారయ్యాడు. సడెన్ గా లాస్ట్ ఇయర్ వచ్చి విశాకి ప్రపోజ్ చేశాడు. తను షాక్ తింది. తిట్టింది వాణ్ణి. ఫ్రెండ్స్ గా ఉంటూ అలా ఎప్పుడూ ఊహించుకోలేదంది. అయినా వాడు చేస్తున్న పన్లకీ, తిరిగే తిరుగుళ్ళకీ సపోర్ట్ చెయ్యనని గట్టిగా అరిచింది. వాడు ఏడ్చాడు ఆ రోజు. కానీ తర్వాత నుండి శాడిస్ట్ లా విశాని ఇబ్బంది పెట్టడం మొదలుపెట్టాడు. చివరికి వాడి బాధ తట్టుకోలేక, విశా చదువు పాడవుతుందని, వాళ్ళ నాన్న మహా రిక్వెస్ట్ పెట్టుకొని మరీ తనని ఎర్త్ కి పంపాడు. అక్కడే తనూ, నువ్వూ…” అని ఆపాడు రస్క్.

విశా ఇదంతా తనకి చెప్పకపోవడం కోపంగా ఉంది రిషీకి.

“తన గతం తవ్వు కోవడం ఇష్టం లేక చెప్పలేక పోయిందేమో.” అని సర్దిచెప్పుకున్నాడు.

“ఆ ధనా గాడి మీద అప్పుడు కాకపోతే, ఇప్పుడు కంప్లైంట్ ఇవ్వచ్చు కదా పోలీసులకి?” అన్నాడు రిషీ పెద్దగా.

రస్క్ గాభరాగా అటూ, ఇటూ చూస్తూ “చిన్నగా బాసూ, మనందర్నీ కుమ్మేస్తారు. వాడి జనాలు ఎక్కడైనా ఉండచ్చు.” అన్నాడు.

“ఆడేమన్నా పెద్ద ఫేమస్ పర్సనాలిటీనా ఇక్కడ?” అన్నాడు మళ్లి.

"ఇన్ ఫేమస్ పర్సనాలిటీ! హైలీ డేంజరస్! విశా లేని ఈ మూడేళ్లలో, ధనా బాగా ఎదిగాడు. ఇల్లీగల్ మైనింగ్, మార్స్ లో రిజిస్టర్ కాని ప్లాట్స్ ని అమ్మేయడం, కొత్త కొత్త డ్రగ్స్ అమ్మడం, రెండు ప్లానెట్ల మధ్య స్మగ్లింగ్! ఇలా వాడి బిజినెస్ విపరీతంగా పెంచేశాడు. ఈ మధ్య ఎంతకి తెగించాడంటే, ఒక ఆస్టరాయిడ్ మీద వాల్యుబుల్ డైమండ్ మైన్స్ ఉన్నాయని కనిపెట్టి దాని మీద ఇల్లీగల్ మైనింగ్ చేయిస్తున్నాడు. గవర్నమెంటూ, పోలీసులూ, సైంటిస్టులూ... ఇలా చాలా మందిని మానేజ్ చేస్తున్నాడు. ఇక్కడే కాదు భూమ్మీద కాదు చాలా మంది పొలిటీషియన్స్ తో, స్మగ్లర్లతో డీలింగ్సున్నాయి వాడికి. వాడిచ్చే వాటాలు కళ్ళు తిరిగేలా ఉండటంతో, ఎవడూ వాణ్ణేమీ అనలేరూ, చెయ్యలేరూ." గుక్క తిప్పుకోకుండా చెప్పాడు రస్క్.

ఇంత పెద్ద నెట్‌వర్క్ లో ఇరుక్కున్నామని ఊహించలేదు రిషీ. అతని మైండంతా బ్లాంక్ గా ఉంది.

"వీడేంటి రిషీ, అమెరికన్ ఇంటెలిజెన్సూ, ఇండియన్ మాఫియా కలగలిపిన హైటెక్ మార్స్ గూండా లా ఉన్నాడు." అన్నాడు మల్లి మెల్లగా.

వాళ్ళు తేరుకునేంతలో విశా ఆ టేబుల్ దగ్గరికి వస్తోంది నడిచి. రిషీ పరిగెత్తుకుంటూ వెళ్ళి తనని కౌగిలించుకొని "ఆర్ యూ ఆల్ రైట్!" అన్నాడు ఆమె కళ్ళల్లోకి చూస్తూ. ఏడ్చినట్టు స్పష్టంగా తెలుస్తోందా మొహంలో.

"గట్టిగా బెదిరించాడు వాడీ పెళ్ళి చేస్కోవద్దని. ఎంత దూరమైనా వెళ్తానన్నాడు. నేను స్ట్రాంగ్ గానే చెప్పాను. 'నాకు నువ్వు అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ ఇష్టం లేదు నీ మీద.' అని. కొంత సేపు సైలెంట్ గా బాధపడ్డాడు. చివరికి 'ఈ పెళ్ళెలా అవుతుందో నేనూ చూస్తా!' అని అరుస్తూ వెళ్ళి పోయాడు." అంది.

ఆ సంఘటనతో బాగా షేకయ్యారు అందరూ. రిషీకి ఆ రాత్రంతా కొత్త అనుమానాలు రావడం స్టార్ట్ అయ్యాయి.

## 21

ఆ రోజు జరిగిన రెండు సంఘటనలూ ఇంట్లో ఎవరికీ చెప్పలేదు వాళ్ళు. ఓ రెండ్రోజుల పాటు ఇల్లు కదలకుండా ఉండిపోయారు. తన ఎర్త్ ఫ్రెండ్స్ నడిగి ఆ డబ్బులెలాగో సెటిల్ చేస్తానన్నాడు మల్లి.

తర్వాతో రోజు కీర్తి కొన్ని మ్యారేజ్ సరుకులు తెమ్మని బలవంతం చెయ్యడంతో ఇద్దరూ కొంత భయ పడుతూనే వెళ్ళారు బైటికి. మల్లి ఇంట్లోంచి మళ్ళీ బైటికి అడుగు పెట్టకుండా తన మీద ఒట్టేయించుకున్నాడు రిషీ. తనేసే ఒట్టు మీద పెద్ద నమ్మకం లేక, సీక్రెట్ గా మల్లి పాకెట్లో ఓ జీపీఎస్ ట్రాకర్ కూడా పడేశాడు!

విశా వాళ్ళ బ్లూ వెహికిల్ తెచ్చింది. కాలనీలో 'హిందూ టెంపుల్' వైపు బయల్దేరారిద్దరూ. ఈ సారి దారిలో చాలా చిన్నా, పెద్దా రోబోట్స్ కనపడ్డాయి రిషీకి. అది 'వాటర్ జనరేషన్ జోన్' అంది విశా. తర్వాత దాదాపు ఒక మైల్ పొడవున్న

ఒక నర్సరీ ముందు నుండి వెళ్ళారు. రకరకాల చెట్లూ, పళ్ళూ కనపడ్డాయి. సాయిల్ అవసరం లేని 'హైడ్రోపోనిక్ ప్లాంట్స్' అని ఎక్స్ప్లైన్ చేసింది తను. ఎర్త్ మీద కన్నా చాలా ఎక్కువ టెక్నాలజీ, డిసిప్లిన్ కనపడింది మార్స్ లో రిషీకి.

"ఎవరు చిన్న తప్పు చేసినా అందరూ రిస్కులో పడతారిక్కడ, సో ఎక్కడికక్కడ సెన్సార్లు, అలారమ్సూ, కెమెరాలూ ఉంటాయి." అంది.

చివరికి ఒక కాంపౌండ్ చేరుకున్నారిద్దరూ. 'రెలిజియస్ జోన్' అని రాసుంది బయట. లోపల ఒక వైపుగా, చిన్న గుడి లోకి అడుగు పెట్టాక చాలా ప్రశాంతంగా అనిపించింది రిషీకి. దణ్ణం పెట్టుకున్నారిద్దరూ. రిషీ వాళ్లమ్మ చెప్పిన లిస్ట్ చూట్టం మొదలుపెట్టాడు. అంతలో మెల్లగా ఆ గుడి పురోహితుడు లోపల్నుంచి బైటికొచ్చాడు. అరవైల్లో ఉంటుందతని వయసు. సన్నగా, పొడుగ్గా ఉన్నాడు తెల్ల కుర్తా, పైజమాలో.

"హలో విశా, మహా ఎలా ఉన్నాడు? చాలా రోజులైంది కలిసి మీ ఫ్యామిలీని." అన్నాడాయన.

"ఆల్ ఫైన్, అంకుల్! మీట్ మై ఫియాన్సే రిషీ, రిషీ మీట్ మై డియర్ అంకుల్ నటేష్, ఇక్కడ పూజారిగా చేస్తున్నారు." అంది నవ్వుతూ.

"నమస్తే అంకుల్! మా మ్యారేజ్ నెక్స్ట్ వీక్ ప్లాన్ చేశాం. ఈ లిస్ట్ కొంచెం చూస్తారా?" అన్నాడు లిస్ట్ చూపిస్తూ.

అది తీస్కొని పక్కన పెడుతూ "అది చూద్దాం కానీ, ముందు ఇది చెప్పు. మీ మ్యారేజ్ కి ముహూర్తం ఎక్కడ, ఎవరు పెట్టారు?" అన్నాడు నటేష్.

"అది భూమ్మీద మాకు తెలిసి జ్యోతిష్యుడు స్వలా అనీ...అక్కడే పెట్టాడు ఆయన. ఎందుకంకుల్?" అన్నాడు రిషీ.

"ఏం లేదు. భూమ్మీద ముహూర్తం ఎలా పెడతారో తెలుసా నీకు?" అన్నాడు సూటిగా.

తల అడ్డంగా ఊపారిద్దరూ.

"చంద్రుణ్ణి చూసి అక్కడ తిథులూ, నెలలూ ప్లాన్ చేస్తారు. ఆ చంద్రుడి మూవ్ మెంట్ బట్టే ముహూర్తం కూడా ఉంటుంది."

"ఓ ఓకే, ఇప్పుడేమన్నా ప్రాబ్లమా అలా చేస్తే?" అర్థంకాలేదు ఇద్దరికీ.

"అవును, ప్రాబ్లం ఉంది. ఇక్కడ, మార్స్ మీద ఆ ముహూర్తం పని చెయ్యదు."

షాక్ తిన్నారిద్దరూ ఆ మాటకి.

"అదేంటంకుల్!" అన్నాడు రిషీ.

"ఒక సారిట్రా, వచ్చి పైకి చూడు! అన్నాడు టెంపుల్ పక్కనున్న ఒక గ్లాస్ సీలింగు కిందికి తీస్కెల్తూ."

రిషీ కి ఎర్రగా మార్స్ ఆకాశం కనపడుతోంది. ఉన్నట్టుండి చంద్రుడి కన్నా డబుల్ సైజున్న గ్రహం ఒకటి ఆకాశంలో అలా వెళ్ళి పోతోంది.

"ఏంటది, ఆస్టరాయుడా? మార్స్ మీద పడబోతోందా? అందుకేనా మా ముహూర్తం వర్కౌటవ్వదన్నారు?" అన్నాడు కంగారుగా రిషీ.

"రిలాక్స్, అది ఆస్టరాయుడో, తోకచుక్కో కాదు. మూన్! మార్స్ ఉపగ్రహం 'ఫోబోస్' " అన్నాడాయన.

"అదేం పేరు?" అన్నాడు రిషీ నచ్చనట్టు గా ఫేస్ పెట్టి.

"ఇప్పుడది ఇంపార్టెంట్ కాదు! ఎర్త్ తన చుట్టూ తను తిరగడానికి ఒక రోజు పడుతుంది. చంద్రుడు ఎర్త్ చుట్టూ తిరగడానికి షుమారు 30 రోజులు పడుతుంది. అంటే భూమ్మీద ఒక నెల అంటే, ఒక రోజు కన్నా ఎక్కువ. రైట్?" అడిగాడు నటేష్.

తలూపాడు రిషీ.

"ఇక్కడ మార్స్ కూడా తన చుట్టూ తను తిరగడానికి షుమారు భూమ్మీద లాగే 24 గంటలు పడుతుంది, కానీ ఆ ఫోబోస్ మార్స్ చుట్టూ తిరగడానికి 8 గంటలే పడుతుంది. అంటే మార్స్ నెల, మార్స్ రోజు కంటే తక్కువన్న మాట!" అన్నాడు అసహనంగా చేతులు పైకెత్తేస్తూ.

రిషీ పరిస్థితి దారుణంగా ఉంది. అర్థం అయ్యీ అవ్వనట్టుగా ఉంది.

విశాకి ఇవన్నీ తెలుసు గానీ, దీనికి ముహూర్తానికీ సంబంధం ఏంటో అర్థం కాలేదు. అదే అడిగింది.

"ఆ అదే...అక్కడికే వస్తున్నా. భూమ్మీద నెల రోజులు చుట్టూ తిరిగే చంద్రుణ్ణి బేస్ చేస్కోని తయారుచేసిన పంచాంగం తో పెట్టిన ఈ ముహూర్తం, రోజుకి మూడు సార్లు చుట్టూ తిరిగేసే ఉపగ్రహం ఉన్న మార్స్ మీద ఉపయోగించలేం. ఇట్ డస్ నాట్ వర్క్ దట్ వే!" అన్నాడు తల విదిలిస్తూ.

"ఈ ముసలోడు మొదటికి మోసం తెచ్చేట్టున్నాడు." అని గొణిగాడు విశాతో. తను కళ్ళురిమింది.

"ఏం చేద్దాం అంకుల్ ఐతే?" అంది.

"నేను మార్స్ పంచాంగం తయారు చేసే పనిలో ఉన్నాను, ఒక రెండేళ్లలో అయిపోవచ్చు వర్క్ అంతా. అప్పుడు పెట్టుకుందాం ముహూర్తం. వాట్ డూ యూ సే!" అన్నాడు.

"పాపం! అంకుల్ ఎక్కువ ఆలోచించీ, చించీ పిచ్చోడైపోయినట్టున్నాడు." మళ్ళీ రిషీ గుసగుస.

ఇప్పుడు విశాకీ కోపమొచ్చింది ఆయన మీద.

"మీ దగ్గర పంచాంగం లేకపోతే, ఈ గుడిలో దేవుడికి పూజలూ, ఉత్సవాలూ ఎలా చేస్తున్నారు?" అడిగింది తేల్చుకుందామని.

ఆయన కొంత సేపు ఇబ్బంది పడి "యూ నో, నేను నాసాలో ఓ సైంటిస్టుగా వర్క్ చేసేవాడిని. నాకున్న నాలెడ్జ్ తో అప్పట్లో ఇక్కడున్న ఇండియన్స్ కి చిన్న చిన్న పూజలూ అవీ చేయించే వాణ్ణి. చివరికి మనోళ్ళందరూ కలిసి ఏం తేల్చారంటే, నేను సైంటిస్ట్ గా చెయ్యక పోయినా పెద్ద నష్టం లేదు గానీ, పూజారిగా చెయ్యక పోతే హ్యూజ్ లాస్ అని చెప్పి, నన్ను బతిమాలి ఇక్కడ పడేశారు." అన్నాడు బాధగా.

"అంతేకదంకుల్, పూజారులకి ఇప్పుడు హై డిమాండుంది ఎర్త్ మీద కూడా. ఆ జాబ్ కి వేకెన్సీస్ బాగా హై, అప్లికేషన్స్ బాగా లో మరి!" అన్నాడు రిషీ మధ్యలో దూరుతూ.

"ఇంతకీ మీరు నా ప్రశ్నకి రెస్పాన్స్ ఇవ్వలేదు?" అంది విశా చేతులు కట్టుకుంటూ.

"హుమ్...ప్రస్తుతం భూమ్మీద జరిగే టైం కే చేస్తున్నాను పూజలన్నీ, కానీ ఎందుకో అది కరెక్టనిపించట్లేదు."

"ఇట్స్ ఓకే అంకుల్. ప్రస్తుతానికి మా పెళ్ళి కూడా భూమ్మీద టైంకే కానివ్వండి. మీ పంచాంగం వచ్చాక, మొట్టమొదటి ముహూర్తం మీరు మాకే పెట్టండి. మా పాపకో, బాబుకో మంచి ఫంక్షన్ చేద్దాం దాంతో. ఏమంటారు?" అంది విశా.

చాలా ఎక్సైటయిపోయిడు ఆ మాటలకి నటేష్. కళ్ళల్లోంచి దాదాపు ఆనంద భాష్పాలొచ్చేంతగా!

ఆ సంతోషంలో వాళ్ళడిగిన సరుకులన్నీ టకటకా అరేంజ్ చేసేశాడాయన ఎక్కువ గొడవ పెట్టకుండా.

ప్రస్తుతానికీ ట్రబుల్ నుంచి తప్పించినందుకు, విశాకి చాటుగా థంబ్సప్ చెప్పాడు రిషీ.

## 22

పెళ్ళి పనులు హడావిడిగా సాగుతున్నాయి మహా ఇంట్లో. నీలూ ఇంట్లో ఉండి సెల్ఫీలు తీసుకోవడం బోర్ కొడుతోందని కంప్లైంట్ చెయ్యడంతో, ఓ సారి రిషీ, నీలూ, విశా కలిసి 'అల్లు పరాక్రమ్' మూవీకెళ్ళొచ్చారు. జగదీశ్, సునందలకీ ఇంట్లో ఉండీ, ఉండీ చిరాగ్గా ఉంది. అది అబ్జర్వ్ చేసిన మహా ఓ రోజు రాత్రి అందరికీ ఓ గుడ్ న్యూస్ చెప్పాడు –

"రేపు సాయంత్రం అందరం ఓ ఫంక్షన్ కెల్తున్నాం. రెడీగా ఉండండి." అని.

"ఎవరిదన్నా పెళ్లా...?"

"మీ రిటైర్మెంటా...?!"

"ఏదో పంచెల ఫంక్షనే మో..."

"నో, నో, మా యాన్యువల్ మార్స్ సెలబ్రేషన్...ప్రతి ఏడూ చేసుకుంటాం. మా మార్స్ ప్రెసిడెంట్ రాబర్ట్ మస్క్ నన్ను పర్సనల్ గా పిలిచారు తప్పకుండా రమ్మని. బాగుంటుంది ఓ పండగలాగా." అన్నాడు మహా, క్రౌడ్ ని కంట్రోల్ చేస్తూ.

"అదే వదినా...మనూళ్ళో ప్రతేడూ ఉరుసు పండగ జేస్తారు చూడూ...బైట దారంతా పిల్లలకి ఎక్స్-బాక్స్ లూ, ప్లేస్టేషన్లూ అమ్ముతుంటారూ, రోడ్లమీద పెట్టుకోని...అలాంటి పండగన్న మాట!" అన్నాడు మల్లి బాగా దగ్గరుండి చూసినట్టు.

అందరూ ఎర్రటి కళ్లతో నిప్పులు చిమ్మారతనిమీద.

❧❧❧

తర్వాతి రోజు అందరూ కాన్ఫరెన్స్ కోసం ఆ కాలనీ సెంటర్ కి వెళ్ళారు. పెద్ద 'ఎలోన్ మస్క్' విగ్రహం ఉన్న సెంటరే అది. ఆ పెద్ద ఓపెన్ ఏరియాలో అప్పటికే కొన్ని వేల మంది పోగయ్యారు. మధ్యలో ఎత్తులో ఒక చిన్న స్టేజ్ ఉంది. చుట్టూ చాలా స్టాల్స్ కట్టున్నాయి. జనాల్లో చాలా మంది వాళ్ళ, వాళ్ళ దేశాల ట్రెడిషనల్ డ్రెస్సులో ఉన్నారు. దూరంగా ఒక గ్రూప్ చీరలూ, చూడీదార్లతో మెరిసిపోతోంది. సునందా వాళ్ళు చాలా ఎక్సైట్ అయ్యారు అటు వైపు వెళ్దామని.

దారిలో జగదీశ్ "ఇండియన్స్ చాలా మందే ఉన్నారండీ ఇక్కడ!" అన్నాడు మహాతో.

"మనదే ఇప్పుడు టాప్ గ్రోయింగ్ కమ్యూనిటీ ఇక్కడ." అన్నాడు మహా.

"ఇక్కడేంటి? ఎక్కడైనా మనదే టాప్ గ్రోయింగ్. అస్సలు తగ్గేదేలే." అన్నాడు మల్లి తొడ కొడుతూ.

"అంతే కాదు, మన తెలుగు వాళ్ళు కూడా ఎక్కువే." అన్నాడు మహా మల్లిని పట్టించుకోకుండా.

"అవునా! రేయ్ రిషీ, 'మార్సుని ముంచేస్తున్న మన తెలుగోళ్లు' అనే ఎపిసోడ్ టీవీ లో ఎప్పుడూ చూడలేదే భూమ్మీద నేను?" అన్నాడు మల్లి సందేహంగా.

"వేసే ఉంటారు. మీరా దరిద్రపు 'నేరాలూ – ఘోరాలూ' సీరియల్లో వెతక్కూడదు ఇలాంటివి." అంది పిన్ని. అందరూ నవ్వారు.

లక్కీగా సునందా వాళ్ళు కూడా శారీస్ లో ఉండటంతో ఆ ఇండియన్ గ్రూప్ లో ఈజీగా కలిసిపోయారు. మల్లి మెల్లగా తప్పించుకోని ఫుడ్డు దగ్గర చేరాడు. ఎక్కడా డ్రింక్స్ కనబడలేదు తనకి. "అసలే ఇక్కడ జనాలు సగం గాల్లో తేలుతుంటారు. ఫుల్లుగా తాగితే పైకెగిరిపోతారని మందు ముట్టుకోని చావరేమో!" పళ్ళ మధ్యలో తిట్టుకున్నాడు. ఏదో ఒకటి దొరికింది లే అని పొటాటో ఫ్రైస్ లాంటివి తీసుకుని తింటున్నాడు.

"ఏంటంకుల్ మళ్ళీ ఏదన్నా ప్లాన్ లో ఉన్నారా?" అన్నాడు రస్క్ వెనక నుండి నవ్వుతూ.

"నా బొంద ప్లాన్. ఆ రోజిచ్చిన షాక్ తో మళ్ళీ ఆ మాఫియా ముఠా కనపడకుండా అండర్ గ్రౌండ్ లో కెళ్ళి పోయా. మళ్ళీ ఇన్నాళ్ల తర్వాత బైటికి రావల్సొచ్చింది." అన్నాడు అటూ ఇటూ చూస్తూ.

"డోంట్ వర్రీ, ఇక్కడికి రాదులే ఆ గ్యాంగ్. అయినా మీరు కాయిన్స్ కట్టేశారు గా. విశా చెప్పింది."

మల్లి ఫుడ్డు మీద ఫోకస్ చేశాడు.

"ఎంటీ, ఇక్కడి పొటాటోస్ టేస్టీగా ఉన్నట్టున్నాయ్ మీకు?" అన్నాడు చిలిపిగా.

"ఏదో డిఫెరెంట్ గా ఉన్నాయి. ఇంత మంచి టేస్ట్ మాకు రాదు ఎర్త్ మీద." అన్నాడు ఇంకో రెండు నోట్లో వేసుకుంటూ.

"యా యా, తేడాగానే ఉంటాయి. హ్యూమన్ వేస్ట్ ని ఎరువుగా వేసి పండిస్తాం మరి."

మల్లి నములుతున్న నోటిని ఆపి షాకింగ్ గా చూశాడు.

"అంటే...అంటే...ఇవి..." భయం భయంగా అడిగాడు.

"అవును బాత్రూం లోంచి డైరెక్ట్ గా మన వేస్ట్ ని ఫిల్టర్ చేసి, పొటాటోలు పండించే ఫాం లోకి పంపిస్తారు. మంచి న్యూట్రియెంట్స్ ఉంటాయంట." అన్నాడు భుజాలెగరేస్తూ.

మల్లి ఆ ప్లేట్ ని అక్కడే పడేసి, అరచుకుంటూ బాత్రూం వైపు పరిగెత్తాడు.

జగదీశ్, సునందలు మిగతా ఇండియన్స్ తో మాట్లాడుతున్నారు. అందరూ ఆసక్తిగా వాళ్ళు చెప్పు భూమ్మీది విశేషాలు వింటున్నారు. దూరం నుండి మహా ఒక అరవై ఏళ్ళ పెద్దాయనతో వీళ్ళ వైపే వస్తున్నాడు. అమెరికన్ లా ఉన్నాడాయన. తెల్లటి సూట్ లో, తెల్లటి జుట్టుతో మెరిసిపోతున్నాడు. దగ్గరికొస్తూనే ఆయన జగదీశ్ కీ, సునందకీ షేక్ హ్యాండిచ్చాడు. పక్కనే ఉన్న రిషీ ని సగం హగ్ చేసుకున్నాడు.

**"వెల్ వెల్...వావ్...**మహా మీ గురించి అంతా చెప్పాడు. మీ గురించి మీకన్నా ఇప్పుడు నాకే ఎక్కువ తెలుసనుకుంటా." అని నవ్వాడు. అందరూ నవ్వారు.

ఆయన మాటలో, ముఖంలో ఏదో ఠీవి కనపడుతోంది. ఇంకొంత మంది చుట్టూ చేరారు.

"మా మార్స్ ప్రెసిడెంట్, రాబర్ట్ మస్క్. మా 'ఫాదర్ ఆఫ్ మార్స్' ఎలోన్ మస్క్ కొడుకు." అని పరిచయం చేశాడు మహా ఉత్సాహంగా. అందరూ చప్పట్లు కొట్టారు.

"హేయ్, మహా...యూ నో ఐ డోంట్ లైక్ ఫార్మాలిటీస్!" అన్నాడాయన చిరు కోపంతో.

"ఐ నో, ఐ నో..."

రిషీ వైపు చూస్తూ “వెల్, యంగ్ మ్యాన్, నువ్వు కూడా సాయిల్ సైంటిస్ట్ వని విన్నాను. స్టడీడ్ విత్ అవర్ ఓన్ విశా హియర్.” అన్నాడు తన చేతిలో చెయ్యి వేస్తూ.

“అవును సర్, మేమిద్దరం, ‘నేలని సక్సెస్‌ఫుల్ గా మళ్ళీ సారవంతంగా ఎలా చెయ్యాలి?’ అనే విషయం పై రీసెర్చ్ చేశాం. మా రీసెర్చ్ లో చాలా కొత్త ప్రపోసల్స్ కూడా చేశాం.” అన్నాడు రిషీ ఉత్సాహంగా.

“దట్స్ గ్రేట్! మీ లాంటి వాళ్ళే మార్స్ కి కావాలి. విశాకి ఆల్ రెడీ మేము మా అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ లో సైంటిస్టుగా జాయిన్ చేస్కుంటున్నాం. నువ్వు కూడా నీ రీసెర్చ్ తో ఇక్కడ డెవలప్ చెయ్యచ్చు కదా!” అన్నాడు చుట్టూ చూస్తూ.

చాలా మంది తలూపుతున్నారు. మహా, కీర్తికి కూడా ఆనందంగానే ఉంది.

“సారీ సర్, ఎర్త్ మీద కూడా నా అవసరం చాలా ఉంది. మీకు తెలిసే ఉంటుంది, ఇప్పుడు అక్కడ కూడా నేలలో సారం అంతా పోయింది. వీక్ క్రాప్ ఔట్ పుట్. దాంతో హెల్త్ ఇష్యూస్. ఆర్టిఫిషియల్ గా ఫుడ్ ప్రొడక్షన్ జరుగుతోంది. నేను కొని ఎక్స్‌పెరిమెంట్స్ చేశాను ఇప్పటికే...ఐ విల్ నీడ్ టు బీ దేర్.” అన్నాడు దృఢంగా.

కొడుకుని ఆషామాషీగా తీసుకున్న జగదీశ్, సునందలు అందరికన్నా ముందు ఆశ్చర్యపోయారు. విశా అభిమానంగా చూసింది.

“వావ్, యువర్ సన్ ఈస్ గ్రేట్! వెల్ నీకు ఈ ఆఫర్ ఎప్పుడూ ఉంటుంది మార్స్ నుండి.” అన్నాడు రాబర్ట్, రిషీ భుజం తడుతూ.

వెనక్కి వెళ్లబోతూ ఎందుకో డౌటొచ్చి వెనక్కి తిరిగి “మరి మీ ఇద్దరి మ్యారేజ్ తర్వాత విశా ఇక్కడా, నువ్వు ఎర్త్ మీదా ఎలా...?” అన్నాడాయన.

“విశా కూడా మాతో వస్తుంది.” అన్నాడు రిషీ, విశా చేతిని తన చేతులలోకి తీసుకుంటూ.

రాబర్ట్ మహా వైపు చూశాడు “ఏంటన్నట్టు?”

మహా అవునని తలూపాడు దాదాపు తలదించుకుంటూ.

“మా మార్స్ నుండి టాప్ సైంటిస్ట్ ని తీసుకెళ్తున్నావ్ నువ్వు, నాట్ గుడ్!” అన్నాడు సీరియస్ గా.

అందరూ సైలెంటయిపోయారు.

“కమాన్! జస్ట్ జోక్ చేశాను. ఐ విష్ యూ బోత్ ఎ వండర్ ఫుల్ లైఫ్ అహేడ్.” అని నవ్వుతూ వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడాయన.

విశా గట్టిగా ఊపిరి పీల్చుకుంది. కొంత మంది రిషీని మెచ్చుకున్నారు, ఇంకొంత మంది నిరసనగా చూశారు. స్టేజ్ పైనుండి అనౌన్స్ మెంట్ రావడంతో అందరూ అటు ఫోకస్ చేశారు.

రాబర్ట్ స్టేజ్ మీద నించోనున్నాడు చుట్టూ వేవ్ చేస్తూ. అందరూ చప్పట్లూ, ఈలలూ.

"వావ్! ఈ క్రౌడ్ ని చూడండి ఒక్కసారి. ముప్పై ఐదేళ్లలో మనం ఎంత దూరం వచ్చామో క్లియర్ గా కనపడుతోందిక్కడ." అన్నాడు పెద్దగా. చుట్టూ ఉన్న స్క్రీన్లలో ఇంకా జనాలు ప్రవాహంలా వస్తున్నట్టు కనపడుతోంది.

"ఈ మైల్ స్టోన్ ఇయర్ లో మన 'జాతి పిత' ఎలోన్ ని మన మనసుల్లో తల్చుకుందాం." అన్నాడు రాబర్ట్ ఆ పెద్ద విగ్రహం వైపు చెయ్యి జాపుతూ. అందరూ తిరిగి దాని వైపు చెయ్యి జాపి

"మార్స్ మా మాతృభూమి…" అని ప్లెడ్జ్ చెప్పారు.

తర్వాత చెప్పడం మొదలుపెట్టాడు ప్రెసిడెంట్ –

"పోయిన సంవత్సరం మనం సాధించిన విజయాలలో మొట్ట మొదటిది – ఇండిపెండెన్స్! ఇప్పటివరకూ మనం భూమి మీద నుండి వస్తున్న ఎక్స్ పోర్ట్స్ మీద ఆధారపడి బతికాం. మన శాస్త్రవేత్తల హార్డ్ వర్క్ తో ఇప్పుడు ఇక్కడే మనం పంటల్ని పండిచుకోగలం, ఎనర్జీ ప్రొడ్యూస్ చెయ్యగలం, నీటిని హార్వెస్ట్ చెయ్యగలం, అలాగే ఫ్యాక్టరీలనుండి ఎలెక్ట్రానిక్స్, మెషినరీ తయారు చేసుకోగలం." అని ఆగాడు. అరుపులతో నిండిపోయింది అంతా. రిషీ వాళ్లకి కొంచెం ఇబ్బందిగా ఉంది ఇదంతా.

"మనం సాధించిన ఇంకొక విజయం – మార్స్ మీద విలువైన మెటల్స్ ని డిస్కవర్ చెయ్యడం. మనం అవి ఎర్త్ కి ఎక్స్ పోర్ట్ చెయ్యడం ద్వారా ఇంపోర్ట్స్, ఎక్స్ పోర్ట్స్ ని బ్యాలెన్స్ చేస్తాం." అన్నాడు.

"ఎర్త్ వాళ్లతో మన స్నేహ పూర్వక సంబంధాలు కొనసాగుతూనే ఉంటాయి. సీ దేర్! ఎర్త్ నుండి మన అమ్మాయిని వెడ్డింగ్ చేసుకోవడానికి వచ్చిన ఆ కుటుంబమే అందుకో ఉదాహరణ." అన్నాడు రిషీ వాళ్ళ వైపు చూపిస్తూ. కెమెరా వీళ్ళ మీద జూమ్ అయ్యింది. స్క్రీన్ మీద అందరికీ కనిపిస్తున్నారిప్పుడు. హఠాత్తుగా జరిగిన ఆ ఇన్సిడెంట్ తో ఆశ్చర్యపోయి, మెల్లగా చేతులు పైకెత్తి వేవ్ చేశారు రిషీ, విశాలు. అరుపులూ, కేకలూ చుట్టూ.

"ఇక నెక్స్ట్ టాపిక్ – మనందరికీ ఇష్టమైన స్పోర్ట్స్! మార్స్ లో ఉన్న మూడు కాలనీల మధ్య ఫస్ట్ టైం, ఈ సారి 'మార్స్ ఒలింపిక్స్' కండక్ట్ చేద్దామనుకుంటున్నాం." అన్నాడు. జనాలకి పూనకాలొచ్చినట్టు ఊగిపోయారు.

"మార్స్ లో ఇది కాకుండా ఇంకా రెండు కాలనీలున్నాయా!" అన్నాడు రిషీ ఆశ్చర్యంగా మొహం పెట్టి విశాతో. తలూపింది తను, ఉన్నట్టుండి వస్తున్న కన్నీళ్ళని ఆపుకుంటూ.

23

ఆ పార్టీ అయ్యాక విశా మూడ్ అంతా మారిపోయింది. తర్వాత రోజూ ముభావంగా ఉంది. ఎవరేమన్నా తప్పించుకోని తిరుగుతుంది. రిషీ కళ్ళల్లోకి చూసి మాట్లాడట్లేదు.

వాళ్ళమ్మకీ నాన్నకీ తెలుస్తూనే ఉంది. దానికి కారణం తెలిసినా ఎవరూ ఏమీ చెయ్యలేని పరిస్థితి. రిషీ ఇక తట్టుకోలేక అందరి ముందూ తనని పట్టుకోని అడిగేశాడా సాయంత్రం "విశా, ప్లీజ్. పెళ్ళి కి ఇంకా త్రీ డేసుంది. ఇక్కడేమో ఏవేవో జరుగుతున్నాయ్. ఆ ధనా నిన్ను బెదిరిస్తాడు. మీ ప్రెసిడెంట్ నిన్ను తీసుకెళ్ళద్దంటాడు. మా బాబాయెనకాల ఇంకా జనాలు పడుతున్నారు. అన్నిటినీ లైట్ గా తీస్కుంటున్నాను కానీ, నువ్వు డల్ గా ఉంటే నాకంతా కన్ఫ్యూజన్ గా ఉంది. ఏమైంది? ఏంటో చెప్తే సాల్వ్ చేసుకుందాం కదా కలిసి." అని.

విశా ఓ నిమిషం అటూ ఇటూ చూసింది. రిషీ ఇంకో సారి గట్టిగా అడిగే సరికి ఏడుస్తూ అక్కడే కింద కూర్చుండిపోయింది. సునంద, కీర్తి అందరూ తన చుట్టూ చేరారు.

కీర్తే మొదలు పెట్టింది "పాపం, విశాకి వాళ్ళ అత్తంటే పిచ్చి రిషీ. నిన్నటి నుండి బాగా గుర్తొచ్చి ఉంటుంది. అందుకే..."

"ఏమైంది...ఆమె లేరా?" అన్నాడు.

"అబ్బే...బానే ఉంది. కానీ ఈ పెళ్ళి కి రాలేదు."

"ఏం, వాళ్లూ ఎర్త్ మీద ఉండిపోయారా?"

"అరే, మాకు చెప్తే మన రాకెట్లో వేస్కొచ్చే వాళ్ళమే!" అన్నాడు మల్లి మధ్యలో అందుకుంటూ.

"లేదు, వాళ్ళిక్కడే ఉంటారు. కాలనీ 2 లో ఉంటారు. మన పక్క కాలనీలో."

"గ్రేట్! మరేంటి ప్రాబ్లం? ఇక్కడ కాలనీస్ మధ్య ట్రావెల్ రెస్ట్రిక్షన్స్ ఏమన్నా ఉంటాయా?" అన్నాడు.

"అలాంటివేం లేవు, అందరూ తిరుగుతూనే ఉంటారు. ప్రాబ్లం కాలనీల మధ్య కాదు..."

"కీర్తీ...!" అరిచాడు మహా పెద్దగా. మొదటిసారి అతను బ్రేక్ అవ్వడం అలా.

విశా అందుకుని "చెప్పనీ డాడీ! మీ ఇష్టమొచ్చినట్లు మీరు గొడవపడి, ఫ్యామిలీ మొత్తాన్నీ దూరంగా పెట్టారు. ధనాతో నాకు ప్రాబ్లం ఉంది, ట్రూ. కానీ, అత్తయ్యేం చేసింది మధ్యలో..." అంది కళ్ళు తుడుచుకుంటూ.

"నువ్వు నోర్ముయ్...ఆ ధనా గాడి విషయం ముందంతా చెప్పకుండా సీక్రెట్ గా ఉంచి, అందర్నీ ఇబ్బంది పెట్టావ్." అన్నాడు. జగదీశ్ కీ, సునందకీ అయోమయంగా ఉంది.

ధనా, విశా వెనకాల పడి ఇబ్బంది పెట్టడం, విశాని ఎర్త్ కి పంపడం, ఆ విషయంపై మహా, తన చెల్లి, బావలతో గొడవ పడటం...ఇవన్నీ చెప్పింది కీర్తి వాళ్లతో.

"నాకివన్నీ అర్థమయ్యాయి కానీ...ధనా, విశాని ఏడిపిస్తే, వాళ్ళ అత్తతో మీరు ఫైట్ చెయ్యడం ఎందుకు?" అన్నాడు రిషీ. అదే మల్లికి కూడా అర్థం కాలేదు.

"ధనా ఎవరో కాదు, మహా చెల్లెలి కొడుకు. విశాకి బావ!" అంది కీర్తి ప్రశాంతంగా.

వెయ్యి వోల్టుల షాక్ తగిలినట్టు నిలబడిపోయాడు రిషీ.

కొంత సేపు సైలెంట్ గా ఉంది వాతావరణం. కీర్తి చెప్పిన విషయాలతో విశా తన దగ్గర దాచిందని కోపమొచ్చినా, తనకి ఎప్పుడూ నిజంగా ధనా అంటే ఇష్టం లేదని అర్థం అవ్వడంతో కూల్ అయ్యాడు రిషీ.

"అంకుల్, అయ్యిందేదో అయిపోయింది. మీరు పెద్ద కదా, మీరే మీ సిస్టర్ని పిలిస్తే వస్తారేమో మ్యారేజ్ కి?" అడిగాడు.

"వాళ్లతో మూడేళ్ళగా మాకు మాటల్లేవు. ఈ విషయంలో మీరు ఇన్వాల్వ్ అవ్వద్దు." అన్నాడు మహా స్ట్రాంగ్ గా.

పక్కనే వింటున్న మల్లికి చిర్రెత్తుకొచ్చింది.

"మీరు మారరా? మార్స్ మీద కొచ్చినా, ప్లూటో మీద కెళ్ళి నా మీ బుద్ధులు మారవా? ఒక్కసారి ఆలోచించండి, మీ కోసం, ఆమె ఎంతగానో ఇష్టపడే అన్నని వదల్లేక, ఎర్త్ మీద ఉన్న అన్ని సంబంధాలూ తెంపుకోని, ఈ గ్రహానికొచ్చి ఎవడో మీరు చూపిచ్చిన గొట్టం గాడిని కట్టుకోని, ఇంకో గొట్టం గాడికి జన్మనిచ్చి, నానా కష్టాలూ పడుతోందే ఆ మహా తల్లి, మీ చిట్టి చెల్లి, ఆమె గురించి ఆలోచించండి. ఇన్ని కష్టాలు పడినా తను ఓర్చుకుంది, అన్న పక్కనే ఉన్నాడనే ధైర్యంతో! ఆ ధైర్యమే ఇప్పుడు తనని అవమానిస్తుంటే, అనుమానిస్తుంటే...ఆ చెల్లి పరిస్థితేంటి? అహ, ఏంటి అని ఒక తమ్ముడిగా... మీ అన్నల దౌర్జన్యాన్ని నిరసిస్తూ ప్రశ్నిస్తున్నా!" అని గట్టిగా ముందున్న టేబుల్ పైన గుద్ది మరీ చెప్పాడు ఆవేశంగా.

అప్పుడే వాళ్లింటికొచ్చిన రస్క్ విజిలేయబోయి కంట్రోల్ చేసుకున్నాడు.

మహా, మల్లిని ఆశ్చర్యంగా చూస్తున్నాడు. కీర్తి, మల్లితో "మీరన్నదాంట్లో ఏ ఒక్క విషయం..."

"కరెక్ట్ కాదు కదా, వాడంతే లేండి, పట్టించుకోకండి." అన్నాడు జగదీశ్.

"కాదండీ...ఏ ఒక్క విషయం రాంగ్ కాదు...అన్నీ పర్ ఫెక్ట్ గా చెప్పారు. ఎలా?" అంది.

ఇప్పుడు షాక్ తినడం మల్లి వాళ్ళ ఫ్యామిలీ వంతయ్యింది.

"ఎన్ని సినిమాల్లో చూళ్ళేదూ..." అని గొణుక్కున్నాడు మల్లి.

కొంచెం సేపయ్యాక మహా "నేనొప్పుకున్నా మా చెల్లీ, బావా ఒప్పుకుంటారో లేదో తెలీదు. ఇన్నాళ్ల తర్వాత మళ్ళీ ఎలా అడగడం వాళ్లని?" అన్నాడు బాధగా.

ఇటువైపు ఒప్పుకున్నందుకు, సగం ప్రాబ్లం సాల్వయ్యిందని హ్యాపీగా ఉన్నాడు రిషీ. ఇంక లేట్ చెయ్యకుండా "అంకుల్, ఆ పని నాకొదిలేయండి. నేను వెళ్ళి మాట్లాడి ఒప్పిస్తాను ఆమెని, వాళ్ళ ఫ్యామిలీని." అన్నాడు.

"నో, నో రిషీ! ఇప్పుడు వాళ్ల మూడ్ బాగుండక పోవచ్చు, పైగా ధనా ఇంట్లో ఉంటే గొడవ ఇంకా పెరుగుతుంది. నీకిదంతా ఐడియా లేదు." అన్నాడు మహా.

"అంకుల్, నేను మూడో పర్సన్ కి కనక, బ్యాలెన్స్ డ్ గా మాట్లాడే ఛాన్స్ ఎక్కువ, ప్లీజ్ విశా కోసం నన్ను వెళ్ళనివ్వండి. ధనా విషయంలో జాగ్రత్తగానే ఉంటాను." అన్నాడు.

ఎవరూ ఏం మాట్లాడలేదు. కీర్తి నుండి ఇంకొన్ని వివరాలు తెలుసుకుని, మార్స్ సూట్ వేసుకోని వాళ్లింటికి స్టార్టయ్యాడు రిషీ.

బైటికి రాగానే తన ముందొక ఎల్లో వెహికిలొచ్చి ఆగింది. ఆల్ రెడీ రస్క్ డ్రైవ్ చేస్తున్నాడు దాన్ని.

"బ్రో, నీకెందుకు ఇవన్నీ. నే వెల్తాలే." అన్నాడు రిషీ మొహమాటానికి.

"ఎట్లా ఎల్తావ్ బాసూ, నీకసలు మార్స్ లైసెన్స్ ఉందా? ఈ వెహికల్లో ఏ బటన్, ఎక్కడుంటుందో తెలుసా. దా ఎక్కు, మిల్కే జాయేంగే!" అన్నాడు రస్క్ అవేం పట్టించుకోకుండా.

"నా గురించి నీకు రిస్క్ ఎందుకనీ..." అన్నాడు రిషీ లోపలికెక్కుతూ.

"రిస్క్ తీస్కోకపోతే నా పేరు 'రస్క్' అని ఎందుకని పెట్టుకుంటా బాసూ. మా మార్షియన్లకి రిస్క్ తీస్కోవడం చిన్నప్పటి నుండి ఆర్గానిక్ మిల్క్ తో కలిపి పోస్తారు. డోంట్ వర్రీ! పద అత్తారింటికి దారి చూపిస్తా!" అన్నాడు నవ్వుతూ.

## 24

రస్క్ డ్రైవ్ చేస్తుంటే వాళ్లిద్దరూ ఆ కాలనీ దాటి బైటికొచ్చారు. ఇద్దరూ సూట్లూ, హెల్మెట్లూ పెట్టుకున్నారు. వాళ్ళ హెల్మెట్లకి, ఆ ట్రక్ నుండి వస్తున్న ఆక్సిజన్ పైపులు కనెక్టయ్యి ఉన్నాయి. ఆ హెల్మెట్‌లలోనే ఇద్దరూ మాట్లాడుకునేందుకు ఇన్–బిల్ట్ మైక్స్ ఉన్నాయి. లోపల టెంపరేచర్ ఎంత కంట్రోల్డ్ గా ఉన్నా, రిషీకి చలిగానే ఉంది.

"ధనా ఇంట్లోనే ఉంటాడంటావా?" అన్నాడు రిషీ.

"డౌటే, ఈవినింగే కదా ఇంకా, అప్పుడే రాడేమో? బాగా తిరిగేసి, జనరల్గా నైటుకెల్తాడు ఇంటికి."

"నీకు బాగా క్లోజనుకుంటా!"

"లేదు బాసూ, వాడితో అవసరం. నేను మూవీ డిస్ట్రిబ్యూషన్ తీస్కునేప్పుడు వాడి ఎర్త్ కాంటాక్ట్స్, ఇన్ఫ్లూయెన్సూ వాడాడు. వాడికి మార్స్ రైట్స్ లో కొంత కమీషన్ కూడా ఇస్తున్నా."

"తెలిసి తెలిసీ, వాడినెందుకు కలుపుకున్నావ్?"

"హుమ్, ఆల్టర్నేటివ్ లేదు. ఇక్కడంతా వాడనుకున్నట్టే జరుగుతుంది!"

"మరి మీ పెద్దాయన, అదే మీ ప్రెసిడెంట్ ఏమీ చెయ్యట్లేదా?"

రస్క్ కొంచెం ఆలోచించాడు దానికి.

"బాసూ, మనలో మన మాట, మా ప్రెసిడెంట్ పబ్లిగ్గా ధనాని తిడుతూ ఉంటాడు కానీ, ఇంటర్నల్ గా సపోర్ట్ చేస్తున్నాడని టాక్! అంతే కాదు, ధనా గాడు ఇప్పుడు కాలనీ 2 కి సెనేటర్ గా కూడా ట్రై చేస్తున్నాడంట. సో, డౌట్ లేకుండా ఏదో కనెక్షనుండే ఉంటుంది."

ఎర్త్ మీద పాలిటిక్స్ ని ఏళ్ళ గా చూస్తున్న రిషీకి అది పెద్దగా ఆశ్చర్యంగా అనిపించలేదు. మనీ & పవర్ గో హ్యాండ్ ఇన్ హ్యాండ్!

ఇద్దరూ ఎర్రటి డెసెర్ట్ లాంటి మార్స్ సర్ ఫేస్ మీద, పెద్ద పెద్ద పర్వతాల మధ్యలో వేసిన రోడ్డు మీద వెళ్తున్నారు. కాలనీలని కలపడానికి వేసిన హైవేలలాంటి రోడ్లవి. ఓ చోట ఆ రోడ్డు స్ప్లిట్ అయ్యింది. ఆ రోడ్డు చివర పెద్ద ఫ్యాక్టరీలా కనపడుతోంది.

"ఏంటది?" అడిగాడు రిషీ.

"అది మా వాటర్ ఫ్యాక్టరీ. ఇక్కడికి దగ్గరలో ఉన్న పోల్స్ నుండి, ఐస్ తీసి దాన్ని పైపు ల ద్వారా ఇక్కడికి పంపి, క్లీన్ చేసి, కాలనీలకి పంపించేవాళ్లు."

"పంపించేవాళ్లంటే...?"

"ఇక్కడ పైప్ లతో ప్రాబ్లం వల్ల, ఇప్పుడు పోల్స్ దగ్గరే క్లీన్ చేసి అక్కడినుంచి డైరెక్ట్ గా కాలనీలకి పంపిస్తున్నారు. అందుకే రెండేళ్ళనుండీ ఈ ఫ్యాక్టరీ వాడట్లేదు." అన్నాడు.

మెల్లగా వాళ్ళ వెహికిల్ కాలనీ 2 లోకి ఎంటరయ్యింది. రస్క్ అన్నట్లుగానే దార్లో వాళ్లకి అక్కడక్కడా ధనా డిజిటల్ డిస్ ప్లేలు కనపడ్డాయి. "నన్ను నమ్మండి, మీ భవిష్యత్తు మార్చేస్తా", "కాలనీ 2 కి దాసుణ్ణి, మీ గుండెలకి రారాజుని" లాంటి అరిగిపోయి, ఎర్త్ నుండి కాపీ చేసిన కొటేషన్లు రాసున్నాయి అతని ఫొటోలతో పాటు.

విశా వాళ్ళ అత్తా వాళ్లింటికి చేరేటప్పటికి దాదాపు చీకటి పడుతోంది. రిషీకి టెన్షన్ గా ఉంది. ధనా ఉంటే వర్కౌటవ్వదు తన ప్లాన్. వాళ్లిద్దరూ ఆ ఇంటికి కొంత దూరంలో వెయిట్ చేశారు. ఇంటి పక్కన ధనా వెహికిల్ కనపడక పోవడంతో, మెల్లగా దిగి లోపలికెళ్ళారు.

వాళ్ళ అత్త, మామలు శుభ, ప్రమోద్ లు వీళ్లని చూసి ముందు ఆశ్చర్యపోయారు. రిషీ అక్కడి సిచ్యుయేషన్ చెప్పాడు.

ప్రమోద్ కొంచెం ఎమోషనల్ గా కనిపించాడు.

"అసలు విశా మాకు కావలసిన కోడలు. ఇంట్లో మా పిల్లలాగా పెరిగింది." అన్నాడు.

"నువ్విలా రావడం కరెక్ట్ కాదు." అంది శుభ కూడా రిషీతో.

"ఆంటీ, నాకు తెలుసు మీరెలా ఫీలౌతున్నారో. విశాకి మీరంటే చాలా ఇష్టం. అందుకే అక్కడ చాలా బాధ పడుతోంది. తనకి ధనా ఇష్టం లేకపోతే మీరేం చెయ్యలేరు కదా?" అన్నాడు రిషీ.

"మా వాడే సరిగ్గా ఉంటే, అంతా బానే ఉండేది. హఠాత్తుగా మారిపోయాడు." అంది శుభ బాధగా.

"శుభా, వాణ్ణేం అనకు. అందరి లాగా కాదు వాడు. వాడో కొత్త దారి సృష్టించుకుంటున్నాడు. ఫ్యూచర్లో గొప్పవాడౌతాడు." వెనకేసుకొచ్చాడు ప్రమోద్.

ధనాకి మోరల్ సపోర్ట్ ఎక్కడి నుండి వస్తోందో అర్థం అయ్యింది రిషీకి.

"అంకుల్, మీ వాడు వేస్కుంటున్న దారి ఫ్యూచర్లో కాదు, ఇప్పటికే తనని గొప్పవాణ్ణి చేసేసింది. క్రిమినల్స్ లో." అన్నాడు ప్రశాంతంగా.

ప్రమోద్ కి మండింది. శుభ అతణ్ణి ఆపింది.

"రిషీ, నువ్వు బయల్దేరు. ఇది నీ సమస్య కాదు."

"సారీ, కానీ మీరు మా పెళ్ళి కి రావడం మాత్రం నాకు సంబంధించిన విషయమే." అన్నాడు రిషీ.

"విశాతో మాకే ప్రాబ్లం లేదు. మహా తోనే..."

"అంకుల్, ఇప్పుడు బాధపడుతున్నారు. నన్ను పంపింది ఆయనే."

"తనే రావచ్చుగా?"

"మీకున్న ఇష్యూనే ఆయనకీ ఉంది ముందు మాట్లాడ్డానికి. ఇన్నాళ్ళూ దూరం పెట్టి..."
"ధనాని కాదని మేము రాలేం రిషీ." అన్నాడు ప్రమోద్ తలూపుతూ.

రిషీ హెల్ప్ లెస్ గా రస్క్ వైపు చూశాడు.

"అంకుల్, ఆంటీ, మహా అంకుల్ ఫిఫ్టీ ఇయర్స్ గా కలిసున్నారు. ఉండనిద్దాం అంకుల్, మనం జాగ్రత్తగా చూస్కుంటే ఇంకో ముప్పై ఏళ్ళు కలిసి హ్యాపీగా అన్నా చెల్లెళ్లలా బతికేస్తారు." అన్నాడు రస్క్ ఎమోషనల్ గా.

"ఎక్కడో క్లాసిక్ మూవీలో విన్నంట్టుందే ఇది." అన్నట్టు చూశాడు రిషీ.

"ఆంటీ, నీకు తెలుసో లేదో. ఆ ఇంట్లో ప్రతిరోజూ నీ కోసం ఓ కంచం, బేస్ మెంట్ లో ఓ గదీ, మహా అంకుల్ ఆస్తిలో సగం వాటా అలానే ఉంచేశారాంటీ!" రస్క్ తన మూవీ నాలెడ్జంతా తెగ వాడేస్తున్నాడు వాళ్ళ మీద.

రిషీ చివరిగా శుభ ముందు మోకాళ్ళ మీద కూర్చొని "అత్తా, వీలుంటే మమ్మల్ని క్షమించు, లేదంటే శిక్షించు, కానీ మేమున్నామని గుర్తించు." అన్నాడు దీనంగా మొహం పెట్టి.

శుభ, ప్రమోద్ లు ఒకళ్లనొకళ్లు చూసుకున్నారు. ఓ క్షణం తర్వాత పెద్దగా నవ్వారు.

"లే లే...టూ మచ్ యాక్టింగ్ నువ్వు. విశా దీనికే పడిపోయుంటుంది." అంది రిషీ తలమీద కొడుతూ. "బై ది వే, నేన్నీకు అత్తని కాదు." అంది.

"రూకీ మిస్టేక్!" అన్నాడు రస్క్. రిషీ నాలుక్కరుచుకున్నాడు.

"కాల్ చెయ్ రిషీ, మా అన్నతో మాట్లాడాలనుంది. వెంటనే, ఇప్పుడే!" అంది శుభ సడెన్ గా ఎమోషనల్ అవుతూ.

రిషీ తన డివైజ్ ని నొక్కేంతలోపే, తనకే అటు నుండి కాలొచ్చింది. కాల్ ని గాల్లో ప్రొజెక్ట్ చేశాడు రిషీ. మహా అటు వైపు.

"అంకుల్, హ్యాపీ న్యూస్, శుభ ఆంటీ..."

"రిషీ, రిషీ..." రొప్పుతున్నాడు మహా.

"అవునంకుల్, విశాని పిలవండి. షి విల్ బి వెరీ హ్యాపీ" అన్నాడు రిషీ.

"విశాని...విశాని..."

"ఆ...విశాని...?"

"ఎవరో కిడ్నాప్ చేశారు!"

25

"వాట్!" అని తల పట్టుకున్నాడు రిషీ.

"అవును రిషీ, ఎవరో బలవంతంగా తనని తీసుకెళ్లారు."

"ఎలా...హౌ డూ యూ నో అంకుల్?!"

"నువ్వు తన అత్తని తీస్కొస్తున్నావని తను హ్యాపీగా ఫీలైంది. బైటికెళ్లి బ్రైడల్ అటైర్ అదీ ఫైనలైజ్ చెయ్యడానికెళ్లింది ఇందాక. తను నడుస్తూ వస్తున్నానంది కాల్ చేసి. ఆ దారిలోనే..."

"ఆదారిలోఏమైంది?"

"ఏమో తెలీదు, ఉన్నట్టుండి అరుపు వినపడింది, తర్వాత లైన్ వెంట్ డెడ్. మేం జీపీఎస్ ట్రాకర్లో చెక్ చేసి, తన రిస్టు

బ్యాండున్న ప్లేస్ కొచ్చాం. ఇక్కడ జస్ట్ బ్యాండొక్కటే ఉంది. విశా లేదు?" అన్నాడు బాధగా. వెనక కీర్తి ఏడుస్తున్నట్టు వినపడుతోంది.

రిషీ అదంతా ప్రాసెస్ చేసోడానికి రెండు నిమిషాలు పట్టింది.

"అంకుల్, ఎక్కడ దొరికిందా బ్యాండ్ మీకిప్పుడు?"

"తనెళ్ళిన వెడ్డింగ్ షాప్ పక్కనే."

"ఎంత సేపైంది తను మీకు కాల్ చేసి?"

"ఒక ఫిఫ్టీన్ మినిట్స్ అయ్యుంటుంది. తనకేదో యాక్సిడెంట్ అయ్యిందేమోనని మేం వెంటనే బయల్దేరాం. కానీ..."

"మీరొక్కసారి చెక్ చెయ్యండి. మీకు కాల్ చేసినప్పుడు తను ఆ షాప్ దగ్గరే ఉందా? జీపీఎస్ రూట్ చూడండి?"

మహా హడావిడిగా చెక్ చేశాడు. "లేదు రిషీ, తను కాల్ చేసినప్పుడు వెనకాలున్న వేర్ హౌస్ లో ఉన్నట్టు చూపిస్తోంది. ఆ తర్వాత విశా మళ్ళీ ఈ షాప్ కొచ్చుంటుంది. ఇక్కడే తనని...?"

"లేదంకుల్...ఆ వేర్ హౌస్ దగ్గరే తనని కిడ్నాప్ చేసుండాలి. తర్వాత ఎవరో తన డివైజ్ ని షాప్ ముందు పడేసుండాలి.

"మీరు అర్జంట్ గా పోలీసులకి కంప్లైంట్ చెయ్యండి. ఆ ఏరియాని కెమెరాలు ఏమైనా కవర్ చేస్తున్నాయేమో కనుక్కోండి. నేను వెంటనే అక్కడికొస్తున్నా." అన్నాడు హడావిడిగా కట్ చేస్తూ.

శుభ, ప్రమోద్ లు షాక్ లో ఉన్నారు అంతా విని.

రస్క్ "విశా ఎవర్నీ హర్ట్ చెయ్యలేదు బాసూ...దిస్ ఈస్ టూ మచ్!" అన్నాడు.

"పద, వుయ్ నీడ్ టు గో!" అన్నాడు రిషీ బైటికి నడుస్తూ.

"ఎక్కడికి?"

"నాకొకళ్ళ మీద డౌట్ గా ఉంది!"

ఆ కాలనీ 2 బైటికొచ్చి మళ్ళీ ఆ ఎర్రటి ఎడారిలాంటి మార్స్ నేల మీద వెళ్తున్నారు వాళ్లిద్దరూ.

"బాసూ...ఎవరు చేసుంటారంటావ్?" అన్నాడు రస్క్.

"ఇంకెవడు ఆ ధనా గాడే."

"కరెక్ట్ బాసూ, ఆ హోటల్లో వాడు విశాని తగులుకున్నప్పటి నుండి నాకెక్కడో కొడుతూనే ఉంది."

"వాడింట్లో లేడంటే, విశాని ఎక్కడో దాచడానికి తీస్కెల్తున్నాడన్నమాట!"

"బాసూ...!" అరిచాడు రస్క్ దూరంగా చూపిస్తూ.

ఓ మైలు దూరంలో వాళ్లకి ఆపోసిట్ గా వస్తున్న ఒక ఎల్లో ట్రక్ స్పీడుగా రైట్ తీసుకోని, ఇంకో రోడ్డు మీదుగా ఆ ఓల్డ్ వాటర్ ఫ్యాక్టరీ వైపు వెల్తోంది.

"రస్క్, ఆ వెహికిల్ ని ఫాలో అవ్వు, స్పీడ్ పెంచు. ఫాస్ట్ గా..." అరిచాడు రిషీ.

రస్క్ స్పీడ్ ని డబుల్ చేశాడు. తర్వాత తన స్క్రీన్ మీదున్న లెన్స్ ని ఆ ఫ్యాక్టరీ వైపు వెల్తున్న వెహికిల్ వైపు జూమ్ చేశాడు. ఆ ట్రక్ సైడ్ లో బ్లాక్ పెయింట్ తో ఉన్న నంబర్ స్పష్టంగా కనిపిస్తోందిప్పుడు. రస్క్ వెనక్కి వాలి ఊపిరి వదులుతూ రిషీ వైపు చూశాడు.

"ఎవరిదా వెహికిల్?" అడిగాడు రిషీ.

"ధనా ది!"

ముందెల్తున్న వెహికిల్ కి దగ్గరగా ఉన్నారిప్పుడు. మెల్లగా అది ఫ్యాక్టరీ లోపలికెళ్లింది. రిషీ వాళ్ళ వెహికిల్ ఒక పెద్ద టవర్ పక్కన దాచి, ఇద్దరూ కిందికి దిగి నడవడం మొదలుపెట్టారు. 'మొబైల్ ఆక్సిజన్' సిలిండర్లు తగిలించుకున్నారిద్దరూ. అరగంట కన్నా ఎక్కువ సేపు వర్క్ చెయ్యవవి.

మెల్లగా ఓ వాల్ వెనక నుండి ధనా వెహికిల్ ని గమనిస్తున్నారు. అనుకున్నట్టే ధనా బైటికొచ్చాడు. హెల్మెట్లో నుంచి కూడా అతని మీసం స్పష్టంగా తెలుస్తోంది రిషీకి. వెనకాల డోర్ తీసి, ఓ రోప్ పట్టుకుని వెహికిల్ లోంచి దేన్నో గట్టిగా బైటకి లాగుతున్నాడు. ఓ నిమిషం తర్వాత చేతులు రెండూ కట్టేసున్న ఇంకో స్పేస్ సూట్ వెహికిల్ లోంచి బైటికొచ్చింది. ధనా లాక్కొని తీస్కెల్తుంటే బాగా పెనుగులాడింది కానీ దాని భుజాల చుట్టూ టేప్ తో చుట్టేసుంది. నోరు కూడా ప్లాస్టర్ వేసుండటంతో, అరుపు మూలుగులా వినపడుతోంది రిషీ వాళ్లకి.

రిషీ కళ్ళు ఎర్రగా మారాయి. తను ప్రేమించి, పెళ్లి చేసుకోబోయే అమ్మాయిని ఒకడు అలా లాక్కెల్తుంటే సహనం చచ్చిపోయి, పిచ్చిగా అరుస్తూ అటు వైపు పరిగెత్తడం మొదలుపెట్టాడు. ఏం చెయ్యాలో తెలీక రస్క్ కూడా వెనకాలే పరిగెత్తాడు.

వాళ్ళు వెళ్ళే లోపే ధనా ఆ తాడుని పట్టుకోని ఇంకో వ్యక్తిని లాక్కుంటూ లోపలికెళ్ళాడు. అతని వెనకాలే మూడు డోర్లు బలంగా తెరిచి లోపలికొచ్చారు రిషీ, రస్క్ లు. లోపల విశాలంగా ఉన్న పెద్ద ఏరియా, మిషన్లూ, పైపులూ, డిజిటల్ మీటర్లూ అన్నీ ఉన్నాయి. అవి పాడై పోకుండా లోపల ఆక్సిజన్ నింపి మెయింటైన్ చేస్తున్నారు. లోపలికెళ్ళాక తన హెల్మెట్ తీసి పక్కనపెట్టాడు ధనా. అంతలోనే ఆ తలుపుల్లోంచి లోపలి కొచ్చిన వీళ్లని చూసి ఆశ్చర్యపోయాడు. రిషీ కూడా హెల్మెట్ తీశాడు. ధనా ఆశ్చర్యం డబులయ్యింది.

"ఏరా, కిడ్నాప్ చేసి తీసుకొస్తే ఎవడూ పట్టించుకోడనుకున్నావా? తనకి నేనున్నారా!" అన్నాడు రిషీ దగ్గరికెళ్ళబోతూ.

రస్క్ కూడా "నీకిదేం పన్రా? కిడ్నాప్ చేసేంత చీప్ గా తయారయ్యావా?" అన్నాడు. అదేదో మర్డర్ గొప్ప, కిడ్నాప్ చీప్ అన్నట్టు.

"రేయ్, మీరు నన్నెందుకు ఫాలో అవుతున్నారు? మీకేం అవసరం? మీకస్సలు సంబంధం లేని మ్యాటర్లో తలెందుకు దూరుస్తున్నారు?" అన్నాడు ధనా గట్టిగా.

"నాకు సంబంధం లేదంటావేంట్రా? చూడూ...తనకి నువ్వంటే ఇష్టం లేదు. అది నీకూ తెలుసు. ఇంకా ఎందుకురా ఇవన్నీ...?" అసహనంగా ఉంది రిషీకి.

"వాడికిష్టం లేదూ, వీడికి మూడ్ లేదూ అంటే నా బిజినెస్ ఏం కావాల్రా?" అన్నాడు ధనా.

రిషీకి మండిపోయి పక్కనే పడున్న రాడ్డు తీసుకోని ధనా వైపు పరిగెత్తాడు. ధనా ఇంకో పైప్ అందుకోని రిషీని కొట్టాడు. బ్లాక్ చేశాడు రిషీ. ఆ రాడ్ తో గట్టిగా ధనా ని పుష్ చేసి, అతను వెనక్కి వెళ్తే, ఆ గ్యాప్ లో కాల్తో ఒక్క షాట్ ఇచ్చాడు. ఎగిరి వెనక్కి పడ్డాడు ధనా. "నిన్నివాళ చంపే బైటికెల్తారా!" అంటూ రిషీని తిడుతూ ముందుకి స్కిడ్ అయ్యి పైప్ తో రిషీ కాళ్ల మీద కొట్టాడు. రిషీకి నరాలన్నీ లాగేసినట్లయ్యింది. అలాగే నిలబడి, కిందున్న ధనా చేతి మీద తన రాడ్ తో కొట్టాడు. ధనా అరుస్తూ పైప్ ని కింద పడేశాడు. చేత్తో ధనా జుట్టు పట్టుకోని, మోకాలితో తన మొహం మీద కొట్టాడు. అలాగే వెనక్కి పడిపోయాడు ధనా. ఆ ఊపుకి రిషీ కూడా పక్కకి పడ్డాడు. ఇద్దరూ ఈ నిమిషం మూలుగుతూ, రొప్పుతూ ఉండిపోయారు. ధనా ముక్కు లోంచి రక్తం కారుతోంది. రిషీ మోకాళ్లు వణుకుతున్నాయి ఇందాకటి దెబ్బతో.

"రేయ్, అసలెందుకొచ్చావ్? ఎందుక్కొడుతున్నావ్?" బాధతో మూలుగుతూ అడిగాడు ధనా.

రిషీ వాణ్ణి పట్టించుకోకుండా "రస్క్, విప్పు. విశా కట్లు విప్పు తొందరగా!" అన్నాడు.

రస్క్ కంగారుగా వెళ్ళి చేతులకీ కాళ్లకీ ఉన్న కట్లు తీస్తున్నాడు.

ధనా ఇద్దరి వైపూ ఆశ్చర్యంగా చూస్తూ "విశానా? విశా ఇక్కడెందుకుంటుందిరా?" అన్నాడు.

"కట్లు తీస్తే అదే తెలుస్తుంది. విశాని ఎక్సాక్ట్ గా పెళ్ళి కి ముందు ఎందుకు కిడ్నాప్ చేశావో తెలీదా మాకూ...శాడిస్టెదవ..." అనేంత లోపే "బాసూ..." అని అరిచాడు రస్క్.

రిషీ అతని వైపు తిరిగి, అలా చూస్తూ నిలబడిపోయాడు.

ఎదురుగా నించొని కనపడ్డాడు వాళ్ళ స్పేస్ క్రాఫ్ట్ పైలట్ 'లీ' !

కొన్ని క్షణాల తర్వాత జరిగిందేంటో అర్థమయ్యాక అన్నాడు రిషీ "లీ, లీనెందుకు కిడ్నాప్ చేశావ్?"

“ముందు ఇది చెప్పు విశా కిడ్నాపైందా?” అన్నాడు ధనా ఇంకా షాక్ లో.

“అవున్రా...ముందు వీడి సంగతి చెప్పు. వీడేం చేశాడు పాపం!”

“అవన్నీ నీకనవసరం.” అన్నాడు ధనా.

“రేయ్, ఇవాళ నీ సంగతి తేలక పోయిందనుకో, నిన్నిక్కడే తవ్వి భూమిలో పాతేస్తాను!” అన్నాడు రిషీ ఆవేశంగా తన చేతిలో ఉన్న పైప్ ని గాల్లోకి లేపుతూ.

“తప్పు బాసూ... అది కరెక్ట్ కాదు!” అన్నాడు రస్క్ పక్కనుండి.

“నువ్వేంటి వీడికి సపోర్టు?” అన్నాడు రిషీ చిరాగ్గా.

ధనా ఆశగా చూశాడు రస్క్ వైపు.

“తవ్వి భూమిలో కాదు మార్స్ లో పాతేస్తాననాలి బాసూ...అచ్చు తప్పు!”

“ద్రోహీ!” అరిచాడు ధనా.

“చెప్పు, నాకెక్కువ టైం లేదు. అసలేం జరుగుతోందిక్కడ?”

“లీ గాడు నువ్వనుకున్నట్టు పైలట్ మాత్రమే కాదు, నా ఇల్లీగల్ మైనింగ్, ఎర్త్ కి స్మగ్లింగ్ చేసే దందాలో పార్ట్నర్. కానీ ఈ సారి నేను మా మార్స్ కాలనీ సెనెటర్ గా పోటీ చెయ్యడానికి ట్రై చేస్తున్నానని తెలిసి, అపోజిషన్ తో చేరి నన్ను బ్లాక్ మెయిల్ చేస్తున్నాడు.” అన్నాడు ధనా.

లీ వైపు ఆశ్చర్యంగా చూశాడు రిషీ. తనకి నమ్మకం కుదరట్లేదు ధనా మాటల మీద.

“నాకు నెక్స్ట్ టూ డేస్ చాలా క్రూషియల్! తర్వాత ఎలక్షన్లు వస్తున్నాయి. వీడు బైటే ఉంటే, ఏదో ఒకటి చేస్తాడని, ఇక్కడ కొన్ని రోజులు హైడింగ్ లో పెడదామని తెచ్చా.” అన్నాడు.

“రేయ్, నీ దరిద్రపు సినిమా ప్లాట్లు పక్కనబెట్టి, అసలు విశానెవరు కిడ్నాప్ చేశారో చెప్పరా?” అన్నాడు రస్క్ రిషీ పక్క కొచ్చి నిలబడుతూ.

“అది నాకెట్లా తెలుస్తుందిరా! మొన్న విశాతో మాట్లాడాక చాలా హర్టయ్యా, తనతో ఇంకెప్పుడూ మాట్లాడకూడదు, చూడకూడదు అనుకున్నా గానీ, నేనంతగా ప్రేమించిన విశాని నేనెందుకు కిడ్నాప్ చేస్తారా?” అన్నాడు.

“ఏమో సైకోగాడివి, ఏమన్నా చేస్తావ్.” అన్నాడు రస్క్ కోపంగా.

“విశాని నేను కానీ, మా వాళ్ళు కానీ అసలు టచ్ చెయ్యలేదు. కానీ ఎవరు చేసుంటారో ఊహించగలను.”

“ఎవరు? ఎవరయ్యుంటారు?” అన్నాడు రిషీ.

"విశాకి పెళ్ళైతే ఎవరికి నష్టం జరిగే ఛాన్సుంది? ఎవరికీ ఇవ్వని పర్మిషన్ తనకి స్పెషల్ గా ఇచ్చి ఎర్త్ కి పంపించిందెవరు? అక్కడ తను చేసిన పీ.హెచ్.డీ రీసెర్చ్ ఇక్కడ దేనికి యూజ్ చెయ్యాలని చూస్తున్నారు? వీటికి ఆన్సర్లు కనుక్కో." అన్నాడు ధనా రస్క్ సాయంతో పైకి లేస్తూ.

సడెన్ గా వాళ్ళ ముగ్గురికీ బైట ట్రక్ స్టార్టయిన సౌండ్ వినపడింది. పక్కన చూస్తే లీ లేడు. ముగ్గురూ హెల్మెట్లేసుకోని బైటకి పరిగెత్తేటప్పటికి ఆ ట్రక్ కాంపౌండ్ దాటి దూరంగా వెళ్ళి పోతూ కనపడింది.

"హర్రీ అప్, వాడు కాలనీ 1 వైపే వెళ్తాడు. అక్కడ నా అపోజిషన్ లీడర్‌ని కలవడానికే అయ్యుంటుంది..." అన్నాడు ధనా రస్క్ తెచ్చిన ట్రక్కెక్కుతూ.

"ఎవరా లీడర్?" అన్నాడు రిషీ.

"మన ప్రెసిడెంట్ మస్క్!" అన్నాడు ధనా.

రిషీకి మైండ్ బ్లాంకయ్యింది కొంచెం సేపు. "ప్రెసిడెంట్ కి ఆపోసిట్ గా పోటీ చేస్తున్నావా?" తలూపాడు ధనా.

"రస్క్, తొందరగా పద, వాణ్ణి క్యాచ్ చెయ్యాలి!" అన్నాడు ధనా.

"బాసూ, మనం విశా సంగతొదిలేసి వీడికెందుకు హెల్ప్ చేస్తున్నాం అసలు?" అన్నాడు రస్క్ సందేహంగా.

"రేయ్, విశా కిడ్నాప్ లో కూడా ప్రెసిడెంట్ కి హ్యాండ్ ఉండే ఉండాలి. తనకి స్పెషల్ గా ఇక్కడ ల్యాబ్ ఇంఛార్జ్ గా పోస్టు తనే దగ్గరుండి ఇప్పిచ్చాడని విన్నాను. రిషీ, నువ్వు వెంటనే అంకుల్ మహాకి కాల్ చేసి చెక్ చెయ్యి అసలేం జరుగుతోందో." అన్నాడు.

రిషీ వెంటనే కాల్చేసి అన్ని రకాలుగా అడిగాడు మహాని.

ప్రతి ప్రశ్నకీ "ప్రెసిడెంట్ రాబర్ట్ మస్కే విశాకి హెల్ప్ చేశాడు." అనే కన్ఫర్మేషన్ వచ్చింది.

"ఎందుకు చేశాడిదంతా?" అడిగాడు రిషీ.

"ఇక్కడ సాయిల్ టెక్నాలజీ పెంచి, ఎర్త్ నుండి ఇంపోర్ట్స్ ఆపగలిగితే, తనకే మళ్ళీ ఓట్లేస్తారని మస్క్ ప్లాన్." అన్నాడు మహా.

"వాట్, మొన్న సెలబ్రేషన్స్ లో ఎర్త్ నుండి ఫుల్ గా ఇండిపెండెంట్ ఐపోయాం అన్నాడు?"

"అబద్ధం, ఇంకో మూడు నాలుగేళ్ల వరకూ జరిగే పని కాదది. కానీ ఎలక్షన్స్ దగ్గరలో ఉన్నాయని..."

"ఇవన్నీ తెలిసి కూడా విశాని, నన్ను ఇరికించారు మీరు ఇందులో?!" అన్నాడు రిషీ కోపంగా.

"విశాకి ఫేవర్ చేస్తున్నాడనుకున్నా కానీ, ఇంత పని చేస్తాడనుకోలేదు." అన్నాడు మహా దీనంగా.

రిషీ చిరాగ్గా ఫోన్ కట్ చేసి "ఏం చేద్దాం?" అన్నాడు మిగిలిన ఇద్దరితో.

"నాకో ఐడియా వచ్చింది. ఇద్దరికీ పనికొచ్చేది." అన్నాడు ధనా ఆలోచిస్తూ.

## 26

రస్క్ ఫాస్టుగా డ్రైవ్ చేస్తున్నాడు ట్రక్ ని. దాదాపు ముందెల్తున్న లీ ట్రక్ దగ్గరి కొచ్చేసింది. ఇంకో పది నిమిషాల్లో కాలనీ 1 లోకి ఎంటరైపోతారు. ఒక్కసారి ఎంటరైతే లీని పట్టుకోవడం కష్టం. ధనాకో ఐడియా వచ్చింది. వెహికల్స్ ని రిమోట్ గా కంట్రోల్ చేసే యూనిట్ కి సిగ్నల్ పంపి, తనకి తెలిసిన అతనితో ముందు లీ నడుపుతున్న ట్రక్ స్పీడ్ తగ్గించమన్నాడు. వాడు తగ్గించాడు. లీ ఏం చేసినా ఆ ట్రక్ స్పీడందుకోవట్లేదు. రస్క్ రెండు నిమిషాల్లో దాన్ని ఓవర్టేక్ చేసి లీని పట్టుకున్నాడు.

లీని మళ్ళీ వాళ్ళ ట్రక్కులోకి తెచ్చుకొని ధనా బేరాలు మొదలుపెట్టాడు.

"నువ్వు ప్రెసిడెంట్ దగ్గరకే వెళ్ళు, నా గురించి ఇన్ఫర్మేషన్ ఇస్తాననే చెప్పు కానీ మేము చెప్పింది ఇవ్వు చాలు." అన్నాడు.

"తర్వాత వాడికి తెలిస్తే, నన్ను చంపడానికా?" అన్నాడు లీ వెటకారంగా.

"నువ్వు నన్ను ఇర్రిటేట్ చేస్తున్నావ్. నీకెంత కావాలో చెప్పు?" అన్నాడు ధనా.

"అడిగినంతనువ్విివ్వలేవు."

"30% ఇవ్వాలి ప్రతి ట్రాన్సాక్షన్ మీదా..."

"టూ మచ్, 10% నుండి ఒకేసారి 30% కా!"

"మస్క్ ఇస్తానన్నాడు."

"నన్ను పట్టించాక వాడు నిన్నూ ఎక్కడో మార్స్ లోయలో పడేస్తాడు తీస్కెళ్లి. వాడి గురించి సరిగా తెలీదు నీకు."

"నేన్నమ్మను." లీ మొహంలో భయం కనపడింది.

"కనుక్కో, నేను కొన్ని పేర్లు చెప్తాను, వాళ్ళ క్లోజ్ ఫ్రెండ్స్, ఫ్యామిలీ ఎలా మాయమయ్యారో చెబ్తారు నీకు. విన్న తర్వాత నువ్వే కన్ఫర్మ్ చేస్కో." అన్నాడు ధనా క్యాజువల్ గా తన రిస్ట్ డివైజ్ వైపు చూస్తూ.

కాసేపు అటూ ఇటూ చూసి "ఏం చెయ్యాలి?" అనడిగాడు లీ కూల్ గా.

ధనా రిషీ వైపు చూసి నవ్వాడు.

ప్రెసిడెంట్ ప్రతి రోజూ ఈవినింగ్ కాలనీ 1 సెంట్రల్ హౌస్ కొస్తాడు కొన్ని బిజినెస్ మీటింగ్స్ అటెండవ్వడానికి. దానికెదురుగా ఉన్న కెఫేలో ఉన్నారు రిషీ, ధనా, రస్క్ లు. లీ ఆ హౌస్ గార్డ్స్ కి ఒక ఫోల్డ్ చేసున్న పేపర్ ఇచ్చి కెఫేలో కొచ్చి వీళ్లకి దూరంగా వేరే చోట కూర్చున్నాడు. కొంతసేపటికి ప్రెసిడెంట్ ఇద్దరు బాడీ గార్డులతో ఆ కెఫే వైపు కొచ్చాడు. గార్డులని బైటే ఆపి లోపలి కొచ్చి లీ టేబుల్ దగ్గరికెళ్ళాడు.

“టూ మినిట్స్ టైం నీకు, ఏం ఇవ్వాలనుకున్నావ్? ఏం ఇన్ఫర్మేషన్?” అన్నాడు.

“సర్, మీకు బాగా ఉపయోగపడేదే. కాతే నాకు పదివేల మార్స్ కాయిన్స్ కావాలి.” అన్నాడు లీ.

“ముందు ఇన్ఫర్మేషనివ్వు, చూసి నీకెంతివ్వాలో చూస్తా. లేతే మా వాళ్ళే నిన్ను లేపేసి తీస్కుంటారు.” అన్నాడు చెయ్యి ముందుకి చాచి ఇవ్వమని సైగ చేస్తూ.

“సారీ, నేను తీసిన ఫొటోస్, వీడియోస్ ఒక మైక్రో డ్రైవ్ లో బాత్‌రూం సింక్ కింద అటాచ్ చేశాను.” అన్నాడు వెనక బాత్‌రూం వైపు చెయ్యి చూపిస్తూ.

“ఏంటి గేమ్స్ ఆడుతున్నావా?” అన్నాడు ప్రెసిడెంట్ కోపంగా.

“లేదు. నాకు త్రెట్ ఉంది ఆ ధనా నుంచి, నన్ను కిడ్నాప్ చెయ్యడానిక్కూడా ట్రై చేశాడు. సో కేర్ ఫుల్ గా ఉంటున్నాను.” అన్నాడు.

ప్రెసిడెంట్ లేచి బాత్‌రూం వైపు వెళ్లబోతుంటే “నా మార్స్ కాయిన్స్...?” అడిగాడు లీ.

దానికేం సమాధానం చెప్పకుండా హడావిడిగా లోపలి కెళ్ళి తలుపేసి, సింక్ కింద వెతకడం మొదలుపెట్టాడు ప్రెసిడెంట్. లీ చెప్పినట్టే అక్కడొక ప్యాకెట్టుంది.

“అయ్యో! దొరికేసిందా?” అని వినపడింది ప్రెసిడెంట్ మస్క్ కి. హఠాత్తుగా తడబడి వెనక్కి చూస్తే ఒక టాయిలెట్ లోంచి బైటికొస్తున్నాడు ధనా. డోర్ వైపు పరిగెడదామని చూస్తే రిషీ అక్కడ అడ్డంగా నిలబడున్నాడు.

“హేయ్, తప్పు చేస్తున్నారు మీరు. నువ్వేంటి, అనవసరంగా మార్స్ పాలిటిక్స్ లో ఇరుక్కోకు.” అన్నాడు రిషీ వైపు చూస్తూ.

“పాలిటిక్స్ ఆడుతోందే నువ్వు. మేం జస్ట్ నీ గేమ్స్ ఆపడానికొచ్చాం అంతే.” అన్నాడు రిషీ.

“నిన్ను ఎర్త్ మీదే లేపెయ్యమని చెప్పాను. మా ఇడియట్స్ మిస్ చేశారు.” అన్నాడు ప్రెసిడెంట్.

“అబ్బబ్బబ్బబ్బ ఏం క్రిమినల్ ప్లానింగూ, ఏం ఎక్సిక్యూషనూ, ఏం యాక్టింగూ!” అన్నాడు ధనా.

“చూడూ, బైట నా గార్డున్నారు. రెండు నిమిషాల్లో ఇక్కడినుంచి నేను బైటికెళ్ళకపోతే, వాళ్ళే లోపలికొస్తారు. తర్వాత మీరిద్దర్నీ కలిపి లోపలెయ్యాల్సుంటుంది.” అన్నాడు ప్రెసిడెంట్ రిలాక్సవుతూ.

"వావ్! రైమింగ్ కింగ్ లా తయారయ్యావ్! మాకూ పెద్ద టైం లేదు. స్ట్రైయిట్ గా పాయింట్ కొస్తాను. విశానెక్కడ దాచావ్ ఇంతకీ?" అన్నాడు ధనా.

"ఇక్కడ నువ్వు చెప్పింది నేను చెయ్యనమ్మా! ఇది చూశాక నేను చెప్పిందే నువ్వు చెయ్యాలి, పాలిటిక్స్ లో కొస్తాదంట, పాలిటిక్స్." అన్నాడు సింక్ కింద దొరికిన ప్యాకెట్ తెరుస్తూ.

"అయ్యో, సార్ ఇప్పుడది మీడియాకిస్తారా? వద్దు సార్, ప్లీజ్...దాన్ని తెరవద్దు సార్, నా రాజకీయ జీవితాన్ని ఓపెన్ చెయ్యక ముందే క్లోజ్ చెయ్యద్దు సార్." అన్నాడు ధనా వంగి బతిమిలాడుతూ.

మస్క్ వంకరగా నవ్వుతూ ఆ ప్యాకెట్ ఓపెన్ చేశాడు. లోపల ఒక లాలీ పాప్ దొరికింది.

రిషీ, ధనా హైఫై ఇచ్చుకోని పగలబడి నవ్వారు.

మస్క్ మొహం ఎర్రగా మారింది. ఒకవేళ డాటా చిప్ దాంట్లో ఉందేమో అని, పటపటా కొరికాడు ఆ లాలీ పాప్ ని పళ్ళతో. ఇంకా పెద్దగా నవ్వారు ఇద్దరూ.

ఎటు తిప్పి చూసినా ఏం దొరకలేదు తనకి. లీ మోసం చేశాడని అర్థమైంది.

"డామిట్!" అని పిచ్చిగా అరుస్తూ దాన్ని విసిరికొట్టాడు.

వాళ్ళిద్దరి నవ్వు చూసేటప్పటికి, ఇంకా ఫైర్ అయ్యి "రేయ్, విశాని ఇప్పటి వరకూ కిడ్నాప్ మాత్రమే చేద్దామనుకున్నా, మీరు నన్ను ఇంత ఇర్రిటేట్ చేశాక, కిడ్నాప్ చేసి తప్పు చేశాననిపిస్తోంది. డైరెక్ట్ గా లేపేస్తా! బతకనివ్వను దాన్ని. దాన్ని అడ్డు పెట్టుకొని మార్స్ మీద నేను ఇంత ప్లాన్ చేస్తే, నిన్ను పెళ్ళి చేసుకొని ఎర్త్ కెల్తుందా? దాన్ని లేపేసాక, నీ ఫ్యామిలీని మొత్తాన్నీ ఇక్కడే మార్స్ లో ఎక్కడో మధ్యలో తీస్కెళ్లి వదిలేస్తా! మొత్తం టూర్ చేద్దురు గాని." అన్నాడు ఆవేశంగా.

రిషీ, ధనా ఇద్దరూ ఒక్కసారిగా నవ్వటం ఆపేసి వరసగా వచ్చి ప్రెసిడెంట్ చెయ్యి లాక్కుని మరీ షేక్ హ్యాండిచ్చి వెనక్కి వెళ్ళారు.

ప్రెసిడెంట్ అయోమయంగా చూశాడు ఇద్దరి వైపూ.

రిషీ సడెన్ గా తలుపు తీస్తూ "యు ఆర్ ఫ్రీ టు గో, సర్! థాంక్స్ ఫర్ యువర్ కైండ్ కో–ఆపరేషన్!" అన్నాడు బౌ చేస్తూ.

"మరి విశా...?" అనుకుంటూ బైట కొచ్చిన ప్రెసిడెంట్ ఆ కెఫేలో ఉన్న స్క్రీన్ మీద వస్తున్న వీడియో చూసి షాక్ తో కదల్లేకపోయాడు.

"ఇప్పుడే అందిన బ్రేకింగ్ న్యూస్. మన అధ్యక్షుడి విశ్వరూపం!" అనే టైటిల్ తో బాత్‌రూం లో జరిగిందంతా లైవ్ లా చూపిస్తున్నారందులో. తన గార్డులే మెల్లగా ప్రెసిడెంట్ దగ్గర కొచ్చి పట్టుకుని తీసుకెళ్లారు.

ధనా పక్కకి తిరిగి రిషీతో "చెప్పానా, ఇద్దరికీ పనికొచ్చే ఐడియా అని." అన్నాడు నవ్వుతూ.

27

**రెండ్రోజుల తర్వాత...**

పెళ్ళి హడావిడితో ఆ ఫంక్షన్ హాల్ అంతా సందడిగా ఉంది. దాని ఎంట్రీనే ఓ గ్రాండ్ ఫోర్ట్ లా తయారు చేసిందా వెడ్డింగ్ డిజైనర్ ఫ్రెండ్. వచ్చిన వాళ్లందరికీ ఓ తలపాగా, మెడ చుట్టూ వేసుకునే శాలువాలూ ఇచ్చారు ఎంట్రన్స్ ముందే. లోపల పెద్ద రాజ దర్బార్ లా ఉంది. ఎదురుగా పెద్ద సింహాసనం, చుట్టూ కొన్ని వీ.ఐ.పీ కుర్చీలు, వాటికి వెనకాల మామూలివి వేసున్నాయి.

మెల్లగా వచ్చి సెటిలవుతున్నారు మహా చుట్టాలూ, ఫ్రెండ్సూ ఆ రాజ్యంలో ప్రజలలాగా!

అందరికన్నా ముందు గుర్రం లాంటి వెహికిల్ లో రిషీ వచ్చాడు. షేర్వాణీ, తలపాగా, పక్కన డిజైనర్ కత్తి పట్టుకుని ఆ సభలోకి దర్జాగా నడుచుకుంటూ వస్తున్నాడు. తనొచ్చేటప్పుడు లౌడ్ గా వెనకాల బ్యాగ్రౌండ్ మ్యూజిక్ స్టార్ట్ అయ్యింది.

"రాజాధిరాజ, రాజ మార్తాండ, పృథివీ పాలక, రిషీ రాయ! పరాక్! బహు పరాక్!"

మెల్లగా వచ్చి రాజులకి ముందు వరసలో వేసిన ఆసనాల్లో వచ్చి కూర్చున్నాడు. తన పక్కనే జగదీశ్, సునందలు రాజూ, రాణీ గెటప్ లో కాస్ట్యూమ్స్ సర్దుకుంటూ కుర్చున్నారు. ఆ హాల్ అంతా అలానే మార్స్ లో ఉన్న ఫేమస్ పర్సనాలిటీస్ తో నిండిపోయింది.

కొంత సేపటికి బీ.జీ.ఎం మారింది. సరదాగా ఉండే మ్యూజిక్ వినిపిస్తోంది. అమ్మాయిల నవ్వులూ, గలగలలూ, పక్కనే పారే నీళ్ళూ, నెమళ్ళ కూతలూ....

ఉన్నట్టుండి...

"జగన్మోహన సుందరీ, శాస్త్రీయ కళా విశారదా, మంగళ గ్రహ యువరాణీ, విశా దేవి వేంచేస్తున్నారహో!!" అంటూ కంచు కంఠంతో అరుపు వినపడింది.

అందరూ లేచి నించున్నారు. ఒక ఆరెంజ్ కలర్ శారీతో, తెల్లగా మెరుస్తున్న జువెలరీతో, రింగు రింగుల జుట్టుతో, తలపై ట్రాన్సపరెంట్ ముసుగుతో, నేల మీద వేస్తున్న పూలను తొక్కుకుంటూ ఠీవిగా లోపలికొస్తోంది విశా. తన వెనకాల అటూ కిరీటంలో మహా, ఇటు ధగధగలాడే కంచి పట్టు చీరలో కీర్తి నడుస్తున్నారు. మహా వచ్చి సింహాసనం ముందు నిలబడి, అందరినీ కూర్చోమని సైగ చేసి, పెద్దగా చెప్పాడు.

"మా మంగళ గ్రహం లో జరుగుతున్న మొట్టమొదటి తెలుగు వివాహానికి అందరికీ ఆహ్వానం! ఈ సభలో మా రాజకుమారి విశా దేవి స్వయంవరం కోసం మేము ప్రత్యేకంగా మత్స్య యంత్రం తెప్పించాం!" అంటూ చప్పట్లు కొట్టాడు. సభ మధ్యలో ఒక సర్కిల్ ప్రొజెక్టయ్యింది. కింద నుండి పెద్ద రాడ్ పైకొచ్చింది. దాని చివర ఒక లేజర్ ఫిష్ తిరుగుతూ కనపడింది.

అందరూ చప్పట్లు కొట్టారు అది చూసి.

"ఇక్కడి కొచ్చిన రాజకుమారులు నలుగురిలో ఎవరు ఈ చేపని తమ బాణంతో కొట్టగలిగితే వాళ్ళ నే మా యువరాణి వరిస్తుంది." అన్నాడు మహా.

మళ్లి ముందు కుర్చోనున్న జగదీశ్ ని గోకి "అన్నాయ్, నాకో డౌట్. ఇప్పుడు ఆ చేపకీ, వాళ్ళమ్మాయకీ లింకేంటంటావ్? ఆ చేపని బాగా కొడితే, వాళ్ళమ్మాయని బాగా చూస్కుంటాడనా? మార్స్ కెళ్ళి నా మనోళ్ళ మూఢనమ్మకాలు పోలేదు. ఛ, నాకు ఇక్కడుండాలనే ఇంట్రస్ట్ పోయింది." అన్నాడు. జగదీశ్ వెనక్కి తిరిగి నోటిమీద వేలేసి చూపించాడు.

మెల్లగా ఆ వెడ్డింగ్ డిజైనర్ వాళ్ళు అరేంజ్ చేసిన డూప్లికేట్ యువరాజులు వచ్చి ఆ మత్స్య యంత్రాన్ని ట్రై చేశారు. ఒకడు ఆ ధనుస్సు నే పైకెత్తలేక పోయాడు. ఇంకోడు పైకెత్తి బాణం వేస్తూ ముందుకు బోర్లా పడ్డాడు. చివరి వాడి బాణం జనాల్లో ఎవడికో తగిలి వాడక్కడికక్కడే కిందపడి గిలగిలా కొట్టుకుంటూ నురగలు కక్కుకున్నాడు. వెంటనే భటులొచ్చి ఆ యువరాజుకి సంకెళ్ళేసి బరబరా ఈడ్చుకెళ్ళారు. ఈ రియాలిటీ షోని అందరూ నోరు వెళ్ళ బెట్టి చూస్తుంటే, రిషీ తన బౌ అండ్ యారో తో సూటిగా కింద ఆ చేప రిఫ్లెక్షన్ చూస్తూ పైకి బాణం వదిలాడు. అది కరెక్ట్ గా ఆ లేజర్ చేపలోకి దూసుకుపోయింది. అందరూ పైకి లేచి చప్పట్లు కొట్టారు. విశా పరిగెత్తుకుంటూ వచ్చి ఒక పూల మాల అతని మెడలో వేసింది సిగ్గుతో చూస్తూ.

తర్వాత అసలు పెళ్ళి  కార్యక్రమం అంతా స్వలా చేతుల్లో టకటకా జరిగిపోయింది. వెడ్డింగ్ డిజైనర్ వాళ్ళు బలవంతం చేసి స్వలాకి పెద్ద గడ్డం, తలమీద కొప్పు పెట్టారు, ఓ పురాతన ఋషిలా కనపడటానికి. ఆ గడ్డం మీద చిరాకు పడుతూ పెళ్ళిని మాత్రం బానే జరిపించాడు స్వలా.

రెండ్రోజుల ముందు తన కిడ్నాప్ వల్ల మూడ్ కొంచెం డల్ గా అయినా, తన అత్త పక్కనే ఉండటంతో విశా చాలా హ్యాపీగా ఉంది పెళ్ళి లో.

పెళ్లయ్యాక అప్పగింతల టైంలో మహా, కీర్తిల కన్నా జగదీశ్ ఎక్కువ డల్ గా కనపడ్డాడు. రిషీ తనని పక్కకి తీసుకెళ్లి , "ఏమైంది డాడీ, అంతా బానే అయ్యింది కదా? ఏదైనా ఇష్యూ వచ్చిందా?" అనడిగితే దిక్కులు చూస్తూ కూర్చున్నాడు జగదీశ్.

మల్లి పక్కగా వచ్చి "అన్నాయ్ కి విశా మనతో వస్తోందని టెన్షన్ గా ఉంది." అన్నాడు.

"వాళ్ళ వాళ్లకి లేని టెన్షన్ ఈయనకెందుకట!" అడిగాడు రిషీ.

"మళ్ళీ పదికోట్లు పెట్టి ఎక్స్ట్రా టికెట్ కొనాలి కదా? మీ మామేమో దాని గురించి మాట్లాడట్లేదు." అన్నాడు మల్లి.

జగదీశ్ తలూపాడు బాధగా.

రిషీకి ఇద్దర్నీ పచ్చి బూతులు తిట్టాలనిపించి యువరాజు గెటప్ లో బావుండదని వాటిని మింగేశాడు.

"రేయ్ రిషీ, ఓ ఐడియా. మీరు ప్రెసిడెంట్ తో చేసిన క్లిప్ ఉంది కదా? ఇక్కడ వైరల్ అయ్యిందీ, దాన్ని 2 కోట్లకి టీవీ420 కి అమ్మేస్తే?" అన్నాడు మల్లి బ్రైన్ మీద వేలితో కొట్టుకుంటూ.

"సూపర్ బాబాయ్! 'మురిక్కాలవల్లోంచి మార్స్ మీద కెళ్ళి అక్కడి ప్రెసిడెంట్ ని మట్టి కరిపించిన మన మదీనా గూడా యోధుడు!' అని టైటిల్స్ పెట్టి కుమ్మేస్తారు." అన్నాడు రిషీ ఉత్సాహంగా.

మల్లి అతడ్ని పైనుంచి కింద దాకా చూసి "పర్లేదురా, మార్స్ నీళ్ళు బానే పడ్డాయ్ నీకు. నా దార్లో కొస్తున్నావ్ మెల్లగా." అన్నాడు.

జగదీశ్ "రేయ్, దయచేసి ఆ టైటిల్ లోంచి 'మురిక్కాలవ' తీయించైరా, కొంచెం రేట్ అడ్జస్ట్ చేస్కుందాం ఆ వారా." అన్నాడు బతిమిలాడుతూ.

విశా వాళ్ళ ఫ్రెండ్స్ ని ఇంట్రడ్యూస్ చెయ్యడానికి రిషీని పిలిచింది. అదే టైంలో లీ కూడా వాళ్లని విష్ చెయ్యడానికొచ్చాడు. రస్క్ అతడ్ని చూసి కంగారు పడుతూ "అదేంటి బయ్యా, అంత పబ్లిగ్గా బైట తిరుగుతున్నావ్? నువ్వు ప్రెసిడెంట్ ని అంత దెబ్బ కొట్టాక, ఏ అండర్ గ్రౌండ్ కో, ఆస్టరాయిడ్ కో మకాం మార్చేశావనుకున్నా!" అన్నాడు.

లీ లైట్ తీసుకుంటూ “మా ధనా అన్న ప్రెసిడెంట్ అవ్వబోతుంటే నాకేం భయం, నో మోర్ హైడింగ్!” అన్నాడు ఓవర్ ధైర్యంతో.

రస్క్ రిషీ చెవిలో “ధనాగాడి నెక్స్ట్ టార్గెట్ వీడే, డౌట్ లేదు!” అన్నాడు.

“రిషీ ఇంకో విషయం చెప్పనా, మీరు రిటర్న్ బుక్ చేస్కున్న స్పేస్ క్రాఫ్ట్ కి కూడా నేనే పైలట్ ని.” అన్నాడు లీ.

“లీ మమ్మల్ని తీస్కెళ్ళేటప్పుడు నీ పాకెట్స్ లో ‘వాల్యుబుల్స్’ తీసుకు రాకు!” అన్నాడు రిషీ నవ్వుతూ, ‘స్మగ్లింగ్ చెయ్యకు’ అని అర్థం వచ్చేలా!

పిచ్చి కోపంతో లీ అరుచుకుంటూ వెళ్ళి పోయాడు అక్కడినుంచి.

“వీడితో జాగ్రత్తగా ఉండాలి బాసూ మీరు, ఎక్కువ ఇర్రిటేట్ అయ్యాడంటే ఎర్త్ కి కాదు, వాడి ఫేవరెట్ ఆస్టరాయిడ్ మీదికి తీస్కెళ్లి గ్రహాంతర కూలీల కింద మార్చేస్తాడు మిమ్మల్ని! ఎందుకు చెప్పు ఈ శాడిస్టులతో” అన్నాడు రస్క్.

ఆ పక్కనే మల్లి “నేనూ రిషీ లాగా ఆ ఫిష్ ని కొడతాను.” అంటూ ఆ బౌ అండ్ యారో పట్టుకుని మత్స్య యంత్రం చుట్టూ తిరుగుతున్నాడు. పక్కనే వాళ్ళావిడ కూడా వచ్చి వింతగా చూస్తూ నించుంది . రెండు బాణాలేసాక “కొంచెం ఆ ఫిష్ ట్యాంక్ నన్నా కిందకి దించండి, లేతే ఆ చేప సైజన్నా పెంచండ్రా!” అని అరిచాడు టెక్నీషియన్స్ తో. వాళ్ళు కొంచెం పెంచారు సైజ్ ని.

“రేయ్, ఇది చాలదు కానీ, అదే పెద్దగా ఉంటుండీ మన సముద్రంలో... ఆ చేపని పెట్టండ్రా, ష్యూర్ గా కొట్టేస్తా.” అన్నాడు.

“పాపం తిమింగలం వాళ్ళ దగ్గర లేదోమోనండీ!” అంది వాళ్ళావిడ.

“పిచ్చి మొహమా, తిమింగలం ఆ పైన ఫిష్ ట్యాంక్ లో పడుతుందా? నేనడిగింది షార్క్. అదైతే పర్ ఫెక్ట్ గా ఉంటుంది.” అన్నాడు. వీళ్ళిద్దరూ ఈ డిస్కషన్లో బిజీగా ఉంటే, పక్కనే ఒక పెద్దాయనొచ్చి “హలో, ఇందాకటి నుంచి చూస్తున్నా మిమ్మల్ని, అది ఫిష్ ట్యాంకూ, షార్క్ ట్యాంకూ కాదు. ‘మత్స్య యంత్రం’ “అన్నాడు మల్లితో చిరాగ్గా మొహం పెట్టి.

“మాకు వేరే లాంగ్వేజ్ లు తెలీవు సార్! ఓన్లీ తెలుగు.” అన్నాడు మల్లి.

“తెలుగులోనే నేను చెప్పింది.” అన్నాడతను.

“బ్బబ్బబ్బబ్బ, కొత్త కొత్త వర్డ్స్ కనిపెట్టి నాలాంటోళ్ళని కన్ఫ్యూస్ చేసేస్తున్నారబ్బా.” అన్నాడు మల్లి తలమీద చెయ్యి పెట్టుకుంటూ.

“అసలు నీలాంటి వాళ్ళ వల్లే తెలుగు భాష ఎర్త్ మీద దాదాపు చచ్చిపోయింది. మా లాంటివాళ్లు కష్టపడి మార్స్ లో అన్నా కొంత బతికిస్తున్నాం.” అన్నాడు.

మల్లి అయోమయంగా మొహం పెట్టి “ఎవరు సార్ మీరు?” అన్నాడు అతనితో.

చప్పట్లు కొట్టి విజిలేసినంత పని చేసింది మల్లి వాళ్ళావిడ.

“ఆ ప్రశ్న అందరూ మా ఆయనన్నడుగుతారెప్పుడూ. ఫస్ట్ టైం, మా ఆయన ఇంకోళ్ళనడగటం!”

“నేనా? మార్స్ ‘మన బడి’ డైరెక్టర్ని. తెలుగులో మార్స్ మీద ఫస్ట్ పీహెచ్డీ నాదే. అంతే కాదు 2075 లో జరిగిన ‘గహాంతర నవలల కాంపిటీషన్లో విన్నర్ ని కూడా.” అన్నాడతను గర్వంగా.

ఆ చుట్టుపక్కల కనపడకుండా పారిపోయాడు మల్లి.

TV420 వాళ్ళు ఒక్క క్షణం వదలకుండా ఫుల్ గా కవర్ చేశారీ మొట్టమొదటి తెలుగు గ్రహాంతర వివాహాన్ని. మధ్య మధ్యలో ‘మార్స్ లో మనోడి సాహస గాథలు.’ అని రిషీ క్లిప్స్ ని కూడా వేశారు ఎంటర్టైన్మెంట్ కోసం!

28

రెండేళ్ల తర్వాత

పెళ్లయ్యాక విశా, రిషీతో పాటు ఎర్త్ కొచ్చేసింది. ప్రతి మూడేళ్ళకీ, కొన్నాళ్ళు మార్స్ కెళ్ళొచ్చేలా రిషీతో ఒప్పందం కుదుర్చుకుంది. వాళ్ళిద్దరికీ రీసెంట్ గా పుట్టిన పాపని విశిష్టంగా గుర్తిస్తూ రెండు గ్రహాలూ సిటిజెన్ షిప్ ని ఇచ్చాయి. వాళ్ళు కనిపెట్టిన ‘సాయిల్ రెన్యూ’ టెక్నాలజీని రెండు గ్రహాలలో ఇంప్లిమెంట్ చేశారు విశా కపుల్.

రాబర్ట్ మస్క్ ని జైల్లో పడేశాక, నెక్స్ట్ ఎలక్షన్లో ధనా విపరీతంగా డబ్బు పంచేసి, కొన్ని చోట్ల రిగ్గింగ్ చేసి మార్స్ ఎన్నికల్లో గెలిచాడు. కానీ కొంతకాలం ప్రెసిడెంట్ గా చేశాక, తన మెయిన్ ఇష్టాలూ, హాబీలైన స్మగ్లింగూ, ఇల్లీగల్ మైనింగ్ కార్యకలాపాలకి టైం ఎక్కువ దొరకట్లేదనీ, అందువల్ల ‘జాబ్ శాటిస్ఫాక్షన్’ లేదనీ ఈ మధ్యే రిసైన్ చేశాడు. అతని తర్వాత, తన రైట్ హ్యాండైన లీ ప్రెసిడెంట్ గా నిలబడదామని ట్రై చేస్తున్నాడు.

రిషీ పెళ్లి టైంలో ఎక్కువ కాలం బైటే గడిపిన స్వలా, మార్స్ అంతా తిరిగి కాలనీ 1 బైట మైన్ రోడ్డుకి పక్కనే పదెకరాల మంచి ప్లాట్ సంపాదించాడు. వాళ్ళ పెళ్ళి రోజునే ‘మంగళ గ్రహంలో మొట్టమొదటి టెంపుల్ విత్ క్యాంటీన్’ అని తన గుడి ప్రపోసల్ అనౌన్స్ చేసాడు. భక్తితో పాటు భుక్తి కూడా ఉండడంతో, అక్కడి NRE (నాన్ రెసిడెంట్ ఎర్త్ లింగ్స్) సంఘాలు ఎగబడి డొనేషన్స్ ఇచ్చాయి. అక్కడ గుడి కట్టించడం లో బిజీగా ప్రతి ఏడూ మార్స్ కీ, ఎర్త్ కీ మధ్య

రెండు, మూడూ ట్రిప్పులేస్తూ ఫుల్ బిజీ అయిపోయాడు స్వలా. మల్లి తనతో 'గ్రహాంతర స్పెషల్' ఫ్లైట్ ప్రస్తావన తెస్తే, తప్పించుకోని తిరుగుతున్నాడు.

రస్క్ ఇప్పుడు మార్స్ మొత్తానికీ 'మూవీ డిస్ట్రిబ్యూటర్' గా ఎదిగాడు. ఎర్త్ మూవీ జనాల మాటలు పడలేక, మార్స్ మీదున్న పిచ్చి అభిమానంతో అక్కడే 'మార్స్ ఆర్టిస్ట్స్ అసోషియేషన్ (MAA) ని పెట్టి చిన్న సైజ్ ఫిల్మ్ ఇండస్ట్రీ తయారు చేస్తున్నాడు. వెడ్డింగ్ డిజైనర్ రక్ష, అతని ఫిల్మ్స్ కి 'ప్రొడక్షన్ డిజైనర్' గా మారిపోయింది. ఎప్పటికైనా అక్కడి నుండి 'ప్యాన్ యూనివర్స్' ఫిల్మ్ తీయాలనే కలతో బతుకుతున్నారు వాళ్లిద్దరూ!

రిషీ చెల్లెలు నీలూ లాస్ట్ ఇయర్ ఒక ఎమ్మెల్యే క్యాండిడేట్ కి చేసిన 'పొలిటికల్ ఫ్యాషన్' డ్రెస్సుల వల్ల అతను సీఎం సీటు సంపాదించడంతో, దశ తిరిగిపోయి ఇండియాలో పెద్ద,పెద్ద పొలిటీషియన్స్ తో పని చెయ్యడం మొదలుపెట్టింది. అప్పుడప్పుడూ జగదీశ్ కి ఫైనాన్షియల్ సలహాలిస్తూ, ఇంట్లో మార్కులు కూడా కొట్టేస్తూ ఉంటుంది.

మల్లి తన గ్యాంబ్లింగ్ ని నెక్స్ట్ లెవెల్ కి తీసుకెళ్లి 'మార్స్ – ఎర్త్ ఫ్రెండ్లీ గ్యాంబ్లింగ్ గ్యాంగ్' ని స్థాపించాడు. పేరుకే గానీ అందులో ఎవడూ ఫ్రెండ్లీగా ఉండడనీ, తేడా వస్తే రాకెట్టేసుకొచ్చైనా మర్డర్ చేసే మెంబర్లు ఆ క్లబ్బులో ఉన్నారనీ కొందరు గిట్టని వాళ్ళు ప్రచారం చేస్తూ ఉంటారు.